నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

మోదీ ప్రభుత్వ గొప్పలు – పేదలకు తప్పని తిప్పలు

షేక్ హసీనాకు ఆరు నెలల జైలు

దేవాలయాల వెలికితీతకు గ్రీన్‌సిగ్నల్

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 213 | గురువారం | 03-07-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

9న దేశవ్యాప్త సార్వత్రిక

## సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

**జాతీయ సమితి సమావేశం తీర్మానం**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా జూలై 9న సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగ సమాఖ్యలు, సంఘాల ఇచ్చిన పిలుపునకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు సిపిఐ శ్రేణులు అందులో ప్రత్యక్షంగా పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని అజయ్‌భవన్‌లో బుధవారం ప్రారంభమైన సిపిఐ జాతీయ సమితి సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది.ఈ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా,వ్యవసాయ కార్మికుల సంఘాల సంయుక్త వేదిక మద్దతు ప్రకటించాయని, తమ డిమాండ్లతో పాటు, కార్మిక సంఘాల డిమాండ్లకు మద్దతుగా గ్రామీణ భారతదేశంలో భారీగా ప్రజలను సమీకరించాలని నిర్ణయించాయని పేర్కొంది. కార్మిక సంఘాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల డిమాండ్లకు సిపిఐ జాతీయ సమితి మద్దతు ప్రకటించింది. 'జూలై 9న జరగనున్న కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు పిలుపు సంఘాలు పిలుపు ఇచ్చాయి. ప్రభుత్వ రంగ సంస్థలు,ప్రజా సేవలను ప్రైవేటీకరించడం, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు , క్యాజువల్ కార్మికుల విధానానికి వ్యతిరేకంగా, కార్మికులకు వ్యతిరేకంగా, యజమానులకు అనుకూలంగా రూపొందించిన నాలుగు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నాయ'ని తీర్మానంలో సిపిఐ పేర్కొంది. 'ఈ చట్టాలు కార్మిక సంఘాల ఉద్యమాన్ని అణచివేయడానికి, నిర్వీర్యం చేయడానికి ఉద్దేశించినవి. పనిగంటల పెంపు, సామూహిక బేరసారాల హక్కును లాక్కోవడం, సమ్మె హక్కును లాక్కోవడం, యజమానులు కార్మిక చట్టాల ఉల్లంఘనలను నేరరహితం చేయడం, అదే సమయంలో కార్మిక సంఘాల కార్యకలాపాలను నేరంగా పరిగణించడం వంటి వాటికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నాయ'ని వివరించింది. నిరుద్యోగాన్ని పరిష్కరించాలని, మంజూరైన పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని, మరిన్ని ఉద్యోగాలను సృష్టించాలని, ఉపాధి హామీ కార్మికుల పనిదినాలను, వేతనాలను పెంచాలని, పట్టణ ప్రాంతాలకు కూడా ఇలాంటి చట్టాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని సిపిఐ జాతీయ సమితి తెలిపింది.

రాష్ట్రంలో 9 నుంచి 12వ తరగతి

# విద్యా విధానం

అమలు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



- పది పాసైనా ఇంటర్ పూర్తి కావడంలేదు
- అందుకే 9–12 తరగతి విధానం పరిశీలన
- ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో '9–12వ తరగతి'(9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు) విధానాన్ని అమలు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఇంటర్మీడియట్‌ను,12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి, ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్‌జిఒలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పని సరిగా ఇంటర్మీడియట్‌ను పూర్తి చేసేలా చూడాలని, పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపించినప్పటికీ ఇంటర్మీడియట్ పూర్తయ్యేసరికే ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సిఎం సూచించారు. విద్యాశాఖపై హైదరాబాద్‌లోని ఐసిసిసిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వ హించారు. విద్యార్థి జీవితంలో

తరువాయి 12లో

గాజాలో 60 రోజులు

## కాల్పుల విరమణ

ఇజ్రాయెల్ అంగీకారం

వెల్లడించిన ట్రంప్

**వాషింగ్టన్ :** గాజా స్ట్రిప్‌లో 60 రోజులపాటు హమాస్‌తో కాల్పుల విరమణను ఖరారు చేసేందుకు వీలుగా అమలు చేయాల్సిన షరతులకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ అంగీకారం తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ ఈ విషయం చెప్పారు. 'వచ్చే వారమే కాల్పుల విరమణ, ఇంకా సజీవులుగా ఉన్న బందీల విడుదల జరుగుతుంది, నేతన్యాహూ కూడా ఇదే కోరుకుంటున్నారు'' అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా నెతన్యాహూ వచ్చేవారం అమెరికా పర్యటనకు స్వదేశంలో ఎదురైన ఆటంకాలన్నీ తొలగిపోయాయి. ''రెండు నెలలపాటు కాల్పుల విరమణ అమలు చేసేందుకు, యుద్ధ విరమణకు వీలుగా ఈ సమస్యతో ముడిపడిన అందరితో కలిసి మేం కృషి చేస్తాం'' అని తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. అమెరికాలో పర్యటిస్తున్న ఇజ్రాయెల్ వ్యూహాత్మక వ్యవహారాల మంత్రి రోన్‌డెర్మెర్‌తో వైట్‌హౌస్‌లో అధికారులు సంభాషణలు చేశారు. ఈ సంభాషణల సారాంశాన్ని క్రోడీకరిస్తూ ట్రంప్ సోషల్ మీడియాలో బుధవారం పోస్టింగ్ పెట్టారు. ఇజ్రాయెల్‌ను ఒప్పించే బాధ్యత అమెరికా స్వీకరించగా, హమాస్‌ను కాల్పుల విరమణకు ఒప్పించి సానుకూల తుదినిర్ణయం తీసుకునేవిధంగా లొంగదీసే బాధ్యతలను ఖతార్,

తరువాయి 2లో

కుల గణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ

## అధ్యయన నివేదిక సిద్ధం

- 242 కులాల వారీగా సిబిఐ స్కోర్, ర్యాంకింగ్
- వారం రోజుల్లో సిఎం, డిప్యూటీ సిఎంకు అందజేయనున్నట్లు కమిటీ వెల్లడి



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో చేపట్టిన కుల గణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ (ఐఇడబ్ల్యుజి) తన నివేదికను రూపొందించింది. ఈ నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందించడానికి సిద్ధం చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం 2024 నవంబర్, డిసెంబర్ నెలలలో నిర్వహించిన కుల గణన సర్వే డేటాను అధ్యయనం, విశ్లేషణ, ధృవీకరణ

తరువాయి 2లో



## 14 నుంచి కొత్త రేషన్ కార్డులు

- తుంగతుర్తి నియోజకవర్గంలో సిఎం చేతులమీదుగా ప్రారంభం : మంత్రి ఉత్తమ్
- అందరి సహకారంతో నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి
- ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి

జిల్లా మంత్రులు, ఎంపీలు ,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో నల్లగొండ జిల్లాను ముందుకు తీసుకు వెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్చార్జి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని, ప్రతిరోజు రైతులకు సంబంధించిన అంశాలపై మండల స్థాయి అధికారులతో జిల్లా అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఎరువులు, విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి నిలపాలని చెప్పారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, అలాకాకుండా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రైతు భరోసా వంటి ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, వ్యవసాయ విద్యుత్

తరువాయి 2లో

చేనేత కార్మికులకు

## రూ.33 కోట్లు రుణమాఫీ

5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి : మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్

సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న చేనేత కార్మికుల రూ.33 కోట్ల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం పరిపాలన అనుమతులను జారీ చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులకు లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నామని తద్వారా. 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరునుందన్నారు. ఇంతకుముందు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 2017 ఏప్రిల్ 1వ తేది నుండి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో చేనేత వస్త్రాల ఉత్పత్తి, వృత్తి సంబంధిత కార్యకలాపాలకు సంబంధించి తీసుకున్నరూ. లక్ష వరకు రుణాల (అసలు, వడ్డీ కలిపి) మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల వారిగా లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, ఇది పూర్తైన వెంటనే కార్మికుల ఖాతాలలో రుణమాఫీ నిధులను జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే మళ్లీ ఆ మేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయని మంత్రిపేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఇప్పటీ వరకు దాదాపు రూ.920 కోట్లు ఖర్చు చేశామని మంత్రి వెల్లడించారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పనికల్పించాలనే ఉద్ధేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు టిజిసిఓ నుండే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీచేశామని, దీంతో ఇప్పటికే రూ.579 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఆర్డర్లు వచ్చాయని మంత్రి వెల్లడించారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా సిరిసిల్లలోని 16 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.రూ 193 కోట్లు చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, అంతేకాకుండ గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన రూ.290 కోట్లను తమ ప్రభుత్వం నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాలలో జమ చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి అమలు

## బాధ్యత కలెక్టర్లదే

**8 జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో సమావేశం**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం, పేదల కలలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధింత అధికారులను అదేశించారు.రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ రెండు పథకాల ఫలితాలు పేదల గుడిసే వరకు చేర్చాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని మంత్రి స్పష్టం చేశారు. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని బుధవారం మంత్రి తన కార్యాలయంలో నిర్మల్, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల , వనపర్తి జిల్లాల కలెక్టర్లతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 'ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడితే స్వరాష్ట్రంలో గత 10 ఏళ్లుగా ఎదుర్కొన్న భూ సమస్యలకు విముక్తి లభిస్తుందని , సొంతింటి కల నెరవేరుతుందని తెలంగాణ ప్రజానీకం అత్యంత నమ్మకం ,విశ్వాసంతో తమకు అధికారం అప్పగించారన్నారు. వారి నమ్మకాన్ని విశ్వాసాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా భూభారతి చట్టానికి, అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చట్టాన్ని రూపొందించడం ఒక ఎత్తైతే దాన్ని అమలు చేయడం మరో ఎత్తు అని, ఈ చట్టం ఫలితాలు ప్రతి పేదవానికి అందినప్పుడే చట్టం సార్ధకత నెరవేరుతుందని, ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాల్సిన గురుతరమైన బాధ్యత కలెక్టర్లపై ఉందని మంత్రి పేర్కొన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్యుడు సైతం సంతోషపడేలా రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి

తరువాయి 2లో

సిగాచి తరహా దుర్ఘటనలో

## ప్రభుత్వాలదే ఎక్కువ బాధ్యత

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఎఐటియుసి డిమాండ్



**న్యూఢిల్లీ :** తెలంగాణలోని సంగారెడ్డిలో సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో మరణించిన 40 మంది కార్మికులు, ఢిల్లీలోని రిథాలాలోని అక్రమ ఫ్యాక్టరీలో మరణించిన నలుగురికి, తమిళనాడులోని శివకాశిలోని బాణాసంచా ఫ్యాక్టరీలో మరణించిన మరో నలుగురికి ఎఐటియుసి సంతాపం తెలియజేసింది. మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి

తరువాయి 2లో

## సిగాచీ మృతుల లెక్క తేలలే!

- ఇప్పటికి 40 మంది గుర్తింపు .. మరింత పెరిగే అవకాశం
- రూ. కోటి పరిహారం ప్రకటించిన యాజమాన్యం



ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం ప్రారిశ్రామిక వాడాలోని సిగాచి పరిశ్రమలో రియాక్టర్ పేలుడు అంతులేని విషాదంగా మారింది. మూడ్రోజులైన ఎంత మంది చనిపోయారు,అనే లెక్క ఇప్పటికి తేలలేదు. సహాయక చర్యలు జరగుతున్న పరిస్థితి అంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటి వరకు అధికారులు ధృవీకరించిన లెక్కలకు , పరిశ్రమలో

తరువాయి 2లో


### పేలుళ్లపై అధ్యయానికి నిపుణుల కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కంపెనీలో చోటు చేసుకున్న పేలుడు ఘటనపై ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సిఎస్ఐఆర్–ఐఐసిటి ప్రముఖ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా సిఎస్ఐఆర్ చీఫ్ శాస్త్రవేత్త టి.ప్రతాప్ కుమార్, సిఎస్ఐఆర్–సిఎల్ఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, సిఐఎస్ఆర్–ఎన్‌సిఎల్ పుణె భద్రతాధికారి సంతోష్ ఘుగే సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం

తరువాయి 2లో

## 'హస్తం'... సమాయత్తం..



స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేస్తున్న కాంగ్రెస్

రేపు హైదరాబాద్‌లో పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం

హాజరుకానున్న ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సన్నద్ధమైంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడం, ప్రభుత్వ ప్రతిష్టపెంపు, పార్టీ కేడర్‌ను క్రియాశీలంగా చేయడం లక్ష్యంగా చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్షాన్ని ఎదుర్కొవడంపైనే కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా దృష్టిపెట్టింది. ఇక పార్టీని సంస్థాగతంగా పటిష్టవంతం చేసేందుకు సమయాత్తమైంది. ఇందులో భాగంగా ఇప్పటికే

తరువాయి 12లో

### ఖర్గే సభను విజయవంతం చేయండి

డిప్యూటీ సిఎం భట్టి

ఈనెల 4న హైదరాబాదు ఎల్‌బి స్టేడియంలో జరగనున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని గ్రామ శాఖ అధ్యక్షులు, మొదలు మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మల్లికార్జున ఖర్గే

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS


## ఐఎఇఎతో కటీఫ్ ఉత్తర్వుపై ఇరాన్ అధ్యక్షుడు సంతకం



**టెహ్రాన్:** ఐక్యరాజ్యసమితి అనుబంధ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ (ఐఎఇఎ)తో సహకారాన్ని రద్దుచేసుకుంటున్నట్లు ప్రకటించిన ఇరాన్ బుధవారంనాడు ఈ మేరకు ఒక ఉత్తర్వు జారీ చేసింది. అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఈ ఉత్తర్వుపై సంతకాలు చేశారు. ఐఎఇఎ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఇరాన్ విమర్శించింది. ఇజ్రాయెల్–అమెరికా దేశాలు అసాధారణ రీతిలో ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేసిన 12 రోజుల యుద్ధం తర్వాత, ఐఎఇఎతో సంబంధాలను రద్దుచేసుకోవాలని ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు.గతవారంలో ఇరాన్ పార్లమెంటు ఐఎఇఎను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఒక తీర్మానం చేసింది. దాని కొనసాగింపుగా దేశాధ్యక్షుడు ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉక్రేన్‌లో యుద్ధం ఆపండి
## కారణం పశ్చిమదేశాలే కదా

### పుతిన్– మేక్రాన్ మధ్య రెండు గంటలు ఫోన్ సంభాషణ



**మాస్కో:** రెండున్నర సంవత్సరాల తర్వాత మొదటిసారి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ మళ్ళీ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా అనేక ప్రాపంచిక విషయాలను వారు చర్చించారు. వారిమధ్య రెండు గంటలసేపు సుదీర్ఘ ఫోన్ సంభాషణ కొనసాగింది. ఉక్రేన్‌లో కాల్పుల విరమణ పాటించాలని ఈ సందర్భంగా పుతిన్‌ను మేక్రాన్ కోరారు. ఐతే కాల్పుల విరమణకు పశ్చిమదేశాలే ప్రధాన ఆటంకంగా ఉన్నాయని, ఈ యుద్ధానికి పశ్చిమదేశాలే ప్రధాన కారణమని వెంటనే పుతిన్ ఆయనకు తెలియజేశారు. ఉక్రేన్ సార్వభౌమాధికారానికీ, ప్రాదేశిక సమగ్రతకు ఫ్రాన్స్‌దేశం గట్టి మద్దతు ఇస్తుందని మేక్రాన్ ఆయనకు చెబుతూ రెండు దేశాలు చర్చలకు రావాలని కోరారు. సంప్రదింపుల ద్వారా ఒక స్థిరమైన, కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని పుతిన్‌ను ఆయన కోరారు. పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న విధానాల ప్రత్యక్ష పర్యవసానమే ఉక్రేన్‌లో యుద్ధమని పుతిన్ ఆయనకు తెలియజేశారు.

ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా సాగించిన 12 రోజుల యుద్ధం పూర్తయిన వారం రోజుల తర్వాత వీరిమధ్య జరిగిన సంభాషణలో ఇరాన్ విషయం కూడా ప్రధానంగా చర్చకు వచ్చింది. ఇరాన్‌కు యురేనియంను శుద్ధిచేసుకునే హక్కు ఉందని మేక్రాన్‌కు పుతిన్ స్పష్టం చేశారు. శాంతియుత ప్రయోజనాలకోసం అణుశక్తిని ఎవరైనా ఉపయోగించుకోవచ్చుననీ, ఇరాన్‌కు ఆ హక్కు ఉందని పుతిన్ ఉద్ఘాటించారు. ఫ్రాన్స్ చొరవతోనే, వారి అభ్యర్థన మేరకు పుతిన్‌తో మేక్రాన్ టెలిఫోన్ సంభాషణ జరిగిందని రష్యా అధ్యక్షుడి అధికా ప్రతినిధి దీమిత్రీ పెస్కోవ్‌ను ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ బుధవారంనాడు ప్రకటించింది. 2022 వ సంవత్సరం వరకూ రష్యా–ఫ్రాన్స్‌దేశాల అధ్యక్షుడు నిరంతరాయంగా టెలిఫోన్ ద్వారా అనుసంధానంలో ఉండేవారు. కానీ ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్‌తో మేక్రాన్ ఈ సంబంధాలను వదులుకున్నారు. కానీ ఇప్పుడు ఆకస్మికంగా ఫ్రాన్స్ ప్రభుత్వం అభ్యర్థన మేరకే పుతిన్‌తో మేక్రాన్ సంభాషణ జరిగిందని దీమిత్రీ పెస్కోవ్ చెప్పారు. జులై ఒకటో తేదీన నాయకులిద్దరిమధ్యా ఈ ఫోన్ సంభాషణ జరిగిందని ఆయన చెప్పారు. నాయకులిద్దరిమధ్యా సంభాషణలు కేవలం లాంఛనపూర్వకంగానే జరిగాయని ఇటు క్రెమ్లిన్, అటు ఎలైసీ ప్యాలెస్‌లు అధికారిక ప్రకటనలు చేశాయి.

## షేక్ హసీనాకు ఆరు నెలల జైలు



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా కోర్టు విచారణ ప్రక్రియకు ఆటంకం కలిగించి ఉల్లంఘన నేరానికి పాల్పడినందుకుగాను ఆమెకు ఢాకాలోని ఐసిటి ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్ ఆరునెలలు జైలుశిక్ష ప్రకటించింది. బంగ్లాదేశ్‌లో ఆమె చేసిన నేరాలకుగాను ఒకవైపు విచారణ ప్రక్రియ కొనసాగుతుండగా హసీనా చేసిన వ్యాఖ్యలను ఉల్లంఘన చర్యగా ఐసిటి పరిగణించింది. జస్టిస్ మోర్తుజా మొజుందార్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ఐసిటి ధర్మాసనం పైవిధంగా స్పందించింది. షేక్ హసీనా ఫోన్ సంభాషణలు బయటకు పొక్కాయి. అవన్నీ సోషల్ మీడియాలోకి అప్‌లోడ్ అయ్యాయి. వీటిని ఐసిటి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆమె వ్యాఖ్యలను కోర్టు ప్రక్రియను అణగదొక్కే చర్యగా, ఉల్లంఘన చర్యగా పరిగణించి ఆరునెలలు జైలుశిక్ష విధిస్తున్నట్లు మొజుందార్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారంనాడు తీర్పు చెప్పింది. ''నాపై 227 కేసులు నమోదయ్యాయి, అంటే నేను 227 మందిని హత్య చేయడానికి లైసెన్స్ లభించింది'' అని బయటకు పొక్కిన ఫోన్ సంభాషణలో హసీనా చెబుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలుస్తున్నది. గోవింద్ గంజ్ ఉపజిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు షకీల్ అకాండ బుల్బుల్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ హసీనా పై వ్యాఖ్యలు చేసిన వీడియోలు, వాయిస్‌లు సోషల్ మీడియాకు ఎక్కాయని చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలు కోర్టును అణగదొక్కే హసీనా ప్రత్యక్ష చర్యలుగా ఐసిటి న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీన చీఫ్ ప్రాసిక్యూటర్ తజుల్ ఇస్లామ్ హసీనా వ్యాఖ్యలను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ గొంతు హసీనాదే అని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ కూడా ధృవీకరించిందని ఆయన ఐసిటికి చెప్పారు.

### రాజకీయ దురద్దేశంతోనే నాపై నేరాలు మోపారుఃహసీనా

మానవత్వానికి వ్యతిరేకంగా దారుణ హత్యలకు పాల్పడినట్లు ఐసిటిలో చేసిన అభియోగాలను బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా తిరస్కరించారు. తాను ఎలాంటి నేరాలకు పాల్పడలేదని పేర్కొన్నారు. ఆమె తరపున వాదనలు చేయడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం నియమించిన న్యాయవాది ఈ విషయం వెల్లడించారు. గత ఏడాది జులైలో విద్యార్థుల తిరుగుబాటు సందర్భంగా 1,400 మందిని హతమార్చినట్లు ఐక్యరాజ్యసమితి తన నివేదికలో పేర్కొంది. అధికారం నిలబెట్టుకోవడంకోసం విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయాలని ఆమె ప్రభుత్వం జారీ చేసిన విఫల ఉత్తర్వుల సమయంలో ఈ మరణాలు సంభవించాయని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అనుకూల పరిస్థితులు, కోసం, కుట్ర, ప్రేరేపణ, సామూహిక హత్యల నివారణలో వైఫల్యం వంటి అభియోగాలను హసీనాపై మోపారు. ఇవన్నీ మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలుగా ఐసిటి పరిగణించింది. బంగ్లాదేశ్‌లో నిషేధానికి గురైన ఆమె పార్టీ అవామీలీగ్ సోమవారంనాడు లండన్‌లో ఒక ప్రకటన చేస్తూ, రాజకీయ దురుద్దేశాలతో, తమకు అనుకూలంగా ఒక సానుకూలమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవడంకోసం తమపై ఈ విధంగా నేరాలు మోపారని ఆ ప్రకటన పేర్కొంది.

## గాజాలో దాడుల్లో ఇండోనేసియా ఆసుపత్రి డైరెక్టర్ కుటుంబం మృతి

**గాజా:** గాజాలో ఇజ్రాయెల్ బుధవారం ఉదయం నుండీ చేసిన దాడుల్లో 43 మంది పాలస్తీనయన్లు మరణించారు. ఈ దాడుల్లో గాజాలో ఉన్న ఇండోనేసియా ఆసుపత్రి డైరెక్టర్ మార్వన్ అల్ సుల్తాన్ సహా ఆయన మొత్తం కుటుంబం హతమైంది. మృతుల్లో అల్ సుల్తాన్‌తోపాటు ఆయన భార్య పిల్లలు కూడా ఉన్నారు. గాజా సిటీ నైరుతీ ప్రాంతంలో ఉన్న ఆయన నివాసిత భవనంపై గగనతల దాడులు చేయడంతో ఆయన కుటుంబం హతమైంది. గాజాలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు బాహ్య ప్రపంచానికి తెలియజేయడంలో మార్వన్ అల్ సుల్తాన్ ప్రధానపాత్ర పోషిస్తున్నారు. గాజాలోకి విదేశీ జర్నలిస్టులను అనుమతించడంలేదు. ఇండోనేసియా ఆసుపత్రిని ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధనం చేసిందని, గాజాలో ఉన్న జర్నలిస్టులకు, వైద్య సేవకులకు పూర్తి భద్రత ఇవ్వాలని ఆయన పదే పదే బాహ్య ప్రపంచానికి విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా తుల్కెరామ్ శరణార్థ శిబిరం వద్ద 400 పాలస్తినా కుటుంబాలు సమీకృతమయ్యాయి. శిథిలాల నుండి తమ నివాసాలను పునరుద్ధరించుకునేందుకు వారు ప్రయత్నం చేస్తున్నారు. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెలీ దళాల ఆదేశంతో 100 ఇళ్ళు కూల్చేశారు. 400 కుటుంబాలు నిరాశ్రయమయ్యాయి. 2023 అక్టోబరు ఏడో తేదీన గాజాలో మొదలైన యుద్ధం ఈ బుధవారంనాటికి 635వ రోజుకు చేరుకుంది.

## అమెరికా పర్యటనకు వీలుగా నెతన్యాహూకు ఇజ్రాయెల్ కోర్టు క్లియరెన్స్



**టెల్‌అవీవ్ :** ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ వచ్చేవారం అమెరికా పర్యటనకు వెళ్ళడానికి ఆటంకాలన్నీ తొలగిపోయాయి. స్వదేశంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నెతన్యాహూ తప్పనిసరిగా కోర్టుకు రావాల్సిందేనని తొలుత హుకుం జారీ చేసిన న్యాయస్థానం తర్వాత తన పట్టుసడలించి, జాతీయ అత్యవసర వ్యవహారాలు చక్కబెట్టాల్సిన బా ధ్యతలున్నందువల్ల ఈ అనుమతి మంజూరు చేసింది. క్రిమినల్ కేసు విచారణ నిమిత్తం జెరూసలెం జిల్లా కోర్టుకు వచ్చేవారం నిర్ణీత ప్రకారం నెతన్యాహూ హాజరుకావాల్సి ఉంది. సాక్ష్యం ఇచ్చేందుకు కోర్టుకు రాకుండా న్యాయస్థానం ఆయనకు అనుమతి ఇచ్చింది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి కీలకమైన చర్చలు ఉన్నందువల్ల ఆయన అమెరికా పర్యటన చేయాల్సి ఉం దని నెతన్యాహూ కార్యాలయం కోర్టును కోరింది. వచ్చే ఆదివారం నుండి మంగళవారం వరకూగానీ లేదా శు క్రవారంగానీ నెతన్యాహూ అమెరికా పర్యటన ఉం టుందని ఆయన అటార్నీ అమిత్ హదద్ చెప్పారు. పర్యటన సందర్భంగా ట్రంప్‌తోపాటు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, విదేశాంగమంత్రి మార్కో రుబియో, మధ్యప్రాచ్య వ్యవహారాల ప్రత్యేక ప్రతినిధి విట్‌కాఫ్, రక్షణమంత్రి పెటే హెగ్సెత్, ఇతర సీనియర్ కాంగ్రెస్ సభ్యులతో నెతన్యాహూ చర్చలు జరుపుతారు. అందువల్ల అటూ ఇటూగా దాదాపు ఒక నెల రోజులపాటు ఆయన స్వదేశంలో కోర్టు వ్యవహారాలకు దూరంగా గడిపేందుకు అవకాశాలు ఉన్నాయి.

## ఎక్కువ బాధ్యత
(మొదటి పేజీ తరువాయి)

రూ.50 లక్షలు, తీవ్రంగా గాయపడి వికలాంగులుగా మారిన ప్రతి వ్యక్తికి రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ బుధవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రమాదాలకు యజమానులు మాత్రమే కాకుండా, ప్రభుత్వాలే ఎక్కువ బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో భద్రతపై అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌ఒ) 155, 188 సదస్సుల తీర్మానాలను ఆమోదించాలని, కార్మికాఏక చట్టాలను రద్దు చేయాలని అమర్‌జీత్ కౌర్ డిమాండ్ చేశారు. గత పదకొండు సంవత్సరాలుగా మోడీదీ ప్రభుత్వం ( ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులభతర వ్యాపారం) పేరుతో యజమానులకు లాభం చేకూర్చే విధంగా, కార్మికులకు వ్యతిరేకంగా కార్మిక చట్టాలను నీరుగార్చిందని విమర్శించారు. తనిఖీలను రద్దు చేయడం, యజమానుల ఉల్లంఘనలను నేరరహితం చేయడం, పనిగంటలను పెంచడం, సమ్మె హక్కును లాగేసుకోవడం వంటి చర్యలు పాల్పడిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసి) పొందడంలో సడలింపులు ఇవ్వడమే కాకుండా, కార్మికుల హక్కులను, పారిశ్రామిక సంస్థల పరిసరాల్లో నివసించే ప్రజల జీవితాలను విస్మరించి ఈ చట్టాలపై కొన్ని సంవత్సరాలు మారటోరియం కూడా విధించిందని తెలిపారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మికులను గినియా పిగ్‌లుగా పరిగణిస్తోందని, కార్మిక చట్టాల మార్పులన్నీ పని ప్రదేశాలలో జరుగుతున్న ఉల్లంఘనలను చట్టబద్ధం చేయడానికి ఉద్దేశించినవని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా జూలై 9న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి, నిరంతర పోరాటాలను కొనసాగించడానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## అధ్యయన నివేదిక సిద్ధం
(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలను ఐఇడబ్ల్యుజికి అప్పగించింది. డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల సంస్థ (ఎంసిహెచ్‌ఆర్‌డి)లో బుధవారం కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో నివేదికకు తుది రూపమిచ్చారు. కుల గణనలో పేర్కొన్న 242 కులాల వెనుకబాటుతనానికి సంబంధించి 'కంపొజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్ (సిబిఐ) సూచీని నివేదికలో పొందుపర్చింది. మొత్తం 300 పేజీలకుపైగా రూపొందించిన నివేదికలో 242 కులాల వారీగా వెనుకబాటుపై సిబిఐ స్కోర్, ర్యాంకులను సూచించింది. మరో వారం రోజుల్లో నివేదిక సిద్ధమవుతుందని, నివేదికను అందించడానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కమిటీ సమయం కోరిందని కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. సమావేశంలో కమిటీ వైస్ చైర్మన్ కంచ ఐలయ్య, కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తి, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, డాక్టర్ సుఖ్దేవ్ థొరోట్, డాక్టర్ హిమాన్షు, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భుక్య, ప్రొఫెసర్ పురుషోత్తమ్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిటీ కార్యదర్శి అనుదీప్ దూరిశెట్టి పాల్గొన్నారు.

## బాధ్యత కలెక్టర్లదే (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాకూడా దాని ప్రభావం ఈ పథకంపై పడకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక, ఇండ్ల మంజూరు, నిర్మాణ పనుల పర్యవేక్షణ. ఈ మూడు అంశాలను కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేయడానికి వెనుకాడ వద్దని ఆదేశించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక అందేలా పర్యవేక్షించాలని, అలాగే ఇంటి నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ ఇటుకల కోసం మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, వీలైనంత త్వరితగతిన ఈ కమిటీలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

## కాల్పుల విరమణ (మొదటి పేజీ తరువాయి)

ఈజిప్టు ప్రభుత్వాలు స్వీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. ''మధ్యప్రాచ్యానికి ఇక మంచి జరుగుతుందని నేను ఆశాభావంతో ఉన్నాను. హమాస్ ఈ ఒప్పందాన్ని అంగీకరించాలి, ఎందుకంటే ఇంతకంటే మంచి అవకాశం, మేలైన అవకాశం హమాస్‌కు లభించదు, దీనిన్ని వారు చెడగొట్టుకోకూడదు'' అని ట్రంప్ రాశారు. అనేక నెలలుగా ఈ తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందంపై కసరత్తు జరుగుతోందని ఆయన తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. యుద్ధాన్ని తిరిగి చేపట్టగలశక్తిసామర్థ్యాలు తమకు ఉన్నాయని ఇజ్రాయెల్ చెబుతుండగా, ఈ తాత్కాలిక కాల్పుల విరమణను శాశ్వతం చేయాలని చాలాకాలంగా హమాస్ కోరుతున్నది. దీంతో 21 నెలలుగా గాజాలో సాగుతున్న మారణహోమం అంతమయ్యేందుకు శుభఘడియలు సమీపించాయని భావిస్తున్నారు. ఐతే ఒప్పందం కుదరడానికి ఇంకా కొన్ని ముఖ్యమైన ఆటంకాలను తొలగించాల్సి ఉందని అరబ్‌దేశాల మధ్యవర్తులు చెబుతున్నారు. నిర్ణీత ప్రకారం నెతన్యాహూ వచ్చేవారం వాషింగ్టన్ పర్యటనకు సన్నద్ధం అవుతున్నారు. గాజాలో యుద్ధ విరమణకు తాను చాలా చాలా కృతనిశ్చయంతో ఉన్నానని ఇటీవల అనేకసార్లు ట్రంప్ ఉద్ఘాటనలు చేస్తున్నారు. ఇంతకుముందు కూడా ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ వరకూ 45 రోజులపాటు ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విమర్శలు, పరస్పర ఆరోపణలమధ్య బలవంతంగా అమలు జరిగింది. ఆ తర్వాత కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు మళ్ళీ చర్చలు జరిపేందుకు రావాలని హమాస్ ప్రతిపాదించినప్పటికీ ఇజ్రాయెల్ తిరస్కరించింది. ఎలాంటి చర్చలూ లేకుండా కాల్పుల విరమణను యథాతథంగా కొనసాగించాలని చేసిన ప్రతిపాదనను హమాస్ తిరస్కరించింది. ఇక తర్వాత మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి అంతర్జాతీయంగా అందుతున్న మానవతా సహాయాన్ని అనుమతించకుండా ఇజ్రాయెల్ అడ్డుకుని పాలస్తినాలో కరువుకాటకాలకు ఆజ్యం పోసింది. విరామం తర్వాత మార్చి 18వ తేదీ నుండీ గాజాలో మళ్ళీ యుద్ధం ప్రారంభించి ఇప్పటివరకూ దాదాపు ఆరువేలమందిని హతమార్చింది. 2023 అక్టోబరు 7వ తేదీన యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకు 56 వేలమందిపైగా పాలస్తీనియన్లు మరణించారు. మరో 14వేలమంది శిథిలాల్లో కూరుకుని మరణించారని అంతర్జాతీయ అధ్యయన సంస్థలు అంచనావేశాయి.ఈ బుధవారంనాటితో ఇజ్రాయెల్ – హమాస్ మధ్య గాజాలో యుద్ధం 635 రోజులు పూర్తిచేసుకుంది.

## మృతుల లెక్క తేలలే
(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న కార్మికుల లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఇం కా పదుల సంఖ్యలో కార్మికుల ఆచూకి లభ్యం కావడం లేదు. దీంతో భాదిత కుటుంబ సభ్యులు పరిశ్రమ వద్ద ఆందోళన కొనసాగిస్తునే ఉన్నారు. వారి ఆ చూకి తెలపాలంటూ అధికారులకు ప్రాధేయపడుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తుండడంతో సహాయ చర్యలకు తీవ్ర అటంకం ఏర్పడడంతో తాత్కాలికంగా సహాయక చర్యలను నిలిపి వేశారు. బుధవారం ఉదయం నుంచి రెస్క్యూ టీం పనులు మొదలు పెట్టారు . శిథిలాల కింద ఇంకా కార్మికులున్నారని భావిస్తున్నారు. అయితే అధికారికంగా 40 మంది చనిపోయినట్లు అధికారులు ప్రకటించిన మరణాల సంఖ్య అంతకు మించి ఉందని అధికారులు చెప్పుతున్నా లెక్కకు బయట జరుగుతున్న పరిస్థితులకు పొంతన కుదరడం లేదని భాదిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుదవారం రాత్రి వరకు ప్రమాదానికి సంబందించిన పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశముందని అధికారులు చెపుతున్నారు.

### సహాయక చర్యలు కొనసాగుతున్నాయి : దామోదర్ రాజనర్సింహా

సిగాచి పరిశ్రమ వద్ద వేగంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయడం లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహా భాదిత కుటుంబాలకు తెలిపారు. బుదవారం ఉదయం ఆయన సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న క్రమంలో మంత్రిని భాదిత కుటుంబాలు,బందువులు పెద్ద సంఖ్యలో పరిశ్రమ వద్దకు చేరుకుని అడ్డుకున్నారు విదులకు హాజరై ఆచూకి లేకుండా పోయిన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ వారి ఆచూకి గురించి అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేసారు. మూడు రోజులు గడుస్తున్నా తమ వారి గురించి సమాచారం ఇవ్వడం లేదని బోరున విలపించారు. పోలీసులు అడ్డుకోవడంతో అందోళనకు దిగారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహాయక చర్యలు పర్యవేక్షించారు. కలెక్టర్ ప్రావీణ్య ,ఎస్పీ పరితోష్ పంకజ్‌కు పలు సూచనలు ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి నచ్చ చెప్పారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

### మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

తమ కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందజేస్తామని సిగాచి కంపెనీ (సెక్రటరీ వివేక్ కుమార్) యాజమాన్యం వెల్లడించింది. పరిశ్రమలో పేలుడు జరిగిన మూడు రోజులకు యాజమాన్యం స్పందించింది. ఈ దుర్ఘటనలో 40 మంది కార్మికులు మృతి చెందగా 35 మంది వరకు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారని యాజమాన్యం ప్రకటించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి యాజమాన్యం లేఖ వ్రాసింది. రియాక్టర్ పేలి ప్రమాదం జరగలేదని పూర్తి విచారణ తరువాత ఎందుకు .. ఏలా ఈ ప్రమాదం జరిగిందో వెల్లడిస్తామని పేర్కొన్నది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల వైద్య ఖర్చులు యాజమాన్యం భరిస్తుందన్నారు. మంగళవారం ఘటన స్థలాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి పరిశ్రమ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. కంపెనీ యాజమాన్యం ఎక్కడ ఉన్నదని , అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. మానవత్వ కోణంలో నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాగా ముఖ్యమంత్రి ఆగ్రహంతో దిగి వచ్చిన యాజమాన్యం రూ. కోటి రూపాయాల చొప్పున పరిహారం ప్రకటించింది. .


### భాదితులను పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ,పిసీసీ చీప్ మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పిసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, పిసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డిలు మొదటగా ఆసుపత్రి లో చికిత్స పొం దుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిశ్రమ వద్దకు వచ్చి సహాయక చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

## నిపుణుల కమిటీ ఏర్పాటు
(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ సిగాచి కంపెనీలో చోటు చేసుక్న ప్రమాదానికి గల కారణాలతో పాటు కంపెనీలో భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా తదితర అంశాలను క్షుణంగా అధ్యయనం చేసి నెల రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది. అదేవిధంగా భవిష్యత్‌లో కెమికల్ కంపెనీల్లో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండ ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను సూచించాల్సిందిగా ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి కావాల్సిన సహాయ సహకారాలను అందించాలని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను ప్రభుత్వం ఆదేశించింది.


## కొత్త రేషన్‌కార్డులు
(మొదటి పేజీ తరువాయి)



కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు శాసనసభ్యుల విజ్ఞప్తుల మేరకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పక్షం రోజులకు ఒక సారి సమీక్ష సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా తుంగతుర్తి నియోజకవర్గం, తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అప్పటివరకు రేషన్ కార్డుల కై వచ్చిన దరఖాస్తులన్నింటిని ఈనెల 13 లోగా పరిశీలించి అర్హులైన వారందరినీ ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌ఎల్బీసీ పనుల పునః ప్రారంభానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని, భారత సైన్యం లో పనిచేసిన అధికారులను డిప్యూటేషన్ పై తీసుకొని ఎలక్ట్రో మాగ్నెటిక్ లీడర్ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిండి,హెచ్ ఎల్ సి లైనింగ్ , నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ బునియాధిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువలను పూర్తి చేస్తామని అయితే వీటి భూసేకరణను పూర్తి చేసే విషయంపై శాసనసభ్యులు దృష్టి నిలపాలని కోరారు. అధికారులు ఆయా పథకాలకు లబ్ధిదారులు ఎంపికలో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని, నిజాయితీ, పారదర్శకతతో ప్రజలకు కనిపించేలా పని చేయాలని, నెలలో రెండుసార్లు సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

### ఎస్‌ఎల్ బిసి, టన్నెల్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి


రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్‌అండ్‌బి ద్వారా జిల్లాకు ఎక్కువ నిధులు తేవడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు ఇచ్చేందుకు కృషి చేస్తానని 45 కోట్లతో సంగెం బ్రిడ్జికి మంజూరు ఇవ్వడం జరిగిందని, నల్లగొండ మల్లేపల్లి దేవరకొండ రహదారులను హామ్ రోడ్ కింద మంజూరు చేశామని,రాష్ట్రవ్యాప్తంగా 1200 కోట్ల రూపాయలతో అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు హాం పథకం కింద డబుల్ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయడం జరిగిందని, పంచాయతీరాజ్ రోడ్లను సైతం హామ్ కింద కు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఎల్ బిసి, టన్నెల్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని,ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పై ప్రత్యేకంగా రివ్యూ చేస్తామని ,ఇన్చార్జి మినిస్టర్ జిల్లాకు ఎక్కువ సమయం కేటాయించాలని, ప్రాథమిక వైద్యం, విద్య ప్రభుత్వానికి అతి ముఖ్యమైనవని, వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని కోరారు.ఎస్డిఎఫ్ కింద ప్రతి ఎమ్మెల్యేలకు తక్షణమే ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని , ఇందుకు సంబంధించి టోకెన్లు రైజ్ చేయాలని ఎమ్మెల్యేలతో కోరారు. నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి,భువనగిరి పార్లమెంట్ సభ్యులు చమల కిరణ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య,భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి,దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం,నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, నీటిపారుదల ,విద్య, వ్యవసాయం, వైద్యం ,ఆరోగ్యం, భూభారతి, మహిళా శక్తి, సంక్షేమం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశానికి వివరించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### బేస్మెంట్ నిర్మించుకున్న వారికి సడలింపు ఇవ్వాలే

ఫార్మా కంపెనీల అనుమతులు రద్దు చేయాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గత ప్రభుత్వంలో వివక్షతకు,నిర్లక్ష్యం గురైన సాగు నీటి ప్రాజెక్టుల పూర్తి చెయాడనికి ప్రజా ప్రభుత్వంలో జిల్లాలకు చెందిన ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డిల భుజస్కందాల పైన ఉందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో సత్యం మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా మునుగోడు మండలం కిష్టాపురం వరకు నీరు అందించేందుకు భూ సేకరణ పనులు పూర్తి కావడం జరిగిందని కిష్టాపురం వరకు నీరు అందించాలని కోరారు. మునుగోడు నియోజకవర్గం పరిధిలోని శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని వారికి నష్ట పరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా ఫ్లోరైడ్‌తో దశాబ్దాలుగా పోరాటం చేసిన మునుగోడు ప్రాంతాని నాశనం చేసేందుకు మరోవైపున ఫార్మా కంపెనీలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని వాటి అనుమతులు రద్దు చేయాలని కోరారు. కిష్టాపురం గట్టుప్పల తదితర ప్రాంతాలలో నిర్మాణం చేసే ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజల ఉద్యమాలు చేస్తున్నారని,పరిధిలో గల చౌటుప్పల్,పంతంగి చుట్టుపక్కల గ్రామాలైన వెలిమినేడు,గుండ్రాంపల్లి లాంటి గ్రామాలలో ఇప్పటికే కంపెనీలు వెలసి భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని పేర్కొన్నారు.గత పది సంవత్సరాలుగా నిరుపేదలకు ఇండ్లు రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు పారదర్శకంగా జరిగినప్పటికీ కొంతమంది నిరుపేదలు ఇప్పటికే ఇండ్ల నిర్మాణానికి బేస్మెంట్ నిర్మించుకోవడం జరిగిందని అలాంటి వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఆంక్షలు సడలింపాలని కోరారు. సంస్థాన్ నారాయణ పురం మండల ప్రాంతంలో ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత తీవ్రంగా ఉందని వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. రెండో విడత ఎక్కువ మందికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులలో పేదలను రకరకాల టెస్టుల పేరుతో విపరీతంగా డబ్బులు గుంజుకుంటున్నారని అలాంటి ఆసుపత్రుల పట్ల చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రైవేటు విద్యాసంస్థలలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల యజమానులు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విపరీతంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## హిందీ పుస్తక ప్రపంచంలో పండితురాలు విభా భారతి మృతి




**ప్రజాపక్షం/హైదరాబాద్:**మిలింద్ ప్రకాశన్ ప్రచురణ సంస్థ సంచాలకురాలు, హిందీ పుస్తక ప్రపంచంలో పండితురాలు, ప్రముఖ సమాజ సేవకురాలు విభా భారతి మంగళవారం కాచిగూడలోని ఆమె స్వగృహంలో మరణించారు. హైదరాబాదులో హిందీ పుస్తకాలకు చిరునామాగా ఉన్న మిలింద్ ప్రకాశన్ వ్యవస్థాపకులు శృతికాంత్ భారతి సతీమణి విభా భారతి. దేశవ్యాప్తంగా ప్రముఖ ప్రచురణ సంస్థల హిందీ పుస్తకాలను పంపిణీ చేస్తూ ప్రజల అందుబాటులోకి మిలింద్ ప్రకాశన్ సంస్థ తీసుకువచ్చింది.

**హైదరాబాదు బుక్ ఫెయిర్ సంతాపం:**విభా భారతి మరణంపట్ల హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ సంతాపాన్ని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేసింది.

# దేవాలయాల వెలికితీతకు గ్రీన్ సిగ్నల్

* స్పెషల్ సెక్రటరి నేతృత్వంలో కమిటి
* పర్యవేక్షిస్తున్న మంత్రి కొండా సురేఖ





**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో శతాబ్దాల క్రితం నుంచి వివిధ కారణాలతో కనుమరుగైన పురాతన, ప్రాచీన హిందూ దేవాలయాలను గుర్తించి, వెలికి తీసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కసరత్తు ప్రారంభించారు. త్వరలో ప్రధాన ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీ ని వేయనున్నారు. ఈ కమిటీలో దేవాదాయ శాఖతో పాటు మున్సిపల్ శాఖ, ఫైనాన్స్ శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఉంటారు. ఈ కమిటి తెలంగాణలోని అన్ని జిల్లాలో పర్యటించి కనుమరుగైన పురాతన, ప్రాచీన దేవాలయాలను గుర్తిస్తారు. ఆ దేవాలయాలు ఎందుకు కనుమరుగయ్యాయి, వాటి ప్రాముఖ్యత ఏమిటి, దూపదీప నైవేద్యాలకు అవి ఎందు కు నోచుకోలేదు, దశాబ్దాల నుంచి వాటిని ఇంతవరకు ఎందుకు గుర్తింపులోకి రాలేదు, ప్రస్తుతం వాటి ఆనవా ళ్లు, పరిస్థితులు, నిర్మాణాలు, పునరుద్ధరించేందుకు కావాల్సిన ఆర్థిక వనరులపై ఈ కమిటీ అధ్యాయ నం చేస్తుంది. ఆ తరువాత ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించనుంది. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆలయాల పునరుద్దరణకు చర్యలు తీసుకోనుంది. నిజాం కాలం లో దాడులవల్ల తెలంగాణలో కొన్ని దేవాలయాలు ధ్వంసంఅయి కనుమరుగయ్యాయి. ఇలాంటి దేవాలయాలను గుర్తించి వాడుకలోకి తీసువస్తారు.

తెలంగాణలో ఇప్పటికే 6ఎ కింద (వంద కోట్లకు పైగా వచ్చే ఆదాయం) దేవాలయాలు రాజరాజేశ్వర దేవాలయం, వేములవాడ, కొండగట్టు, చిల్కూర్ బాలాజీ దేవాలయం, యాదగిరి గుట్ట దేవాలయం, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం, లక్ష్మీ నరసింహ ఆలయం ధర్మపురి, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయం, రంగనాథస్వామి దేవాలయం, జియాగూడ ఛాయా సోమేశ్వరాలయం, వర్గల్ సరస్వతి ఆలయం, శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం, కీసరగుట్ట దేవాలయం, సురేంద్రపురి శ్రీ రంగనాయక స్వామి దేవాలయం ఉన్నాయి. అలాగే రూ.50 కోట్లనుంచి రూ. 100 కోట్ల వరకు ఆదాయం కలిగి ఉండే దేవాలయాలు సుమారు 16 వరకు ఉన్నాయి.

**సిఎస్ఆర్ నిధుల ద్వారా ఆలయాల అభివృద్ధి..?**

పురాతన ఆలయాల అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేయాలని దేవాదాయ శాఖ యోచిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పురాతన ఆలయాలను గుర్తించి, వాటిని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో అభివృద్ధి చేసే అవకాశాలపై చర్చిస్తోంది. దేవాదాయ పురాతన ఆలయాలను గుర్తించిన తర్వాత ఆయా ఆలయాల ప్రత్యేకతలు, ప్రాముఖ్యతను గుర్తించి, వాటికి సిఎస్ఆర్ నిధులను అనుసంధానం చేయనున్నట్టు తెలిసింది. దీనికి సంబంధించిన కసరత్తు మొదలు పెట్టారు.దేవాదాయ శాఖ వివిధ సంస్థలతో కలిసి మరింత సంరక్షణ చర్యలు చేపడితే, రాష్ట్రంలోని ప్రాచీన సంపద మరోసారి వెలుగులోనికి తీసుకు రాగలదు. ప్రజల భాగస్వామంతో కొన్ని గ్రామాల్లో పై రూ.3 కోట్లను స్వయంగా సమకూర్చి 11 వ శతాబ్దపు పంచకుట శివాలయం తిరిగి నిర్మాణం జరిగింది..

**కనుమరుగైన కొన్ని దేవాలయాలు ఇవే..**

- పెద్దాపల్లి జిల్లా మంథనీలో 13వ శతాబ్దం కాకతీయ శిల్పకళను కలిగిన గౌతమేశ్వర దేవాల యం సహా పలు చిన్న పుణ్యక్షేత్రాలు గోడలు కూలిపోయాయి. విగ్రహాలు పగులగొట్టి ఉన్నాయి. శిల్పా లు శిధిలమయ్యాయి.
- ఖమ్మంపల్లిలో గోదావరి నదీ ఉడత ప్రాంతంలో ఉంది. మూడు ద్వారాల శివాలయం ఇది. ఇక్కడ విగ్రహాలు పడిపోయి ఉన్నాయి. కళ్లు, చేతులుపై భారీ ధ్వంసం జరిగింది .
- జగిత్యాల తాటిపెల్లి కొండ దేవాలయం.. దక్షిణచాళుక్యుల శిల్పకళను కలిగిన 9వ,10వ శతాబ్దపు నరసింహా స్వామి విగ్రహాలు కొండపై కనుగొనబడ్డాయి. దేవాలయం నిర్మాణం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఔత్సాహిక సంరక్షణ లేకపోవడంతో ఇప్పుడు ఓ రహస్య స్థితిలో ఉంది.
- రాజా మజిలి తరహాలో కాకతీయ కాల శివాలయాలు రంగారెడ్డి జిల్లాలో పురాతన స్థితిలో ఉన్నాయి; అక్కడి స్థానికులు పురాతత్వ శాఖతో కలిసి అభివృద్ధి ప్రయత్నాలు చేస్తున్నారు .

వీటితో పాటు హైదరాబాద్, దేవరకొండ, నల్గొండ, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలలో పలు దేవాలయాలు కనుమరుగైన స్థితిలో ఉన్నాయి.

**కారణాలు ఇవే...**

యుద్ధాల పర్యవశాత్..భారత్‌లోని మంగోల్లు, బహ్మనీలు, కుతుబ్ షాహీలు ధ్వంస సమయంలో ఆలయాలు ధ్వంసం చేశారు .

ధన సంపాదన కోరిన విగ్రహ దొంగతనాలు.. 201120 దాకా స్కాండల్ కారణంగా ఆలయాలు దొంగిలించబడుతూ, కొన్నిసార్లు నష్టం కలిగింది .

రోడ్డు విస్తరణ, నిర్లక్ష్య సంరక్షణ.. కమ్యూనిటీ లేదా ప్రభుత్వ ఆధ్వర్యం లేక ఆర్కియాలజికల్ పరిరక్షణ లేకపోవడం వల్ల స్వాభావిక కారణాలతో శిల్పాలు పాడయ్యాయి.

# తెలంగాణ జీవన విధానంపై పరిశోధనలు

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి కోటి రూపాయలు మంజూరు
విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ సంస్కృతి, జీవన విధానంపై పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పరిశోధనలకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తమశాఖ ద్వారా కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్ట్స్, సోషల్ సైన్సెస్ లో విభిన్న అంశాల సంవాదం, సంభాషణ అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీవన విధానం గతితప్పడం ఎన్నో సమస్యలకు కారణమవుతుందన్న మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

సామాజిక రుగ్మతలు, దురలవాట్లు, తాహతుకు మించిన ఆడంబరాల వల్ల కుటుంబాలు చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థు లు, పరిశోధకులు, అధ్యాపకులు తెలంగాణ జీవన విధానంపై పరిశోధనలు జరిపి.... మార్పు తీసుకొచ్చే దిశగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వ నుంచి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మానవీయ, సామాజిక శాస్త్రాలలో పరిశోధనలు విస్తృతమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆకాంక్షించారు.

కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించిన ఒయు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో విభిన్న అంశాల్లో ప్రావీణ్యం పొందాల్సిన అనివార్యతను నొక్కి చెప్పారు. విద్యార్థులలో పరిశోధనాత్మక విలువలను పెంపొందింపజేసే పను లు చేస్తున్నందుకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌ని ఈ సందర్భంగా అభినందించారు.

రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మల్టీ డిసిప్లినరీ అత్యంత కీలకమని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ఆచార్య రేవతి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం మాట్లాడుతూ సామాజికార్థిక విషయాలే కాకుండా విజ్ఞాన శాస్త్రాంశాలను కూడా సాహిత్యం సృజనాత్మకంగా చిత్రించిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో యుజిసి డీన్ ప్రొ.లావణ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డా.కొండా నాగేశ్వరరావు, డా. బాలు నాయక్, డాపి. స్వాతి, డా సిఎస్. స్వాతిలతో పాటు వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థు లు పెద్ద యెత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసారు. ఆరువందలమంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధకులు వచ్చి వారి పరిశోధనా పత్రాలను సమర్పించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ, ప్రొఫెసర్ మధుసూదన్, ప్రొఫెస ర్ పార్థసారధి, ఎన్ వేణుగోపాల్, డా. మామిడి హరికృష్ణ, ప్రొఫెసర్ కృష్ణ పాల్గొని మాట్లాడారు.

**ఎరువుల కొరత లేకుండా చూడాలి**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని, జిల్లా కలెక్టర్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లాల వారీగా విత్తనాలు, ఎరువులకు డిమాండ్ ప్రస్తుత నిల్వలు ఎంత అవసరం ఉంటుందనే అంశాలను పరిశీలించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సరఫరా విషయంలో ప్రాథమిక సహకార సంఘం, మార్క్‌ఫెడ్ శాఖల వద్ద ఎలాంటి జాప్యం జరగకూడదని అన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారులు.. ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేసి, స్టాక్ ఉందో లేదో పరిశీలించాలని, ఇవాల్టి నుంచి ఎరువుల సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. డిమాండ అనుకూలంగా ఎరువులు సరఫరా చేయాలని, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని, ఇండెంట్ ప్రకారం స్టాక్ ఉండాలని, ఎక్కడైనా ఎరువుల కొరత ఉందని దృష్టికి వస్తే సంబంధిత వ్యవసాయాధికారిదే బాధ్యత అని స్పష్టంచేశారు.




న్యూఢిల్లీలో జరుగుతున్న సిపిఐ జాతీయ సమితి సమావేశంలో బుధవారం ప్రసంగిస్తున్న జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్



## తెలంగాణ రైతులపై వివక్ష విడనాడాలి

తక్షణమే ఎరువులను సరఫరా చేయాలి : అన్వేష్‌రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రైతులపై కేంద్ర ప్రభుత్వం వివక్షను విడనాడి తక్షణమే ఎరువులను పంపిణీ చేయాలని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తెలంగాణకు అన్ని సందర్భాల్లో వివక్ష చూపుతూనే ఉన్నారని తెలిపారు. హైదరాబాద్ లోని హాకా భవన్‌లో బుధవారం ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు నాయకులు నల్లమల వెంకటేశ్వర్లతో కలిసి అన్వేష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొత్తం 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించగా ఇందులో సగంకూడా సప్లై చేయలేదన్నారు. దీంతో రైతులకు సరిపడా ఎరువులు లేక అన్నదాతలు తీవ్ర ఇబ్బంది పడ్తున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి 8 మంది బిజెపి ఎంపిలు ఉండగా ఇందులో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా కూడా దండగేనన్నారు. ఒక్కరంటే ఒక్కరు కూడా ఎరువుల సమస్యపై ఇప్పటివరకూ మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు.. తెలంగాణ నుంచి కేంద్రానికి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులా.. లేక మరో రాష్ట్రానికి చెందిన మంత్రులా? అన్న అనుమానం కల్గుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగానికి అశనిపాతంలా మారిన ఎరువుల సమస్యపై ప్రధాని మోదీ, కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లపై కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఎందుకు ఒత్తిడి తీసుకురావడంలేదని ప్రశ్నించారు.. బిజెపి నాయకుల వైఖరి చూస్తుంటే.. రైతాంగాన్ని, వ్యవసాయాన్ని విధ్వంసం చేసి ఆ పాపాన్ని కాంగ్రెస్ మీదకు నెట్టేలా ఒక కుట్రపూరిత వైఖరి అవలంబిస్తోందన్న అనుమానం కలుగుతోందన్నారు. జెపి నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్ లపై తెలంగాణ బిజెపి ఎంపిలు ఒత్తిడి తీసుకువచ్చి రైతులు అవసరమైన ఎరువులను అందేలా చూడాలని అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# టిజిఎస్‌డిఎంఇ పునర్వ్యవస్థీకరణ

సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొని, వీలైనంత వరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండే విధంగా 'తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ' (టిజిఎస్‌డిఎంఇ)ను పునర్వ్యవస్థీకరించినట్లు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో వర్షాలు, వరదలకు సంబంధించి, నీటి పారుదల, విద్యుత్, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, పోలీస్, రవాణ తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నామని వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని కానీ వాటి ప్రభావాన్ని మాత్రం తగ్గించేందుకు ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే, నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతామని ఆయన చెప్పారు. 'గోదావరి, కృష్ణా'నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణ అంశంపైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో హైదరాబాద్ లోని సచివాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (తెలంగాణ రాష్ట్ర విప త్తు నిర్వహణ సంస్థ)ను బలోపేతం చేస్తున్నామని, ఈ సంస్థకు ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, రెవెన్యూ, హోం, ఆర్థిక, వైద్య ఆరోగ్యం, భారీ నీటిపారుదల, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు సభ్యులుగానూ, ప్రధాన కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని వివరించారు. 'వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండితో సమన్వయం చేసుకుని, శాస్త్రీయంగా విశ్లేషించుకుని ఎప్పటికప్పుడు పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు ఒక సమాచార వ్యవస్థను రూపొందించుకుని, మరింత బలోపేతం చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రధానంగా కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తం గా ఉండాలని, తద్వారా నష్టాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నదీ పరివాహ క ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏ, ఏ గ్రామాలు ముంపునకు గురవుతాయోననే సమాచారాన్నినీటి పారుదల శాఖ ముందుగానే అందించాలన్నారు. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్థానికంగా పడిన వర్షం, ఎంత నీటిని విడుదల చేశారనే పూర్తి సమగ్ర వివరాలను సేకరించాలన్నారు.

**నివాసితులకు ఇందిరమ్మ ఇండ్లు**

నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడంకాదని, వారికి శాశ్వత నివాసం కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి నివాసితుల వివరాలను గుర్తిస్తే, అదనపు కోటా కింద వారికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలని, ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో గత ఏడాది తన నియోజకవర్గం పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయామని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏ విధంగా ఉండాలి?, విపత్తు ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి? వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, కార్యదర్శి శివశంకర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముస్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి.గోపి. ఐఎండి అధికారి నాగరత్నం. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ ముజముల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## వైట్ ప్లేట్ బైక్ టాక్సీలను నిషేధించాలి: ఐఎఫ్ఎటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుపు నంబర్ ప్లేట్ ఉన్న బైక్ టాక్సీ సేవలపై తక్షణమే నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మోటారు వాహన ఎగ్రిగేటర్ గైడ్‌లైన్స్–2025లో కొన్ని సానుకూల అంశాలను స్వాగతిస్తున్నామని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్ఎటి) జాతీయ ప్రధాన కార్యదర్శి షేక్ సలాహుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఈ గైడ్‌లైన్స్‌లో ఛార్జీల విషయంలో ఏకరీతి లేకపోవడం, సర్జ్ ధరలపై నియంత్రణ లేకపోవడం, రాష్ట్రా ల్లో అమలు లోపించడం వల్ల దేశవ్యాప్తంగా ప్రయాణికులు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశా రు.

ప్రతి యాప్ బేస్డ్ డ్రైవర్‌కు రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ కల్పించటం సముచితంగా ఉందన్నారు. డ్రైవర్లకు బహుళ ప్లాట్‌ఫామ్‌లపై పనిచేసే హక్కు ఆదాయ అవకాశాల రక్షణకు ఇది అత్యంత అవసరం అన్నారు. డ్రైవర్లకు ట్రైనింగ్, వెరిఫికేషన్, వాహన భద్రతపై కేంద్రం దృష్టి పెట్టడం సానుకూలంగా ఉందన్నారు.

**దేశవ్యాప్తంగా ఒకే విధమైన ఛార్జీల విధానం ఎందుకు లేదు?**

ప్రస్తుతం ఛార్జీల విషయంలో ప్రతి రాష్ట్రం తలుచుకున్నట్లు నిర్ణయించుకోవడం, యాప్ కంపెనీలు ఎలాగైనా ఖర్చు పెంచుకోవడం వల్ల ప్రయాణికులకు అనిశ్చితి, డ్రైవర్లకు అస్పష్ట ఆదాయం కొనసాగుతోందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా సమానమైన, పారదర్శక ఛార్జీల విధానాన్ని వెంటనే అమలు చేయాలిలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డ్రైవర్లు కూడా లాభపడటం లేదు. యాప్ కంపెనీలు పెరిగిన ఛార్జీల్లో ఎక్కువ వాటా దక్కించుకుంటున్నాయని ఆరోపించారు.

తెలుపు ప్లేట్ (వైట్ నంబర్ ప్లేట్) ఉన్న ప్రైవేట్ బైక్ల ద్వారా టాక్సీ సేవలు చట్టబద్ధంగా నడుపుట తప్పు. ఇది ప్రయాణికుల భద్రతకు ప్రమాదం, ప్రభుత్వానికి ఆదాయ నష్టం, చట్టబద్ధ డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీస్తోందని తెలిపారు. గిగ్ వర్కర్ల ప్రతినిధులకు అవకాశాలు లేకపోవడం

వేలాది డ్రైవర్లను ప్రాతినిధ్యం వహిస్తున్నా, టిజిపిడబ్ల్యాయు వంటి యూనియన్లను అధికారికంగా సంప్రదించకుండా గైడ్‌లైన్స్ రూపొందించడం తగదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ గైడ్‌లైన్స్ అమలులో కార్మిక సంఘాలను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు.

## మావోయిస్టులకు సహకరించకండి : సిఐ రవీందర్



**ప్రజాపక్షం/గుండాల:** నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎవ్వరూ సహకరించవద్దని సిఐ రవీందర్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వెన్నెలబైలు, సర్వారం, చీమలగూడెం గ్రామాల్లో గుండాల ఎస్ఐ సైజా రవూఫ్, కొమరారం ఎస్ఐ నాగుల్‌మీరాతో కలిసిన జోరువానలో సైతం ఆయన ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి పేర్లను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మావోయిస్టులకు సహాయ సహకారాలు అందించినట్లు పోలీసులకు సమాచారం అందితే సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టులవన్నీ కాలంచెల్లిన సిద్ధాంతాలని, ఆ మాయలో పడి జీవితాలను ఆగం చేసుకోవద్దన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తే ప్రభుత్వం నుండి పునరావాసం కల్పిస్తామని, కుటుంబాలతో సంతోషంగా జీవించవచ్చన్నారు. అమాయక ప్రజలను టార్గెట్ చేసుకుని మావోయిస్టులు తమ ఊబిలోనికి దించుకున్నారని, వారి స్వలాభం కోసం ప్రాణాలు బలి తీసుకుంటున్నారని, యువతకు పోలీస్‌శాఖ నుండి సహాయసహకారాలు అందిస్తామన్నారు. అనంతరం వెన్నెలబైల గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల, కొమరారం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా చర్యలపై దృష్టి సారించారు

దక్షిణ మధ్య రైల్వే కొత్త బాస్ సందీప్ మాథుర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**వర్షాకాల నేపథ్యంలో వంతెనలు, సొరంగాలు వద్ద భద్రతా చర్యలపై ప్రధానంగా దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సందీప్ మాథుర్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించి న అనంతరం సందీప్ మాథుర్ అధికారులతో రైల్వే భద్రతపై సమీక్షా సమావే శం నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్ర వాల్, ప్రధాన విభాగాధిపతులు పాల్గొన్నారు. విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ మరియు నాందేడ్ డివిజన్‌ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్లు, డివిజనల్ ఇంజనీర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. సందీప్ మాథుర్ మాట్లాడుతూ.. ఏదైనా సంఘటన జరిగినప్పుడు అత్యవసర పరికరాల లభ్యత, ఇసుక, రాళ్లు, పైపులు వంటి అవసరమైన వస్తువుల నిల్వలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రమాదానికి గురయ్యే ప్రాంతాలు, వంతెనలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని 24/7పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి వరదకు గురయ్యే అవకాశం ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జిల వద్ద ముందస్తు చర్యలలో భాగంగా చేపట్టిన భద్రతా చర్యలను జనరల్ మేనేజర్ సమీక్షించారు. లిఫ్టింగ్ బారియర్, డ్రైనేజీ పనులు, హెచ్చరిక బోర్డు ఏర్పాటు, 24X7 వాచ్‌మెన్ నిఘా వంటి జాగ్రత్తలను ఆయన పరిశీలించారు. సురక్షితమైన పని విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని, రైలు కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా సరైన విధానంలో నిర్వహించాలని, అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలను చేపట్టాలని ఆయన అధికారులు, సిబ్బందికి సూచించారు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ సర్కిల్ : వికారాబాద్ సర్కిల్

టెండర్ నోటీస్ నెం.06/25-26

వికారాబాద్ సర్కిల్‌లో నిరంతర విద్యుత్ సరఫరాను నిర్వహించడానికి మరియు వర్షాకాల అవసరాలను తీర్చడానికి ఎబి స్విచ్‌లు మరియు సబ్ స్టేషన్ల నిర్వహణ కొరకు మెటీరియల్ అవసరం కోసం మాత్రమే అర్హత కలిగిన బిడ్డర్ల నుండి బిడ్లు ఆహ్వానించబడ్డాయి. 1) 385 నంబర్ల నైలాన్ బుష్‌ల సరఫరా, 2) 569 నంబర్ల 11KV 200A TT AB స్విచ్ ఫిక్స్‌డ్ కాంటాక్ట్స్ సరఫరా, 3) 581 నంబర్ల 11KV 200A TT AB స్విచ్ మూవింగ్ కాంటాక్ట్స్ సరఫరా. మరిన్ని వివరాల కోసం, దయచేసి www.tgsouthernpower.com ని సందర్శించండి. మెటీరియల్ స్పెసిఫికేషన్ వివరాలు పైన ఉన్న వెబ్‌సైట్‌లో ఉంచబడినవి. ఫోన్ నం. 8712469736 లేదా 8712469716, ఇమెయిల్: detcvkb@gmail.com

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్,TGSPDCL, వికారాబాద్.

DIPR R.O. No. : 4479-PP/CL/ADVT/1/2025-26, Date: 02-07-2025

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.యస్.యస్.టి/2025, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 02.07.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:08.07.2025 మంగళవారము రోజున .11.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 09.07.2025 నుండి 08.07.2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 4447-PP/CL/ADVT/1/2025-26, Date: 02-07-2025

ప్రజాపక్షం
గురువారం, 03 జులై

# సిఇసి లక్ష్యాలు గాలికి!

అడవుల సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణపై నిరంతరం దృష్టి సారించి, లోపాలను సవరించడానికి ఏర్పాటైన కేంద్ర సాధికారక కమిటీ (సిఇసి) లక్ష్యాలు గాల్లో కలిసిపోతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశించడంతో, 2002లో ఏర్పాటైన సిఇసిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నదంటూ 60 మంది మాజీ సివిల్ సర్వెంట్ల బృందం ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బిఆర్ గవాయ్‌కి లేఖ రాయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. సిఇసిలో పదవీ విరమణ చేసిన ప్రభుత్వ అధికారులు కాకుండా ఇద్దరు స్వతంత్ర సభ్యులు కూడా ఉండేవారు. అయితే, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సిఇసిని 2023లో సవరించారు. ఈ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవులు నిర్వహించి, పదవీవిరమణ చేసిన అధికారులు మాత్రమే కమిటీలో ఉండాలని నిబంధన మార్చారు. సిఇసిని గుప్పిట్లో పెట్టుకున్నారు. జూన్ 30న సిజెఐకి రాసిన లేఖలో, ఈ సవరణ చట్టం వల్ల సిఇసి ప్రయోజనాలు దెబ్బతినడమేగాక, సహజ న్యాయసూత్రాల ఉల్లంఘన కూడా జరుగుతుందని రిటైర్డ్ బ్యూరోక్రాట్లు ఆందోళన వ్యక్తం చేయడం సముచితం. ఇప్పుడు, సిఇసిలో ఒక చైర్‌పర్సన్, ముగ్గురు సభ్యులు, ఒక ప్రత్యేక కార్యదర్శి ఉన్నారు. ప్రస్తుత చైర్‌పర్సన్ సిద్ధాంత దాస్ అటవీ డైరెక్టర్ జనరల్‌గా, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. ముగ్గురు సభ్యులు, ప్రత్యేక కార్యదర్శి కూడా కీలక పదవులు నిర్వహించిన వారే. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవులు నిర్వహించి, విధివిధానాల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన వారి నుంచి సుప్రీం కోర్టుకు వాస్తవ పరిస్థితులనుగానీ, నిష్పాక్షిక సూచనలనుగానీ ఊహించలేం. అధికారులుగా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధమైన అంశాలను వారు ఏ విధంగా ప్రస్తావిస్తారని సిజెఐకి రాసిన లేఖలో మాజీ బ్యూరోక్రాట్లు ప్రశ్నించారు. అది అక్షర సత్యం. అటవీ సంరక్షణ సవరణ బిల్లును రూపొందించినప్పుడు, అధికారంలో ఉన్న ఒక వ్యక్తి ఇప్పుడు సిఇసి సభ్యుడనే విషయం గుర్తుంచుకోవాలి. అడవులు, పర్యావరణ పరిరక్షణపై శాస్త్రవేత్తలు, నిపుణులు, సామాజిక కార్యకర్తలు లేవనెత్తిన అభ్యంతరాలను అప్పట్లో ఈ అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ముందు కూడా సిఇసి పనితీరును, సవరణలను సమర్థించారు. అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై విచారణ కొనసాగుతున్నది. ఈ పరిస్థితుల్లో సిఇసి సభ్యులు వీరికి అనుకూలంగా స్పందిస్తారానుకోవడం అత్యాశే. సిఇసి గతంలో మాదిరి సుప్రీంకోర్టుకు కాకుండా, అడవులు, పర్యావరణ మంత్రిత్వ శాఖకు నివేదికలు అందచేస్తుందనేది అటవీ సంరక్షణ చట్ట సవరణలో కనిపించే మరో వివాదాస్పద నిర్ణయం. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, సిఇసి చిత్తశుద్ధిని ఈ మార్పులు చెప్పకనే చెప్తున్నాయి. న్యాయ వ్యవస్థను ధిక్కరించే రీతిలో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తన కుట్రపూరిత వ్యూహాలు అమలు పరుస్తున్నది. రాజ్యాంగ వ్యవస్థలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేస్తున్నది. అటవీ నిర్మూలన, వాతావరణ కాలుష్యం మానవాళిని వేధిస్తున్న తరుణంలో, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సిఇసికి రాజకీయ రంగులు అద్దడం, సొంత సంస్థగా మార్చడం మోదీ సర్కారుకే చెల్లింది. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం నీరుగారుస్తూ, ప్రభుత్వ సంస్థలను గుప్పిట్లో పెట్టుకునే నైజం కూడా కేంద్ర ప్రభుత్వానికే ప్రత్యేకం. మాజీ అధికారుల బృందం నేరుగా సిజెఐకే లేఖ రాయాల్సిన దుస్థితి దాపురించడం ప్రమాదకరం. ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలి. న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాలి. అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేసి, సిఇసిలో పాత విధానాన్నే కొనసాగించాలి. ఇది మోదీ ప్రభుత్వ నైతిక బాధ్యత.

# మోదీ ప్రభుత్వ గొప్పలు – పేదలకు తప్పని తిప్పలు

**ధూర్జటి ముఖర్జీ**

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనేక సాఫల్యాలను తన ఖాతాలో వేసుకుంటున్నప్పటికీ, వాటిని సవివరంగా విశ్లేషించినట్లయితే ఒక విషయం తేటతెల్లమవుతుంది. ఆ అభివృద్ధి ప్రాథమికంగా సమాజంలోని ఉన్నత తరగతులకు, మధ్య తరగతులకు లాభించింది. పేద విభాగాలను పట్టించుకోలేదు. దేశవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య ప్రమాణాలు క్షీణించటంలో దీన్ని చూడవచ్చు. ఇందుకు రాష్ట్రాలకు కూడా కొంత బాధ్యత ఉంది.

ఈ అంశాలను ప్రపంచబ్యాంక్ కొంత మేరకు ధృవీకరించింది. అత్యంత దారిద్ర్యంనుంచి 17 కోట్ల 10 లక్షలమందిని బయటకు తేవటం ఎంతో ప్రోత్సాహదాయకంగా అది కనుగొన్నది. దారిద్ర్య రేఖను రోజుకు తలసరి 2.15 డాలర్ల నుంచి 3 డాలర్లకు అది సవరించింది. దారిద్ర్య రేఖను పెంచినపుడు ఎక్కువమంది పేదల్లో చేరతారు కాని తగ్గరు. అటువంటి నివేదికలు వస్తున్నప్పుడు ఆ సమాచారాన్ని ప్రభుత్వం ఖండించదు.

> అభివృద్ధికి సంబంధించి ఇతర కొలమానాలను మనం పరిశీలించినట్లయితే తలసరి ఆదాయం, మానవాభివృద్ధి సూచీ, ప్రపంచ ఆకలి సూచీల్లో మన ర్యాంకింగ్ వరుసగా 144; 130; 105. ఇవి పేదరికాన్ని తెలియజేస్తున్నాయి. అందువల్ల ప్రపంచబ్యాంక్ ఇటీవలి నివేదిక ప్రశంసలకు మురిసిపోవటంలో అర్థం లేదు.

అభివృద్ధికి సంబంధించి ఇతర కొలమానాలను మనం పరిశీలించినట్లయితే తలసరి ఆదాయం, మానవాభివృద్ధి సూచీ, ప్రపంచ ఆకలి సూచీల్లో మన ర్యాంకింగ్ వరుసగా 144; 130; 105. ఇవి పేదరికాన్ని తెలియజేస్తున్నాయి. అందువల్ల ప్రపంచబ్యాంక్ ఇటీవలి నివేదిక ప్రశంసలకు మురిసిపోవటంలో అర్థం లేదు. అంతేకాదు, అత్యంత దారిద్ర్యం నుంచి బయటపడినవారి సంఖ్యను బ్యాంక్ నివేదిక పేర్కొన్నదేగాని వారిప్పుడు ఏ కేటగిరిలో ఉన్నారో చెప్పలేదు. వారిలో అత్యధికులు దారిద్ర్యరేఖకు కొంచెం దిగువన ఉన్నారని, కొందరు ఆర్థిక బలహీనవర్గాలుగా ఉన్నారనీ మనం చెప్పవచ్చునా? అత్యంత దారిద్ర్యం నుంచి బయటకు వచ్చిన అందరూ కాకపోయినా అత్యధికులు ప్రభుత్వం ఇస్తున్న ఉచిత రేషన్, ఇతర సహాయాలమీద ఆధారపడి ఉన్నారు.

కాంగ్రెస్ బుక్‌లెట్, "11 సాల్, ఝూటే వికాస్ కె వాదె" (11 సంవత్సరాలు, బూటకపు అభివృద్ధి గొప్పలు)ను ఎవరైనా ప్రస్తావించవచ్చు. ప్రభుత్వ క్లెయిములను తిరస్కరించటానికి అది ప్రచురితమైన గణాంక సమాచారాన్ని విస్తృతంగా ఉట్టంకించింది. ప్రపంచ ఆకలి సూచీని ఉదహరిస్తూ కాంగ్రెస్ ఇలా చెప్పింది: "పౌష్టికాహారలోపం జాతీయ సంక్షోభంగా కొనసాగుతున్నది. తక్కువ ఎదుగుదల (వయస్సుకు తగినంత ఎత్తు పెరగకపోవటం) 35.5శాతం, పీలతనం (ఎత్తుకుతగ్గ బరువు లేకపోవటం) 19.3 శాతం, బరువు తక్కువ(వయస్సుకు తగ్గ బరువు లేకపోవటం)32.1 శాతంగా ఉంది." స్వచ్ఛభారత్ గూర్చి బ్యాంక్ నివేదిక ఇలా చెప్పింది: "2018–19 నుండి మరుగుదొడ్ల వాడకం ఎస్‌సిల్లో 20 పాయింట్లు, ఎస్‌టిల్లో 24 శాతం





తగ్గింది. టాయిలెట్లు పనిచేయకపోవటం, నీరు లేకపోవటం, మెయింటినెన్స్ కొరవడటం ఇందుకు కారణాలు." మారుమూల గ్రామాల్లో పారిశుద్ధ్యం, సురక్షిత త్రాగునీటి సరఫరా ఎంతో మెరుగుపడాల్సి ఉంది. ఆర్థికరంగాన్ని చూదాం. జిడిపి వృద్ధి నిలకడగా ఉంది. కాని ఆహార ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతూ పేదలు, బలహీన తరగతులకు జీవనాన్ని భారం చేస్తున్నది. మాన్యుఫాక్చరింగ్ విస్తరించకపోవటం, ఎగుమతులను బహుముఖం చేయటంలో, కొత్త మార్కెట్లలో ప్రవేశించటంలో ప్రభుత్వ వైఫల్యంవల్ల ఉద్యోగాల కల్పన జరగటం లేదు. పునాదిస్థాయి అభివృద్ధి పట్ల ప్రభుత్వ దృక్పథంలో మార్పురావాలి. ప్రభుత్వ సర్వీసులను పొరుగు సేవలకు ఇవ్వటం వల్ల ప్రైవేటు కార్పొరేషన్‌లు, కన్సల్టెంట్లు లబ్ధిపొందుతున్నారు, అత్యవసర సేవలు ఖరీదు అవుతున్నాయి. ముందుగా, ప్రభు త్వం గ్రామీణరంగంపై దృష్టి పెట్టాలి, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధులు కేటాయించాలి. రాష్ట్రాలు ప్రతిసంవత్సరం చివరి రెండు–మూడు మాసాల వేతనాల చెల్లింపు వాయిదాలేస్తున్నాయి. అంతేగాక చెల్లిస్తున్న వేతనం రాష్ట్రాల కనీస వేతనాల కన్నా తక్కువగా ఉంటున్నది. దీన్ని పరిశీలించాలి. అనేకమంది ఆర్థికవేత్తలు వాదిస్తున్నట్లుగా, ఇటువంటి కార్యక్రమాన్ని పట్టణపేదలకు విస్తరించే విషయం ఆలోచించాలి. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన 500మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆ సంస్థకు రాసిన లేఖ గూర్చిన వార్త గుర్తు చేసుకోదగింది. ఉపా, క్రిమినల్ న్యాయ వ్యవస్థపై చర్చలను ఆ సంస్థ నిషేధించిన తర్వాత వారు లేఖ రాశారు. సైన్స్, సమాజం గూర్చి అనేక భావాలపై చర్చించే అవకాశం తమ విద్యార్థులు, అధ్యాపకులకు ఉండాలని వారు కోరారు. ఎందరో విద్యావేత్తలు, మేధావులు అసమ్మతి హక్కును అణచివేయటానికి వ్యతిరేకంగా, పలు సందర్భాల్లో ప్రభుత్వానికి రాశారు. ఆదేశాలు విధించటం, అరెస్టులు చేయటానికి ఏమైనా చట్టబద్ధత ఉందా?

రాజకీయ రంగంలో, మోదీ జాతీయవాదం రాజకీయాల్లో ఒక అంశంగా ముందుకువచ్చింది. ప్రభుత్వ విధానాల కేంద్రీకరణ అనేక సంస్థల పనిని దెబ్బతీస్తున్నది. మరోవైపున, అసమ్మతి గొంతునొక్కటం, వ్యక్తి స్వేచ్ఛలను అణిచివేయటం ప్రభుత్వ రాజకీయ వ్యూహంగా తయారైంది. 2014–2022 మధ్య 8719 ఉపా(చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కేసులు నమోదు చేయగా, శిక్షల రేటు 2.55 శాతమేనని కాంగ్రెస్ మీడియా ప్రచార కమిటీ ఛైర్మన్ పవన్ ఖెరా చెప్పిన వాస్తవం గుర్తు చేసుకోదగింది. ప్రభు త్వ విమర్శకులను, విద్యార్థులు, పాత్రికేయులు, హక్కుల కార్యకర్తలను అణచివేయటానికి ఆ చట్టా న్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారో ఇది తెలియజేస్తున్నది. దమనకాండ విధానాలు, ముఖ్యంగా యూనివర్శిటీల్లో వాక్, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలను

> బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన 500మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆ సంస్థకు రాసిన లేఖ గూర్చిన వార్త గుర్తు చేసుకోదగింది. ఉపా, క్రిమినల్ న్యాయ వ్యవస్థపై చర్చలను ఆ సంస్థ నిషేధించిన తర్వాత వారు లేఖ రాశారు. సైన్స్, సమాజం గూర్చి అనేక భావాలపై చర్చించే అవకాశం తమ విద్యార్థులు, అధ్యాపకులకు ఉండాలని వారు కోరారు.

క్రమంగా హరిస్తూ ఉండటం ఆందోళన పెంచుతున్న అంశాలు. లౌకిక ప్రజాస్వామ్య స్ఫూర్తి హరింపునకు గురికావటం, పెద్దఎత్తున ఉపాధి కల్పనకు సరైన వ్యూహం లేకపోవటం పునరాలోచించదగినవి. పరిశీలించాల్సిన మరో ముఖ్యమైన రంగం విద్యారంగం. విద్యాప్రమాణాల మెరుగుదల గూర్చి ఆలోచించాలి. కేంద్రం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందించాలి.

ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. అపర సంపన్నులపై అదనపు పన్నులు విధించాలని అంతర్జాతీయ ఏజెన్సీలు సూచించాయి. ఎంతో కొంత సెస్ విధించే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలి. అనేక సంపన్నదేశాల్లో సైతం సంపదపన్ను, వారసత్వ ఆస్తిపై పన్ను విధిస్తున్నారు. భారతదేశంలో అటువంటిది లేదు. జీవన పోరాటం చేస్తున్న ప్రజాబాహుళ్యం సంక్షేమం కోసం ప్రభు త్వం సంపన్నుల నుంచి అదనపు వనరులు సమీకరించటం ఎంతైనా సబబు. కావలసింది సంకల్పం.

# జీవకోటిని కబళిస్తున్న ప్లాస్టిక్ కాలుష్యం

నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయమైంది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేడు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం, సర్వం గరళ ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ స్వంతం. చెవులను శుభ్రం చేసుకునే ఇయర్ బడ్ నుంచి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు/నూనె/ద్రవాల ప్యాకె ట్లు, వాటర్ పాటిల్స్, పానీయాలు తాగే స్ట్రాలు, వంటింటి సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల పర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970–1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది. వాడిపడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్ఛిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏండ్లు పడుతున్నది. రసాయనశాస్త్ర పరంగా చిన్న చిన్న అణువు అనేకం రసాయన చర్యల ద్వారా కలిసి అతి పెద్ద శృంఖలాలు ఏర్పడి, ప్లాస్టిక్ బృహదణువులుగా లేదా పాలిమర్స్‌గా పిలువబడతాయి. పాలిథీన్ కవర్స్, పివిసి పైప్స్ లాంటి ప్రధాన ప్లాస్టిక్ ఉత్పత్తుల గూర్చి మనకు తెలుసు. ఒకనాడు షాపుల్లో పర్యావరణహిత పేపర్ ప్యాకింగ్ చేసే అలవాటు ఉండేది. మనం ఏ వస్తువును కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోనే ఇంటికి తెచ్చుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయబడడం, నిమిషానికి 1 మిలియన్ బ్యాగులు వాడడం, ప్రతి మనిషి సగటున 25 నిమిషాలకు ఒక ప్లాస్టిక్ బ్యాగు వాడడం జరుగుతున్నది. విచ్చలవిడిగా, విచక్షణారహితంగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగుల పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో దాదాపు ఒక లక్ష సముద్ర జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రమాదకర ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పట్ల అవగాహన కల్పించడానికి, వాటి దుష్ప్రభావాలను వివరించడానికి ప్రతి ఏట జూలై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం వేదికగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, వాటి విష ప్రభావాలను వివరించడం, వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వెతకడం, పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులు కావడం లాంటి అంశాలను అవగాహన పరుస్తారు. మన ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవడం,



ప్లాస్టిక్ కవర్స్‌కు బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం, తప్పనిసరి అయినపుడు ఒక్క ప్లాస్టిక్ బ్యాగును తిరిగి పలుమార్లు వాడడం, ప్లాస్టిక్ బ్యాగులు లేని మార్కెటింగ్ రోజులను తిరిగి పొందడం, సహజ ఉత్పత్తులతో బ్యాగులను తయారుచేసుకొని వాడడం లాంటి చర్యలకు పూనుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు మానవ శరీరంలోకి చేరి తీవ్ర అనారోగ్యాలకు కారణం కావడం, సకల జీవ కోటి మనుగడ ప్రశ్నార్థకం కావడం జరుగుతుంది. నేడు ప్లాస్టిక్ వ్యర్థాలు భూగ్రహానికి శాపాలుగా మారుతున్నాయి. సారవంతమైన నేలల్ని, సముద్ర నదీ జలాలను ప్లాస్టిక్ బ్యాగులు కలుషితం చేస్తున్నాయి. అన్నీ తెలిసిన నరుడు నరకానికి నిచ్చెనలు వేస్తున్నాడు. తను ప్రమాదంలో పడడమే కాకుండా సకల జీవరాశులను కూడా ప్రమాదంలోకి నెడుతున్నాడు నేటి డిజిటల్ యుగపు మానవుడు. అందుకే తక్షణమే ప్లాస్టిక్ బ్యాగు రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనుదాం, మన రేపటి ఆరోగ్యాలను మనమే కాపాడుకుందాం.

**(నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం)**

# మన ఆలోచనా విధానం మారాలి

నవ్వుతున్నప్పుడు వెక్కిరిస్తుందీ సమాజం. దుఃఖిస్తున్నప్పుడు సంతోషాన్ని వెదకడం సహజం. బ్రతికున్నంత సేపు ఎవ్వరూ పట్టించుకోరు. బాధలకు, బాధ్యతలకు లొంగిపోయి బ్రతుకీడుస్తుంటే ఆకతాయిల చూస్తారంతా. ఓర్పుతో భరిస్తున్నప్పుడు మరిన్ని బండరాళ్లను మీదకి విసురుతారు అది మానవ నైజమేమో అనిపిస్తుంది. బ్రతకడం అంత ఈజీ కాదు అనిపిస్తుంది సరే ఎలాగోలా బ్రతికేద్దాం నా జీవితం నాకోసం కాదు నా అనుకున్న వాళ్ళ కోసం నేనెలా వున్నా పర్లేదు బ్రతకాలి అంతే అనుకొని ఒక్కో అడుగు ముందుకేస్తుంటే టక్కున వెనక్కి లాగెయ్యాలని వంద చేతులు అడ్డుపడతాయి. కన్నీటి కడలిలో ఈదుతున్నప్పుడు ఒక్క వేలు వచ్చి ఓదార్పునివ్వదు. అన్ని భరిస్తూ ఛీ ఎందుకు నాకీ బ్రతుకు అనుకొని ఒక్కక్షణం నాది కాదనుకొని ఊపిరాపేసుకుంటే.. బ్రతికున్నపుడు సహకరించని స్నే హం, మేమున్నామని చెయ్యందించలేని బంధువర్గం. ఈ భువినొదిలి పోయాక రాబందువుల్లా ఒకచోట చేరి శవాలపై పైసలేరుకున్నట్లు నీతి కవనాల్లల్లేస్తాయి. ఎంతలా అంటే ఒక వివేకానందుడు, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి వారు చెప్పిన సూక్తులన్నీ చెప్పేస్తుంటారు. అవి విన్నప్పుడు అనిపిస్తుంది బ్రతికివున్నప్పుడు చెప్పుంటే జీవితాలు చెల్లాచెదురు కావు కదా అని. పైగా తీర్పులు చెప్పేస్తుంటారు. ఇలా జరిగివుంటే అలా జరిగి ఉండేది. అది అలా చేసింది కాబట్టి ఇలా జరిగింది. ఇది తప్పు అది ఒప్పు అని పేరుగాంచిన న్యాయవాదుల్లా ఉచిత సలహాలిస్తుంటారు. సందర్భోచిత సామెతలు చెబుతుంటారు. మన మాటల వాళ్ళ అవతలి వాళ్ళు ఎంత గాయపడతారు అనేది అస్సలు ఆలోచించరు. ఆలోచనా విధానం మారాలి. సలహాలు ఇచ్చే వాడికి అనుభవం ఉండదు. అనుభవించేవాడికి చూసేవాడు ఓదార్పు మాత్రమే ఇవ్వాలి. ముల్లులా గుచ్చి గుచ్చి గాయాన్ని మానకుండా మొత్తానికి నరికేసుకునే పరిస్థితికి తీసుకురానివ్వకూడదు. ఏది ఎందుకు జరిగిందో మనకు తెలీదు. తెలియకుండా ఎవ్వరికి సలహాలు, సూక్తులు, తీర్పులు ఇచ్చే ప్రయ త్నం చెయ్యకండి. నీ ఒక్క మాట వల్ల అవతలి వాళ్ళ ముక్కలయ్యే ప్రమాదం వుంది. ప్రతి ఒక్కరికి అంతరాత్మ అనేది ఒకటుంటుంది. తప్పు చేసినా ఒప్పు చేసినా అది ప్రశ్నిస్తూనే ఉంటుంది. గ్రహించడం, తమలను తాము సరిచేసుకోవడం అనేది వారి వారి విజ్ఞతకు సంబంధించిన విషయం. అకారణంగా ఎవరిని నిందించవద్దు. దూషించవద్దు. ఎవరి జీవితం వారిది. ఎవరి వ్యక్తిగత విషయాలు వాళ్ళవి. ప్రస్తుత పరిస్థితుల్లో మీ వ్యక్తిగత విషయాలు బయటి వారితో పంచుకోవడం తప్పు. అవతలి వాళ్ళ విషయాలు అతిగా తెలుసుకోవడం అంతకంటే పెద్ద తప్పు. ఎందుకంటే విన్న చెవి మరో చెవికి చేరే వరకు ఊరుకోదు. ప్రచారం కావడం వల్ల నువ్వు సాధించేదేమీ లేదు. బ్రతకాలి అంటే మొండిగా బ్రతకాలి. మనతో వున్న వారిని బ్రతికించాలి. పిరికితనం మనిషికి పట్టిన జాడ్యం. ఒక్కసారి అది మనసును అతుక్కుంటే వదిలించుకోవడం కష్టం. జీవితం చాలా చిన్న ది. ప్రతి విషయంలో తృప్తిగా బ్రతకండి.

– వాసి జ్యోత్స్న
9866843005

# అటెండర్లకు సమస్యగా దొంగతనాలు!

భారతీయ రైల్వేలు ఎసి తరగతుల్లోని ప్రయాణికులందరికీ పరిశుభ్రమైన, బాగా ఇస్త్రీ చేసిన మంచి నాణ్యత గల దిండ్లు, దుప్పట్లు అందించి తద్వార ప్రయాణికులకు సుఖవంతమైన సంతృప్తికరమైన ప్రయాణం కోసం. రైల్వే బెడ్‌రోల్ అటెండెంట్ నియమించింది వీరు ఎయిర్ కండిషన్డ్ రైలు కోచ్‌లలో బెడ్‌రోల్‌లను పంపిణీ చేయడం, నిర్వహించడం ఉంటుంది. ప్రయాణికులకు లినెన్లు, దిండ్లు దుప్పట్లు అందించడం, కోచ్ శుభ్రతను నిర్ధారించడం వంటి పనులు నిర్వహిస్తారు.. ఇన్ని సేవలు అందిస్తున్న వీరికి ప్రతి నెల కేవలం 15,000 రూపాయల జీతం కాంట్రాక్టర్ ద్వారా అందుతున్నది. సాధారణంగా ఎసి కోచ్‌లో ధనికులు, విద్యాధికులు ప్రయాణం చేస్తూ ఉంటారు. ప్రయాణికులు వారి గమ్య స్థానం చేరేముందు కొంతమంది బెడ్ రోల్స్ దొంగిలిస్తున్నారు. రైళ్లలో దుప్పట్లు, టవల్స్ దొంగతనాలు అటెండర్లకు పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను అరికట్టడం అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ దొంగతనాల కారణంగా, ప్రతినెల బెడ్ రోల్ అటెండర్ జీతం నుండి రికవరీ చేస్తున్నారు. వీరు ఎక్కువసేపు సుదూర రైళ్లలో నిరంతర షిఫ్టులలో, తక్కువ విశ్రాంతితో పని చేయడం వలన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్కసారి వీరు కుటుంబ సభ్యులకు దూరంగా సుమారు 80 గంటలు పని చేయవలసి వస్తుంది. ఒక రైలులో కేవలం నలుగురు లేదా ఆరుగురు వందలమంది ప్రయాణికులకు సేవలు అందించడం కష్టంగా ఉంది. వీరు ప్రయాణికుల బెడ్ రోల్స్ ఎత్తడం, పంపిణీ చేయడం, కోచులను శుభ్రపరచడం కష్టంతో కూడుకున్న పని. కొంత మంది ప్రయాణికులు ఇన్‌ఫెక్షన్లు, అలెర్జీలతో బాధపడుతూ ప్రయాణం చేస్తున్నారు, అలాంటి ప్రయాణికులు వాడిన దుప్పట్లు, దిండ్లు మార్చే సమయంలో బెడ్ రోల్ అటెండర్స్ కూడా చర్మ వ్యాధులు సోకే ప్రమాదముంది. కొన్ని రైళ్లలో ప్యాంట్రీ (కిచెన్)లేకపోవడంతో స్వంత ఖర్చులతో భోజనం చేయాలి. అతి తక్కువ జీతం పొందే వీరు రైల్వే స్టేషన్లో దొరికే ఆహార ఖర్చులు భరించగలరా? వీరు రైలు ప్రయాణం కొనసాగించేంత వరకు నిద్ర మానుకొని మేలుకొని ఉండాలి. కొన్నిసార్లు టాయిలెట్స్ దగ్గరే విశ్రాంతి పొందే దుర్భరస్థితిలో జీవిస్తున్నారు. ఒకవేళ రైలు ప్రయాణంలో ప్రయాణికుల విలువైన వస్తువులు కనబడకపోతే బెడ్ రోల్ అటెండర్స్ దూషణపాలు అవుతున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ రైలు నినాదం అమలు పరుస్తున్న బెడ్ రోల్ అటెండర్స్‌కు తగిన ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించేందుకు అధికారులు పూనుకోవాలి.



లేఖ

– ఆళవందార్ వేణు మాధవ్
హైదరాబాద్

# లైబ్రరీ సైన్స్‌లో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సుల ప్రాముఖ్యం

లైబ్రరీ సైన్స్ అనేది సమాచార నిర్వహణ, గ్రంథాలయాల నిర్వహణ, సమాచార వనరుల సమర్థ వినియోగంపై దృష్టి సారించే ఒక విద్యారంగం. ఈ రంగంలో డిజిటల్ యుగం ఆవిష్కరణతో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ అనేది కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో టెక్నాలజీని ఉపయోగించి వివిధ రకాల గ్రాఫిక్స్, డిజిటల్ కంటెంట్, వినియోగదారు ఇంటర్‌ఫేస్‌లను సృష్టించడం. లైబ్రరీ సైన్స్ సందర్భంలో, కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థల రూపకల్పన, వెబ్‌సైట్‌ల అభివృద్ధి, డిజిటల్ కంటెంట్ నిర్వహణ, అలాగే సమాచార సందర్శన కోసం ఆకర్షణీయమైన ఇంటర్‌ఫేస్‌లను రూపొందించడంపై దృష్టి పెడతాయి. ఇవి గ్రంథాలయ సేవలను ఆధునికీకరించడంలోనూ వినియోగదారులకు సేవలు అందించే ప్రక్రియను సులభతరం చేయడంలో సహాయపడతాయి.


ఆధునిక గ్రంథాలయాలు భౌతిక పుస్తకాలతో పాటు డిజిటల్ వనరులను కూడా అందిస్తున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు డిజిటల్ లైబ్రరీ ఇంటర్‌ఫేస్‌లను రూపొందించడంలో సహాయపడతాయి. ఉదాహరణకు, వినియోగదారులు సులభంగా సమాచారాన్ని శోధించగలిగేలా ఆకర్షణీయమైన వెబ్‌సైట్‌లు లేదా ఆన్‌లైన్ కేటలాగ్‌లను రూపొందించడం కంప్యూటర్ డిజైనింగ్ ద్వారా సాధ్యమవుతుంది. ఇలాంటి వ్యవస్థలు వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు వినియోగదారు ఇంటర్‌ఫేస్ (యూజర్ ఇంటర్‌ఫేస్) వినియోగదారు అనుభవం (యూజర్ ఎక్స్‌పీరియన్స్) రూపకల్పనలో నైపుణ్యం కల్పిస్తాయి. గ్రంథాలయ వెబ్‌సైట్‌లు లేదా డిజిటల్ యాప్‌లు సులభంగా నావిగేట్ చేయగలిగేలా, ఆకర్షణీయంగా ఉండేలా రూపొందించడం ద్వా రా, వినియోగదారులు తమకు కావలసిన సమాచారాన్ని త్వరగా పొందగలుగుతారు. లైబ్రరీ సైన్స్‌లో డిజిటల్ కంటెంట్‌ను నిర్వహించడం ఒక ముఖ్యమైన అంశం. ఈ బుక్స్, ఆన్‌లైన్ జర్నల్స్, డిజిటల్ ఆర్కైవ్‌లను రూపొందించడంలో కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు ఉపయోగపడతాయి. ఉదాహరణకు, డిజిటల్ ఆర్కైవ్‌ల కోసం ఆకర్షణీయమైన గ్రాఫిక్స్ లేదా ఇన్ఫోగ్రాఫిక్స్ రూపొందించడం ద్వారా సమాచారాన్ని మరింత ఆసక్తికరంగా అందించవచ్చు. ఆధునిక గ్రంథాలయాలు ఆటోమే



షన్, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డేటా ఎనలిటిక్స్ వంటి సాంకేతికతలపై ఆధారపడుతున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు ఈ సాంకేతికతలను అర్థం చేసుకోవడానికి వాటిని గ్రంథాలయ సేవలలో అనుసంధానం చేయడానికి సహాయపడతాయి. ఉదాహరణకు, డేటాబేస్ డిజైన్ లేదా కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (సీఎంఎస్) రూపకల్పనలో ఈ నైపుణ్యాలు కీలకం.

గ్రంథాలయ సేవలను ప్రచారం చేయడానికి డిజిటల్ మార్కెటింగ్ అవసరం. కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు సోషల్ మీడియా పోస్ట్‌లు, బ్రోచర్‌లు, ప్రమోషనల్ వీడియోలను రూపొందించడంలో సహాయపడతాయి. ఇవి గ్రంథాలయ సేవలను వినియోగదారులకు మరింత ఆకర్షణీయంగా చేరవేస్తాయి. ఈ కోర్సు వల్ల సమాచార సౌలభ్యం ఉంటుంది. డిజైనింగ్ నైపుణ్యాలు గ్రంథాలయ వనరులను సులభంగా అందుబాటులో ఉంచేలా చేస్తాయి. వృత్తిపరమైన అవకాశాలు మెరుగు పరుస్తాయి. ఈ కోర్సులు లైబ్రరీ సైన్స్ విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ నిర్వహణ, కంటెంట్ క్రియేషన్, అలాగే ఐటీ రంగాలలో ఉద్యోగ అవకాశాలను అందిస్తాయి. నవీన సాంకేతికతలతో అనుసంధానం కావటంతో కృత్రిమ మేధస్సు, డేటా విజువలైజేషన్ వంటి ఆధునిక సాంకేతికతలతో గ్రంథాలయ నిర్వహణను మెరుగుపరుస్తాయి. వినియోగదారులకు ఆకర్షణీయమైన డిజైన్‌ల ద్వారా గ్రంథాలయ సేవలను మరింత జనాదరణ పొందేలా చేయవచ్చు. డిజిటల్ యుగంలో గ్రంథాలయాలు కేవలం పుస్తక నిల్వలుగా కాకుండా సమాచార కేంద్రాలుగా మారాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు లైబ్రరీ సైన్స్ నిపుణులకు డిజిటల్ లైబ్రరీలు, ఆన్‌లైన్ డేటాబేస్‌లు, వర్చువల్ లైబ్రరీ సేవలను నిర్వహించే సామర్థ్యాన్ని అందిస్తాయి. భవిష్యత్తులో, ఈ నైపుణ్యాలు గ్రంథాలయ నిర్వాహకులను డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌లు, డేటా క్యూరేటర్‌లు, అలాగే ఐటీ కన్సల్టెంట్‌లుగా రూపొందించే అవకాశం ఉంది. లైబ్రరీ సైన్స్‌లో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు ఆధునిక గ్రంథాలయ నిర్వహణలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయి. ఇవి సమాచారాన్ని సులభంగా, ఆకర్షణీయంగా, సమర్థవంతంగా అందించడంలో సహాయపడతాయి. విద్యార్థులు ఈ కోర్సుల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను సంపాదించడం ద్వారా గ్రంథాలయ రంగంలో ఇతర డిజిటల్ రంగాలలో ఉన్నతమైన వృత్తిపరమైన అవకాశాలను పొందవచ్చు. ఈ కోర్సులు లైబ్రరీ సైన్స్‌ను ఆధునిక యుగానికి అనుగుణంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

– డా.రాధికా రాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
8074317172



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రద్దీ సమయాల్లో రేట్లు పెంచుకోవచ్చు..

### క్యాబ్ సర్వీస్ సంస్థలకు కేంద్రం గుడ్ న్యూస్

**న్యూఢిల్లీ:** ఉబర్, ఓలా వంటి ఆన్‌లైన్ క్యాబ్ సర్వీసుల సంస్థలకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రద్దీ సమయాల్లో రేట్లు పెంచుకునేందుకు అనుమతించింది. మోటారు వాహన అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసింది.ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారం.. క్యాబ్ అగ్రిగేటర్లు రద్దీ సమయాల్లో బేస్ ఛార్జీ కంటే రెండు రెట్ల వరకు ధరను పెంచుకోవచ్చు. గతంలో ఇది 1.5 రెట్లుగా ఉండేది. ఇప్పుడు దాన్ని రెండు రెట్లకు పెంచారు. అలాగే విపరీతమైన రద్దీ ఉంటే సర్ ఛార్జ్‌ను 200 శాతం పెంచుకునే వీలు కల్పించింది. అయితే, మూడు కిలోమీటర్ల లోపు ప్రయాణించే వారికి అదనపు ఛార్జీలు వసూలు చేయకూడదని షరతు పెటింది. అంతేకాదు డ్రైవర్ కారణం లేకుండా రైడ్‌ను రద్దు చేస్తే రూ.100కు మించకుండా లేదా పది శాతం జరిమానా (ఏది తక్కువైతే అది) విధించవచ్చు. రైడ్ వాహనాలకు స్టేట్ కంట్రోల్ సెంటర్లకు అనుసంధానించిన లొకేషన్ ట్రాకింగ్ పరికరాలు తప్పనిసరిగా ఉండాలి.

8 రోజులపాటు ఐదు దేశాల్లో

## పర్యటించనున్న మోదీ



**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఐదు దేశాల్లో ఎనిమిది రోజుల పాటూ ఈ పర్యటన సాగనుంది. ఈ పర్యటనలో భాగంగా తొలుత ఘనాలో మోదీ పర్యటిస్తారు. ఇవాళ, రేపు ఆ దేశంలో ప్రధాని పర్యటన ఉంటుంది. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. ఘనా పర్యటనను ముగించుకొని ప్రధాని ట్రినిడాడ్ అండ్ టొబాగొల పర్యటకు వెళ్తారు. జులై 3, 4 తేదీల్లో అక్కడ పర్యటిస్తారు. ఆ తర్వాత జులై 4 అర్జెంటీనా వెళ్తారు. 5వ తేదీ వరకూ అక్కడ పర్యటిస్తారు. ఆ తర్వాత జులై 5న బ్రెజిల్ వెళ్తారు. 8వ తేదీ వరకూ ఆ దేశంలోనే మోదీ పర్యటిస్తారు. రియో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ సదస్సులో పాల్గొంటారు. ఈ పర్యటన తర్వాత 9వ తేదీన ప్రధాని నమీబియా వెళ్తారు. అక్కడ ద్వైపాక్షిక చర్చలు అనంతరం స్వదేశానికి తిరిగి వస్తారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒకేసారి ఐదు దేశాల్లో పర్యటించడం ఇది రెండోసారి. 2016లో ఆయన అమెరికా, మెక్సికో, స్విట్జర్లాండ్, ఆఫ్ఘనిస్థాన్, ఖతార్‌లో ఒకేసారి పర్యటించారు.

# దౌత్య విపత్తు వేళ మళ్లీ విదేశాలకా?

### ప్రధాని మోదీపై టిఎంసి, కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా వంటి ఐదు దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లడంపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేశాయి. కాగా, జులై 9న ముగిసే తన పర్యటన సందర్భంగా ఆతిథ్య దేశాలతో భారతదేశం సంబంధాలను బలోపేతం చేయడంలో ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఈ ఏప్రిల్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం సైనిక చర్య తీసుకున్నప్పటి నుంచి ప్రతిపక్ష పార్టీలు మోదీ తరచుగా చేసే విదేశీ పర్యటనల ఫలితాన్ని ప్రశ్నిస్తున్నాయి. 'పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నప్పటి నుంచి 71 రోజులు గడిచాయి. అయినప్పటికీ ఒక్క దేశం కూడా పాకిస్థాన్‌ను స్పష్టంగా ఖండించలేదు' అని టీఎంసీ బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది. 'ఇది కేవలం విదేశాంగ విధాన వైఫల్యం కాదు. ఇది దౌత్య విపత్తు. బీజేపీ స్వయంగా చెప్పుకుంటున్న, చాలా ప్రచారం చేయబడిన 'విశ్వగురు' హోదా నుంచి పూర్తిగా పతనం' అని తెలిపింది. 'అమెరికా అధ్యక్షుడు పాకిస్థాన్ పట్ల తన 'ప్రేమ' ను ప్రకటించుకున్నారని, దాని సైన్యాధ్యక్షుడితో భోజనం చేశారని, దేశం భారతదేశంతో యుద్ధంలో నిమగ్నమై ఉండగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు పాకిస్థాన్‌కు రుణాలు మంజూరు చేశాయని పశ్చిమ బెంగాల్ పాలక పార్టీ టీఎంసీ గుర్తు చేసింది. అదే సమయంలో యూఎన్‌సీఎస్ దాని ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్ చైర్మన్‌గా పాకిస్థాన్‌ను నియమించింది. పాకిస్థాన్ తన భూభాగంలో ఉగ్రవాదులను కాపాడుతోందని భారతదేశం తరచూ ఆరోపిస్తోంది' అని పేర్కొంది. 'అది తగినంత ఆందోళనకరంగా లేకపోతే పాకిస్థాన్ ఇప్పుడు జులైలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అధ్యక్ష పదవిని కలిగి ఉంది' అని వివరించింది.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్... మోదీని 'సూపర్ ప్రీమియం ఫ్రీక్వెంట్ ఫ్లైయర్' అని ఎద్దేవా చేస్తూ... చరిత్ర పాఠాన్ని వివరించారు. 'సూపర్ ప్రీమియం ఫ్రీక్వెంట్ ఫ్లైయర్ ప్రధాని నేడు ఘనాలో ఉన్నారు' అని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. '60ల మధ్యకాలం వరకు ఘనా నిజానికి ఆఫ్రికన్ రాజకీయాలను క్వామే న్క్రుమా ఆధిపత్యం వహించారు. అతను ఒక ప్రముఖ వ్యక్తి. అతను జవహర్‌లాల్ నెహ్రూతో చాలా స్నేహపూర్వక సంబంధాన్ని పంచుకున్నాడు. ఇది మార్చి 1957లో ఘనా స్వాతంత్ర్యం పొందటానికి చాలా కాలం ముందు నుంచి ఉంది' అని తెలిపారు. ఇండియా హౌస్ ఉన్న అక్రలోని ఒక ప్రముఖ రహదారికి నెహ్రూ పేరు పెట్టారు. అయితే న్యూఢిల్లీలోని దౌత్య ఎన్‌క్లేవ్‌లో క్వామే న్క్రుమా మార్గ్ ఉందని జైరాం రమేశ్ ఈ సందర్భంగా వివరించారు. 'కష్ట కాలం గడిచినప్పుడు స్వయం ప్రకటిత కఠినులు ముందుకు సాగుతారు. సూపర్ ప్రీమియం ఫ్రీక్వెంట్ ఫ్లైయర్ ప్రధాన మంత్రి ఐదు దేశాలకు ఎనిమిది రోజుల విహారయాత్రకు బయలుదేరతారు' అని విమర్శించారు. మోదీ పారిపోతున్నారని చెప్పిన సమస్యల జాబితాను కాంగ్రెస్ నాయకుడు వివరించారు. ఆ జాబితాలో మణిపూర్, పాకిస్థాన్‌తో ఇటీవలి యుద్ధంలో భారతదేశం ఎదుర్కొన్న వాటికి ప్రతిస్పందించడం, కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరచూ చేసిన వాదనలు, పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను గుర్తించి అరెస్టు చేయడంలో వైఫల్యం ఉన్నాయి. ఇదిలా ఉండగా, రాజ్యసభలో తణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్... జైరాం రమేశ్ చేసిన పోస్ట్‌కు స్పందిస్తూ... 'జాబితాలో మరొకటి ఉంది : ఉద్యోగాలు. అవి లేకపోవడంతో దేశ వ్యాప్తంగా యువత బాధపడుతున్నారు' అని తెలిపారు.



## పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘన కేసు నిందితులకు బెయిల్

**న్యూఢిల్లీ :** 2023 డిసెంబర్‌లో పార్లమెంట్‌లోని లోక్‌సభలోకి ఇద్దరు ప్రవేశించి భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆ కేసులో నిందితులు నీలం ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఢిల్లీ హైకోర్టు ఇవాళ బెయిల్ మంజూరీ చేసింది. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, హరీశ్ విద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం నీలం, మహేశ్‌లకు ఊరట కల్పించింది. ఇద్దరికీ 50వేల పూచీకత్తుపై బెయిల్ కల్పించారు. పార్లమెంట్ దాడి ఘటన గురించి మీడియాకు ఇంటర్వ్యూలో ఇవ్వరాదు అని కోర్టు ఆదేశించింది. సోషల్ మీడియాలో పోస్టులు కూడా చేయవద్దు అని ధర్మాసనం పేర్కొన్నది. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. 2001 నాటి పార్లమెంట్ దాడి ఘటనను వ్యతిరేకిస్తూ.. కొందరు నిరసనకారులు పార్లమెంట్ బిల్డింగ్‌లోకి ప్రవేశించారు. లోక్‌సభ సమావేశాలు జరుగుతున్న సమయంలో స్మోక్ కానిస్టర్లను స్ప్రే చేశారు. విజిటర్స్ గ్యాలరీ నుంచి కిందకు దూకి స్మోక్ స్ప్రే చేశారు. ఆజాద్‌ను 2023, డిసెంబర్ 13వ తేదీన అరెస్టు చేశారు. అతనితో పాటు సాగర్ శర్మ, మనోరంజన్ డీ, అన్మోల్ షిండేలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన రోజున ఆజాద్, షిండేలు పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. లోక్‌సభ చాంబర్‌లోకి శర్మ, మనోరంజన్ ప్రవేశించారు. ఈ కుట్రలో భాగమైన ప్రధాన నిందితుడు లలిత్ జా, మరో నిందితుడు మహేశ్ కుమావత్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

## ఎరువుల ఎగుమతులు నిలిచిపోవడంపై చర్యలేవి?

### కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** చైనా నుంచి ఎరువుల ఎగుమతులు నిలిచిపోవడంతో డిఏపి, యూరియా వంటి అవసరమైన ఎరువుల కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఎరువుల బస్తాలపై తన ఫోటోలను ముద్రించుకుంటున్నారని, మరో వైపు రైతులు 'మేడ్ ఇన్ చైనా' ఎరువులపై ఆధారపడుతున్నారని అన్నారు. వ్యవసాయ దేశమైన భారతదేశంలో ఆర్థిక వ్యవస్థకు రైతులే వెన్నెముక అని, కానీ విదేశంపై ఆధారపడడంతో వెన్ను ఒంగిపోతుందని, ఇప్పుడు చైనా పంపిణీ నిలిపివేసిందని తన 'ఫేస్‌బుక్' ఖాతాలో బుధవారం నాడు రాహుల్‌గాంధీ పోస్ట్ చేశారు. ఎరువుల కొరతతో దేశవ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడుతుండడం ఇదే మొదటిసారి కాదని, తాజాగా ఎరువుల విషయంలో 'చైనా సంక్షోభం' అలుముకుంటుందని హెచ్చరించారు. ఎరువుల పంపిణీ ఏ సమయంలోనైనా నిలిచిపోతుందని తెలిసినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉండగా, అందుకు ఎలాంటి విధానం లేదా ప్రణాళికను రూపొందించలేదని అన్నారు. రైతులు అప్పులు, బాధల్లో కూరుకుపోతుంటే ఎవరి కోసం, ఎవరి అభివృద్ధి జరుగుతుందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

## అహ్మదాబాద్ ఘటన.. రెండు ఇంజిన్ల వైఫల్యమే కారణమా?

**న్యూఢిల్లీ :**అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. రెండు ఇంజిన్లు విఫలమవడంతోనే విమానం కూలిపోయి ఉంటుందని తాజాగా బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో త్వరలో తొలి నివేదికను విడుదల చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విమాన ప్రమాద దర్యాప్తుతో సంబంధమున్న వ్యక్తులను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ పలు విషయాలను వెల్లడించింది. ఈ విమానయాన సంస్థకు చెందిన పైలట్లు.. కూలిన విమానం పారామీటర్స్‌ను ఫ్లైట్ సిమ్యులేటర్ ద్వారా రీక్రియేట్ చేసినట్లు సమాచారం. ల్యాండింగ్ గేర్, రెక్కల ఫ్లాప్స్‌ను వెనక్కి తీసుకోవడం లాంటివి ఇందులో ఉన్నాయి. అయితే ఈ సెట్టింగ్‌లు మాత్రమే ప్రమాదానికి కారణం కాదని వారు గుర్తించినట్లు ఈ నివేదిక పేర్కొంది. డ్యూయల్ ఇంజిన్ల వైఫల్యంపై దర్యాప్తు అధికారులు దష్టిసారించినట్లు వెల్లడించింది. అధికారిక దర్యాప్తు నుంచి విడిగా ఈ 'సిమ్యులేటెడ్ ఫ్లైట్'ను నిర్వహించినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించడంలో ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం అయిన కొన్ని క్షణాల్లోనే ఓ వైద్య కళాశాల వసతిగహంపై కూలిపోయింది. ఈ విషాదకర ఘటనలో 241 మంది ప్రయాణికులు మతిచెందగా.. 19 మంది స్థానికులు ప్రాణాలు కోల్పోయారు. విమానంలోని ఒకేఒక వ్యక్తి మత్యుంజయుడిగా నిలిచారు. బ్లాక్ బాక్స్ విశ్లేషణ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.

పార్లమెంటరీ ప్యానెల్ మీటింగ్‌కు

## మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్..

### వాకౌట్ చేసిన బిజెపి ఎంపిలు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక నేతత్వంలో మంగళవారం పార్లమెంట్‌లో గ్రామీణ అభివద్ధి, పంచాయతీ రాజ్ శాఖ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అయితే ఆ మీటింగ్‌కు సామాజిక కార్యకర్త మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్‌లు హాజరయ్యారు. దీంతో వివాదం చెలరేగింది. భూ వనరుల శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు రెండు ముసాయిదా తీర్మాలను రూపొందించాయి. దానిపై చర్చిచేందుకు చేపట్టింది పార్లమెంటరీ ప్యానెల్ మీట్ రసాభాసగా మారింది. తమ అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు కొన్ని ఎన్‌జిఒల తరపున సభ్యులు మీటింగ్ హాజరయ్యారు. పునర్ నివాసం హక్కుల గురించి తమ అభిప్రాయాలు వినిపంచేందుకు కొందరు నేతలు వచ్చారు. అయితే లిస్టులో లేని నేతలు మీటింగ్‌కు ఎలా వస్తారని బిజెపి ఎంపిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్ రాక గురించి తమకు వెల్లడించలేదన్నారు. రాజకీయ దురుద్దేశంతో వాళ్లను ఆహ్వానించినట్లు బిజెపి ఆరోపించింది. బిజెఇ ఎంపి పురుషోత్తం రూపాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జాతీయ ప్రయోజనాలకు చెందిన ప్రాజెక్టులను మేధా పాట్కర్ వ్యతిరేకించారని, ఆమెకు ఈ మీటింగ్‌లో మాట్లాడే హక్కు లేదని రూపాలా అన్నారు. బిజెపి ఎంపిలు డాక్టర్ సంజయ్ జైస్వాల్, రాజు బిస్తా, జుగల్ కిషోర్ కూడా పురుషోత్తం రూపాలాకు సపోర్టు ఇచ్చారు. సాక్షుల జాబితాను పారదర్శకంగా ఇవ్వలేదని, చైర్మెన్ వైఖరిని బిజెపి ఎంపిలు విమర్శించారు.పార్లమెంటరీ ప్యానెల్ మీటింగ్‌కు ప్రకాశ్ రాజ్ ఎందుకు వచ్చారని పలుమార్లు బిజెపి ఎంపిలు ప్రశ్నించారు. సభ్యుల వద్ద ఉన్న లిస్టులో అతని పేరులేదన్నారు. లోక్‌సభ స్పీకర్ అనుమతి ఉన్నట్లు చైర్మెన్ చెప్పినా.. బిజెపి ఎంపిలు ఆమోదించలేదు. కాంగ్రెస్ ఎంపీలు చైర్మెన్‌కు సపోర్టు ఇవ్వగా, బిజెపి ఎంపిలు దీన్ని వ్యతిరేకించారు. పది ఎన్జీవోలకు చెందిన ప్రతినిధులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడంతో.. బిజెపి ఎంపిలు ఆ మీటింగ్ నుంచి వాకౌట్ చేశారు. దీంతో మీటింగ్‌కు వాయిదా వేశారు.

## ఆకస్మిక మరణాలకు.. కొవిడ్ టీకాలకు సంబంధం లేదు..

### స్పష్టం చేసిన ఐసిఎంఆర్-ఎయిమ్స్ స్టడీ..!




**న్యూఢిల్లీ :** ఆకస్మిక మరణాలకు కరోనా టీకాలకు సంబంధం లేదని ఓ అధ్యయనంలో తేలింది. భారత వైద్య పరిశోధనా మం డలి, ఎయిమ్స్ సంయుక్తంగా అధ్య య నం నిర్వహించాయి. కరోనా మహమ్మా రి తర్వాత 40 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారిలో హార్ట్ ఎటాక్స్ పెరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి. వీటికి వ్యాక్సిన్ కార ణం కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శా ఖ స్పష్టం చేసింది. ఇటీవల కర్ణాటకలోని హాసన్ జిల్లాలో పలువురు యువకులు హార్ట్ ఎటాక్‌తో మరణించారు. దీనిపై సిఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. కొవిడ్ టీకాను వేగంగా పంపిణీ చేయడం వల్లే అది జరుగుతుండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. చెస్ట్‌లో నొప్పి, ఊ పిరాడకపోవడం వంటి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రిలో వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ సంస్థలు జరిపిన సమగ్ర అధ్యయనంలో టీకా కారణంగా మరణాలు సంభవించలేదని తేలింది. ఈ అధ్యయనం 2023 మే నుంచి ఆగస్ట్ వరకు 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 47 ప్రాంతీయ ఆసుపత్రుల సహాయంతో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగినవారిపై అధ్యయనం జరిపారు. ఇందులో 2021 అక్టోబర్ నుంచి 2023 మార్చి మధ్య అకస్మాత్తుగా సంభవించిన మరణాలను విశ్లేషించారు. ఈ అధ్యయనంలో హార్ట్ ఎటాక్ కేసుల పెరుగుదలకు జన్యుపరమైన మార్పులు ప్రధాన కారణంగా గుర్తించారు. ప్రస్తుతం ఎయిమ్స్, ఐసీఎంఆర్ నిధులతో పూర్తిస్థాయిలో అధ్యయనం చేపట్టింది. నివేదిక పూర్తి అయిన తర్వాత కూడా నిధులతో మరో పూర్తిస్థాయి అధ్యయనాన్ని చేపట్టింది.ఆకస్మిక మరణాలకు కరోనా టీకా కాకుండా జీవనశైలి, మునుపటి ఆరోగ్య సమస్యలు, కోవిడ్ ఇన్ఫెక్షన్ తర్వాత ఏర్పడిన సమస్యలు, జెనెటిక్ కారణాలు వంటి అనేక అంశాలు కారణమని వివరించారు. కరోనా టీకా మానవాళిని మహమ్మారి నుంచి రక్షించిందని, అనవసరమైన ఆరోపణలు ప్రజల్లో భయాన్ని, టీకాపై నమ్మకాన్ని దెబ్బతీయవచ్చని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. హాసన్ జిల్లాలో గత నెలలో 20 మందికిపైగా అకస్మాత్తుగా మరణించినట్లు కర్ణాటక ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కానీ, ఈ ఘటనలకు సంబంధించి తగిన పరిశోధనలు జరుగుతున్నాయని కేంద్రం తెలిపింది.

## కొన్ని వస్తువులపై జిఎస్టి తగ్గించే యోచనలో కేంద్రం?




**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆరంభంలో ఆదాయపన్ను రాయితీలతో వేతన జీవులకు కొంత ఊరట కల్పించిన కేంద్రం తాజాగా మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. నిత్యావసర వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా ఈ శ్లాబులోని వివిధ వస్తువులను ఐదు శాతం శ్లాబులోకి మార్చడం వంటి ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంట పాత్రలు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్‌లు, సైకిళ్లు, రూ. వెయ్యి కంటే ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ దుస్తులు, రూ.500 నుంచి రూ. వెయ్యి మధ్య గల చెప్పులు, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్‌లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గింపు జాబితాలో ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం అమలైతే ప్రతిపాదిత జాబితాలోని వస్తువులు తక్కువ ధరకే అం దుబాటులోకి రానున్నాయి. ఈ కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై కొంత భారం తగ్గనుంది. ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ. 40 వేల కోట్ల నుంచి రూ. 50 వేల కోట్ల భారం పడొచ్చని అంచనా. అయినప్పటికీ, ధరలు తగ్గితే వినియోగం పెరిగి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# వర్ష బీభత్సం... 51 మంది మృతి

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదలు సంభవించాయి. ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ప్రధాన నదులకు వరద ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అనేక రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటి వరకూ 51 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ రెవెన్యూ శాఖ అధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ గత నెల 20 నుంచి ఈ నెల రెండో తేదీ వరకూ రాష్ట్రంలో వర్షాల కారణంగా జరిగిన నష్టంపై ఓ నివేదిక విడుదల చేసింది. 12 జిల్లాల్లో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 51 మంది మరణించారు. దాదాపు 22 మంది గల్లంతయ్యారు. మండి జిల్లాలో అత్యధికంగా 10 మంది మరణించారు. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 103 మంది గాయపడ్డారని సదరు నివేదికలో వివరించింది. భారీ వర్షాలకు మండి జిల్లాలో బియాస్ నది ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. చండీగఢ్‌మనాలీ హైవేలోని మండిమనాలీ మార్గంలో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాకపోకలు నిలిచిపోయాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో భద్రతా కారణాల దష్ట్యా పలు జిల్లాల్లో అధికారులు పాఠశాలలను మూసివేశారు. మండి, సిర్మౌర్ జిల్లాల్లోని దాదాపు 250కిపైగా రహదారులను అధికారులు మూసివేశారు. 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

విద్యార్థిని ట్రాప్ చేసి..

## అత్యాచారానికి పాల్పడిన లేడీ టీచర్



**ముంబై :** ఒక స్టూడెంట్‌ను లేడీ టీచర్ ట్రాప్ చేసింది. అతడికి ఆందోళన తగ్గించే మందు లు ఇచ్చి ఏడాదిగా అత్యాచారానికి పాల్పడింది. విద్యార్థి ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లిదండ్రులు అతడ్ని ఆరా తీయగా అసలు విషయం చెప్పాడు. దీంతో పేరెంట్స్ ఫిర్యా దుతో ఆ ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. ప్రముఖ విద్యా సంస్థలో 40 ఏళ్ల లేడీ టీచర్ ఇంగ్లీష్ బోధి స్తున్నది. వివాహిత అయిన ఆ మహిళకు పిల్లలు కూడా ఉన్నారు. కాగా, 2023 డిసెంబర్‌లో స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా డ్యాన్స్ బృందంలో ఉన్న 11వ తరగతి చదువు తున్న 16 ఏళ్ల మగ విద్యార్థి పట్ల ఆ ఉపాధ్యాయురాలు ఆకర్షితురాలైంది. 2024 జనవ రిలో లైంగిక సంజ్ఞలతో అతడ్ని కవ్వించింది. అయితే తొలుత ఆ విద్యార్థి ఆసక్తి చూప లేదు. ఆ లేడీ టీచర్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో తన ఫ్రెండ్ సహాయాన్ని ఆమె కోరింది. ఆ విద్యార్థితో ఆమె మాట్లాడింది. మధ్యవయసు మహిళలు, టీనేజ్ అబ్బాయిల మధ్య సం బంధాలు చాలా సాధారణమని చెప్పింది. దీంతో లేడీ టీచర్‌ను కలిసేందుకు అతడు అంగీకరించాడు. మరోవైపు ఆ విద్యార్థిని ఉపాధ్యాయురాలు కారులో ఒకచోటకు తీసుకెళ్లింది. బలవంతంగా లైంగికంగా వేధించింది. కొన్ని రోజులపాటు ఆ యువకుడు ఆందోళన చెందగా యాంటీ యాంగ్జైటీ మాత్రలు ఇచ్చింది. అతడికి మద్యం తాగించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడింది. కాగా, ఆ విద్యార్థిలో మార్పును అతడి పేరెంట్స్ గమనించారు. అతడ్ని నిలదీయగా లేడీ టీచర్‌తో ఉన్న రిలేషన్ గురించి చెప్పాడు. అయితే తమ కుమారుడి చదువు ప్రభావితం కాకుండా ఉండేందుకు కొంతకాలం వారు మౌనంగా ఉన్నారు. అతడ్ని కట్టడి చేశారు. 12వ తరగతి బోర్డు పరీక్షల తర్వాత ఆ విద్యార్థి ఆ స్కూల్ నుంచి వెళ్లిపోయాడు. అయితే తన పనిమనిషి ద్వారా అతడ్ని ఆ టీచర్ సంప్రదించింది. తనను కలవాలని చెప్పింది. మరోవైపు ఈ విషయం తెలిసిన విద్యార్థి తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టంతోపాటు పిల్లల సంరక్షణ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు తర్వాత ఆ లేడీ టీచర్‌ను అరెస్ట్ చేశారు. ఆమె వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఉపాధ్యాయురాలికి సహకరించిన ఆమె ఫ్రెండ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## నాకు ఇంకో దారి లేదు... 'సిఎం పదవి'పై డికె ఆసక్తికర వ్యాఖ్యలు



**బెంగుళూరు:** కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. ''నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయి..?'' అని బుధవారం పాత్రికేయులకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు భాజపా, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ..' ఆయన(సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి'' అని మాట్లాడారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్.రాజన్న కూడా ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తత చర్చ నడిచింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది. అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. ''నా తరఫున ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరుకోవడం లేదు. 2028లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల పైనే నేతల దష్టి ఉండాలి. నేను తొలుత పార్టీ కార్యకర్తను. అన్నింటికంటే పార్టీనే ముఖ్యం'' అని డీకే స్పష్టంచేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని సూర్జేవాలా వెల్లడించారు. ఈ ఊహాగానాల వెనక భాజపా కుట్ర ఉందని విమర్శించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## హామీల అమలులో బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలం

**ప్రజాపక్షం/మధిర :** కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల డిమాండ్ల సాధన కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు మిరియాల రమణగుప్తా, శీలం నర్సింహారావు, మందడపు రాణి, మల్లాది హన్మంతరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బోడేపూడి భవన్ నందు సిపిఐ నాయకులు బెజవాడ రవిబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలోని పాలకులు పేద, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని అన్నారు. పేదలకు, రైతులకు, కార్మికులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ హామీలను నిలబెట్టుకోవటంలో పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. అఖిపక్షం పిలుపులో భాగంగా నిర్వహించనున్న దేశవాప్త సమ్మెలో భాగంగా ఈ నెల 7న భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ భూములు బలవంతంగా రిజిస్ట్రేషన్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రైతులకు పరిహారంగా నాటి కెసిఆర్ ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలను కాంగ్రెస్ నేతలు బలవంతంగా తమ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. పంచభూతాలను కూడా దోచుకునే కాంగ్రెస్ నేతలు, రాష్ట్రాభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతులను కూడా దోచుకుంటున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేసి, భూములను తిరిగి రైతులకే ఇస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఆ విషయాన్ని మరిచిపోయిందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం ఉందన్న అహంకారంతో తెలంగాణ ప్రజలను నిలువు దోపిడి చేస్తున్న కాంగ్రెస్ నేతలకు, ఫార్మాసిటీ నిర్వాసితులకు పరిహారంగా ఇచ్చిన భూములు ఫలహారంగా మారాయని ఆరోపించారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు రైతులను భయపెట్టి , ఆ భూములను అడ్డికి పావు సేరుకు కొనుక్కుంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంగ్రెస్ నేతలు చేసుకుంటున్న అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకుని, రైతులకు ఆ భూములను తిరిగి అప్పగించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.



## జలమండలి ఉద్యోగుల అభ్యున్నతికి సిఎం కృషి అభినందనీయం

ఐఎన్‌టియుసి నేత రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సిఎం ఎ.రేవంత్‌రెడ్డి, జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి మెట్రో వాటర్ వర్క్స్ సేవరజ్ బోర్డు లో ఐఎన్‌టియుసి కాంగారు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినందుకు రాజిరెడ్డిని ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ప్రమోషన్లు పొందిన ఉద్యోగులు హైదరాబాద్‌లో బుధవారం శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జలమండలి ఉద్యోగుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కృషి అభినందనీయం అని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన కు జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉద్యోగ సమస్యలపై అవగాహన కలిగిన కాంగారు యూనియన్ బలమైన నాయకత్వంవల్లే వారి సమస్యలు వేగంగా పరిష్కారామౌతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సి. హెచ్. సురేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామరాజు, నాయకులూ కె. రమణా రెడ్డి, రఘునాథ్, నరేందర్, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిడిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం

ఎస్‌పి రోహిత్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు పోలీస్ శాఖ తరుపున డిడిఆర్‌ఎఫ్ బృంధాలు సిద్ధంగా ఉన్నాయని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. వడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపైకి నీరుచేరే అవకాశం ఉందని, ప్రజలు, వాహన దారులు తగినజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు, వరదల వల్ల ఇబ్బంది గల ప్రాంతాల్లో పోలీసులు ఇప్పటికే పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వరదలోల్ చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు పోలీస్ శాఖ 24 గం. పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుంటే 100కి డైయిల్ చేయాలని సూచించారు. సెల్ఫీల మోజులో పడి వాగులు, వంకలు, నదుల వద్ద ప్రమాదాలకు గురికావద్దని ఈ సందర్భంగా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు.

## టిజిఎన్‌పిడిసిఎల్‌లో కొత్తగా 339 పోస్టులు మంజూరు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎన్‌పిడిసిఎల్)లో వివిధ కేటగిరీలకు చెందిన కొత్తగా 339 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. అనసరమైన పోస్టులను వదిలి ఇతర పోస్టులను మంజూరు చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చీఫ్ ఇంజనీర్, చీఫ్ జనరల్ మేనేజర్, జాయింట్ సెక్రెటరీ, సూపరింటెండెంట్ ఇంజనీర్, జనరల్ మేనేజర్, డివిజనల్ ఇంజనీర్, నుంచి జూనియర్ అసిస్టెంట్, స్వీపర్ గార్డెనర్,సానిటరీ వివిధ కేటగిరీలకు చెందిన సుమారు 339 పోస్టులు ఉన్నాయి.

## 7న గురుకులా విద్యా సంస్థలో తాత్కాలిక బోధకులకు ఇంటర్వ్యూ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న వొకేషనల్ కళాశాలల్లో తాత్కాలిక భోదన నిమ్మతం నిపుణులైన బోధకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. కంప్యూటర్ గ్రాఫిక్స్ ,అనిమేషన్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ టెక్నీషియన్ , టూరిజం హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది.ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 7న రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, టిజిఎస్‌డబ్ల్యుఆర్ఎస్/జెసి (గర్ల్స్) కార్యాలయానికి తమ అర్హత పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి బుధవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు.



## సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం) నేతల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం సిపిఐ (ఎం) కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘువులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆగస్టు 1 న జరిగే నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానాన్ని ఆందజేశారు. సిఎంను కలిసివారిలో నవ తెలంగాణ దినపత్రిక ఎడిటర్ రమేష్, సిజిఎం ప్రభాకర్‌లు ఉన్నారు.

# భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలు తక్షణం ఆపాలి

అమెరికా చేతిలో తొత్తుగా మారిన నరేంద్రమోదీ

ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో అమెరికా కాన్సులేట్

అడ్డుకున్న పోలీసులు – నేతల అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయులపై అమెరికా పాల్పడుతున్నదుర్మార్గ చర్యలను తక్షణమే ఆపాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్రలు డిమాండ్ చేశారు. దేశంలోని 140 కోట్ల ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికాకు తొత్తుగా మారారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం చలో అమెరికా రాయబార కార్యాలయ(అమెరికన్ కాన్సులేట్) ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి ర్యాలీగా బయలు దేరిన ఎఐవైఎఫ్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్రతోపులాటలో జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్పటికే అక్కడి భారీగా చేరుకున్న పోలీసులు ఎఐవైఎఫ్ నేతలను అదుపులోకి తీసుకునిఅఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర లు మాట్లాడుతూ ఉగ్రవాద




ప్రేరేపిత దేశం పాకిస్తాన్‌కు అమెరికా రెడ్ కార్పెట్ వేస్తూ తన సామ్రాజ్యవాద విష పోకడలను అనుసరిస్తుందని ధ్వజమెత్తారు. ఔర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్ అంటూ అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో మోదీ ట్రంప్ గెలుపు కోసం భారతీయులతో మీటింగ్ ఏర్పాటు కృషి చేస్తే, గెలిచిన తర్వాత అదే ట్రంప్ భారతీయులపై తన కర్కశాన్ని ప్రదర్శిస్తున్నరన్నారు. ఇటీవల భారత్, పాక్ మధ్య జరిగిన యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ నిసిగ్గుగా మీడియాకు చెప్పినా, మోదీ ఖండించలేదన్నారు.. వాస్తవానికి అమెరికాలోని వైట్ హౌస్‌లో ట్రంప్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ ను ఆహ్వానించిన సందర్భంలోనే , ఆహ్వానం మేరకు మన దేశ ప్రధానమంత్రి మోదీ కూడ హాజరవ్వడ మంటే ట్రంప్ 140కోట్ల ప్రజలను అవమానించడమేనని వారు ధ్వజమెత్తారు. వ్యాపార దృక్పథంతో మాత్రమే ట్రంప్ ఆలోచిస్తునాడే తప్ప, భారత్‌తో స్నేహ సంబంధం పచ్చి మోసం, దగా అని అన్నారు. ట్రంప్ భారత్‌కు చేస్తున్న దుర్మార్గాలను నరేంద్ర మోదీ ఖండించకుండా, 140కోట్ల ప్రజల సార్వభౌమత్వాన్ని, సమగ్రతను తాకట్టు పెట్టొచ్చా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సామ్రాజ్యవాద అమెరికా నీచ పోకడలను మోదీ వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సల్మాన్ బేగ్, ఎండి. కుతుబ్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్,శేఖర్, కళ్యాణ్, నాగరాజు, మోసిన్ ఖాన్, మధుకర్, మధు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు కేటాయించి ఎరువులను తక్షణమే సరఫరా చేయాలి

కేంద్ర మంత్రులు జె.పి నడ్డా, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి తుమ్మల లేఖలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రానికి నెలవారి కేటాయించిన విధంగా ఎరువులు తక్షణమే పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్రమంత్రులు జెపి నడ్డా, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి తుమ్మల లేఖలు రాశారు. రాష్ట్రంలో ఖరీఫ్–2025 సాగు మొదలై, పంటల సాగు ఊపందుకుంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అలసత్వం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రాష్ట్రానికి కేటాయించిన యూరియా మొత్తం 5 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటి వరకు కేవలం 3.06 లక్షల మెట్రిక్ టన్నులుమాత్రమే రాష్ట్రానికి అందిందని తెలిపారు. అందడంతో ఏప్రిల్ లో 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.22 లక్షల మెట్రిక్ టన్నులు , మే లో1.60 లక్షల మెట్రిక్ టన్నులకు 0.88 లక్షల మెట్రిక్ టన్నులు, జూన్ లో 1.70 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా 0.96 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందిందని, దీంతో ఈ మూడు నెలల కలుపుకుని 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడిందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా దిగుమతి రూపంలో రావాల్సిన యూరియాలో 0.41 లక్షల మెట్రిక్ టన్నులకు కేటాయించగా కేవలం 0.13 లక్షల మెట్రిక్ టన్నులు, మే లో 1.11 లక్షల మెట్రిక్ టన్నులకు కేవలం 0.42 లక్షల మెట్రిక్ టన్నులు ,జూన్ లో 1.08 లక్షల మెట్రిక్ టన్నులకు కేవలం 0.81 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందిందని తెలిపారు. అన్నారు. ఖరీఫ్ సీజన్ లో ముఖ్యమైన జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో యూరియా వినియోగం అత్యంత అధికంగా ఉంటుందనీ, యూరియా అందకపోతే రైతుల పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందనీ మంత్రి వివరించారు. యూరియా కేటాయింపులు సరఫరాలో తేడాలు ఏర్పడటం ద్వారా రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగారాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ గారు ఈ విషయంలో చొరవ తీసుకొని రాష్ట్రానికి రావాల్సిన యూరియాను తక్షణమే పంపిణీ చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. రైతులకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పంటల సాగు నిరంతరంగా కొనసాగేందుకు తక్షణ చర్యలు తీసుకుని యూరియా సరఫరా నిలకడగా ఉండేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతుల హితం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం లభిస్తుందనే ఆశాభావాన్ని మంత్రివ్యక్తం చేశారు.

## మోదీ తెచ్చిన 4 కోడ్‌లే సిగాచి కెమికల్స్ ప్రమాదానికి కారణం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వివిఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సిగాచి కెమికల్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో సుమారు 36 మంది కార్మికులు మరణించడానికి ప్రధాని మోదీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లే కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఫ్యాక్టరీలను పరిశీలించాల్సిన అవసరం లేదని, యజమానులు రాతపూర్వకంగా ఇచ్చిన సమాచారంతో సంతృప్తి చెందాలని ప్రధాని మోదీ తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లలో ఉన్నందునే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు దశల వారిగా ఫ్యాక్టరీని పరిశీలించకపోవడం, ఇదే అదునుగా ఫ్యాక్టరీ యజమానులు తమ ఇష్టానుసారంగా ఫ్యాక్టరీలు నడిపించడమే సిగాచి పరిశ్రమలో ప్రమాదానికి మూల కారణమని స్పష్టమౌతున్నదని బోస్ ఒక ప్రకటనలో వివరించారు.

ఇలాంటి ప్రమాదాలకు, కార్మికుల మరణానికి పూర్తి బాధ్యత 4 లేబర్ కోడ్లు తెచ్చిన ప్రధాని మోదీయే బాధ్యత వహించాలన్నారు. ప్రథమ దోషి మోదీ, తదుపరి దోషులు ఫ్యాక్టరీ యజమానులని పేర్కొన్నారు. ఈ దోషులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, పారిశ్రామిక వేత్తల దోపిడీకి అండగా నిలబడిన మోదీ ఇలాంటి ప్రమాదాలకు, మానవ హననానికి బాధ్యత వహించాలన్నారు. మోదీకి మానవత్వం ఉంటే 4 లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సిగాచిలో చనిపోయిన కార్మిక కుటుంబాల భవిష్యత్తుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాపితంగా కార్మికవర్గం 4 లేబర్ కోడ్ల రద్దుకు జులై 9న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు సిద్ధమయ్యారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా మోడీ 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## రూ.17లక్షల గంజాయి స్వాధీనం ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఓ ముఠా గుట్టును సికింద్రాబాద్ డిటిఎఫ్ ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు రూ.17 లక్షల విలువైన 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సికింద్రాబాద్ ఎఇఎస్ శ్రీనివాస్‌రావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన ఎ.రమేష్‌కుమార్ ఎ.చందరూన్ కుమార్‌లు భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న తెలిపారు. సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సావిత్రి తన సిబ్బందితో కలిసి నిఘా పెంచారు. ఈ క్రమంలోనే పై ఇద్దరు నిందితులు బుధవారం మూడు బ్యాగుల్లో 34 కిలోల గంజాయిని తీసుకుని భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ఈ క్రమంలోనే సిఐ సావిత్రితో పాటు సత్యనారాయణ, ఖలీల్, రవి,శిల్పా, పరమేష్‌లు ఆకస్మిక దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌లను తనిఖీ చేయగా అందులో 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

## లోకల్ ఠాణలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి

యువ ఐపిఎస్‌ను ఆదేశించిన డిజిపి జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ పరిధిలోని లోకల్ పోలీసు స్టేషన్‌లను తరచు తనిఖీ చేయాలని డిజిపి డాక్టర్ జితేందర్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎఎస్‌పి) యువ ఐపిఎస్‌లను ఆదేశించారు. లక్డికాపూల్‌లోని తన కార్యాలయంలో బుధవారం డిజిపి జితేందర్ ఎఎస్‌పిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న శాంతిభద్రతల పరిస్థితిని ఆయన సమీక్షించారు. పోలీసింగ్‌లో తన 32 సంవత్సరాల అపార అనుభవం ఆధారంగా వారికి తగిన సూచనలు జారీచేశారు. బాధితుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో అంచనా వేయడంతో పాటు కేసు దర్యాప్తు నైపుణ్యాలను బలోపేతం చేయడంలో ఇటువంటి తనిఖీలు సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ జితేందర్ ఐపిఎస్ యువ ఐపిఎస్ అధికారులు తమ విధుల్లో చురుకుగా పాల్గొనాలని, నేటి వారి చర్యలు వారి తదుపరి మూడు దశాబ్దాల సేవలో వారి ప్రభావాన్ని నిర్వచిస్తాయని పేర్కొన్నారు. ఐపిఎస్ అధికారులను ప్రజలు , సంస్థలు నిరంతరం గమనిస్తూ ఉంటాయని, వారి ప్రవర్తన ప్రజా సంక్షేమం యొక్క ప్రజాస్వామ్య విలువను ప్రతిబింబించాలని ఆయన చెప్పారు. ఎఎస్‌పిలు అత్యున్నత సమగ్రత, క్రమశిక్షణతో పాటు సహనం పాటించాలని ఆయన సూచించారు. తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున, గ్రామ పోలీసు అధికారుల వ్యవస్థను ప్రారంభించాలని, వారి అధికార పరిధిలోని పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీ చేయాలని ఎఎస్‌పిలను కోరారు. కేసు దర్యాప్తులో సాంకేతికత ప్రాముఖ్యతను పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి ముప్పును అరికట్టడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కీలక నేరస్థులను గుర్తించి లక్ష్యంగా చేసుకోవడం ద్వారా, డ్రగ్స్ సంబంధిత నేరాలను సమర్థవంతంగా నిర్మూలించవచ్చని ఆయన సూచించారు. కళాశాలలు తిరిగి తెరవడం దృష్ట్యా గ్రామ స్థాయి అధికారుల నియామకం, ర్యాగింగ్ నిరోధక కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్ మాట్లాడుతూ.. తనిఖీల సమయంలో సబార్డినేట్ సిబ్బందికి తగిన విధంగా మార్గనిర్దేశం చేయాలని, కేసులను దర్యాప్తు చేసేటప్పుడు తగిన శ్రద్ధ వహించాలని ఎఎస్‌పిలకు సూచించారు. దోపిడీలు, దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న వ్యవస్థీకృత నేర ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రత్యక్ష నియామకం పొందిన యువ ఎఎస్‌పిల నుండి పౌరులు అధిక అంచనాలను కలిగి ఉంటారని వారు ప్రొఫెషనల్ పోలీసింగ్‌ను ప్రదర్శించాలని మహేష్‌భగవత్ పునరుద్ఘాటించారు.ఈ సమీక్షా సమావేశంలో మల్టీజోన్ ఐజి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఐజి తఫ్సీర్ ఇక్బాల్, ఎఐజి రమణ కుమార్, ఎఎస్‌పిలు శివం ఉపాధ్యాయ, అవినాష్ కుమార్, ఎస్. శేషాద్రిని రెడ్డి, కాజల్, ఎస్. చిత్తరంజన్, బి. చైతన్య రెడ్డి, పి.చేతన్ నితిన్, విక్రాంత్ కుమార్ సింగ్, శుభం ప్రకాష్, రాజేష్ మీనా పాల్గొన్నారు.

## బనకచర్ల ప్రాజెక్ట్‌పైన శాసనసభలో చర్చకు సిద్ధం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బనకచర్ల ప్రాజెక్ట్‌పైన శాసనసభలో చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ సిఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. సిఎం బాధ్యతగా మాట్లాడుతారిన అనుకుంటే, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ అన్ని అబద్ధాలే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించి, దిక్సూచిగా నిలిచిన పార్టీ బిఆర్ఎస్ అని, రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల హక్కులు కేంద్రంగా కాకుండా, రాజకీయాలే కేంద్రంగా బురద జల్లుతున్నారని మండిపడ్డారు. బనకచర్లపైన ప్రభుత్వం అధికారికంగా ప్రజంటేషన్ చేసి ఉంటే, అందరు ఎంఎల్ఎలను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. పిపిటిని తెలంగాణ ప్రభుత్వం తయారు చేసిందా?, లేదా ఎపి తయారు చేసిందా అని ఎద్దేవా చేశారు. బనకచర్లను ఆపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే చంద్రబాబు, కేంద్రానికి రాసిన లేఖలను చూపాలని అన్నారు. కాళేశ్వరం, పాలమూరు, దిండి, భక్తరామ దాసు ఇలా అనేక ప్రాజెక్టులను ఎపి సిఎం చంద్రబాబు అడ్డుకున్నారని, ఈ విషయాన్ని పిపిటిలో ఎందుకు చూపలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్లపైన బొంకుడు రాజకీయాలను బంద్ చేయాలని, బ్యాగులు మోసి బ్యాడ్‌మెన్‌గా పేరు తెచ్చుకున్నారని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి బనకచర్ల కోసం బొంకుమెన్‌గా మారారని ఎద్దేవా చేశారు. నదీ మార్గంలోనే నీటిని తేవాలని ఆనాడు కెసిఆర్ ర్ ఎపి సిఎం జగన్ తో అన్నారని, అలా కాదని భూభాగంలో నీళ్లు తరలించే ప్రయత్నం మొదలు పెట్టారని వివరించారు. కెసిఆర్ వాటర్ మ్యాన్ అయితే, రేవంత్ రెడ్డి వాటా మ్యాన్ అని అన్నారు. రేవంత్ రెడ్డి అదృష్టం బాగుండి సిఎం అయ్యారని, ఐదేళ్లు ఉండి. మంచిగ చేయాలని సూచించారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేసి ఆదుకోండి

ఎంపిడిఒ కు మాజీ సర్పంచ్ వినతి

**ప్రజాపక్షం/యాచారం :** అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేసి అదుకోవాలని కోరుతూ బుధవారం తక్కళ్ళపల్లి మాజీ ఉప సర్పంచ్ పగడాల శ్రీశైలం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సధర్బంగా అయన మాట్లాడుతూ గ్రామంలో ఇండ్ల స్థలం ఉండి ఇండ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కొంత మందికి మాత్రమే ఇండ్లు మంజూరి అధికారులు చేతులు దులుపుకున్నారు. అర్హులైన ఉండి ఇండ్లు నిర్మించుకోవడానికి సిద్దంగా ఉన్న పేదలకు ఇండ్లు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు.


కొలతల సాకులతో ఇందిరమ్మ బిల్లులు ఇవ్వకపోవడం దారునమని అన్నారు. కొలతలపై అవగాహణ లేక కొంతమంది ఇండ్లు కట్టుకున్నారు. వారందరికి ఇండ్లువ్వాలని కొరారు. లేనిపక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు.

## ముష్కిన్ చెరువును సందర్శించిన అధికారులు




ప్రజాపక్షం/గండిపేట: మణికొండ మున్సిపల్ పరిధిలోని అల్ మార్స్ వినియ అపార్ట్మెంట్లు డ్రైనేజీ నానక్ రామ్ గూడ నుంచి వస్తున్నదని తమ డ్రైనేజ్ లైన్ లోకి రాకుండా డ్రైనేజిని కిందికి రాకుండా వర్షం వేస్తున్నలని సొసైటీ సభ్యులు విన్నవించటంతో హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బి, ఇరిగేషన్ అధికారులు బుధవారం సందర్శించారు.అల్ మార్స్ వినియ అపార్ట్మెంట్ డ్రైనేజ్ లైన్ లోకి నాన్నక్ రామ్ గూడ పైనుంచి వస్తున్న మురికి నీటిని అధికారులు పరిశీలించారు. పై నుంచి వస్తున్నదని మురుగునీరు రాకుండా పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం ఇరిగేషన్ డిఇ రమాదేవి మాట్లాడుతూ ముష్కిన్ చెరువుపై కట్ట పైకి కట్టడము సరైనది కాదని అన్నారు.

## 15వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పిపిగా వేణుగోపాల్ రెడ్డి



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : పదిహేనవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెదిరె వేణుగోపాల్ రెడ్డిని నియామించినట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెదిరె వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయ కుండా నిస్వార్థంతో విధులు నిర్వహిస్తూ ఏలాంటి బేధాభిప్రాయాలు లేకుండా నిరుపేద ప్రజలకు సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ నియామకానికి సహకరించిన ప్రభుత్వానికి,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పోరేషన్ నాదర్‌గుల్ లో బిజెపి కిసాన్ మోర్చా ఏపిఎంసి కన్వీనర్ ఏనుగు రామ్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రంలో కిసాన్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తో కలిసి అందెల శ్రీరాములు ముఖ్యఅతిధిగా హాజరై మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ప్లాస్టిక్ వాడకం అధికం కావడంతో పర్యావరణ పై పేను ప్రభావం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పధంతో తమ వంతుగా చెట్లను నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్యయాదవ్, మల్లేష్‌యాదవ్‌రామిడి వీరకర్ణారెడ్డి, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలల చదువులు దేశానికే వెలుగులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: బాలల చదువులు దేశానికే వెలుగులు తీసుకువస్తామని.. చిన్నారి విద్యార్థులకు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జాతీయ మానవ హక్కుల కమీషన్ ఆధ్వర్యంలో పిల్లలకు స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు చేయుతను అంధించేందుకు దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్న తనం నుండే కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దాతలు పూర్తి స్థాయిలో ముందుకు వచ్చి విద్యార్థులకు చేయూతను అంధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమీషన్ అండ్ కంట్రోల్ బ్యూరో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్కాకుల అనిల్‌కుమార్, ఎన్‌హెచ్‌ఆర్‌సిసిబి అధ్యక్షుడు సురేష్‌సింగ్ రాజ్ పురోహిత్, తెలంగాణ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ చందానా జైన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రజాపక్షం/కొత్తూరు: సామాజిక బాధ్యతతో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ బిసిసేన అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మీ గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 28వ వార్డు గాంధీనగర్ కాలనీలో బిసిసేన మహిళా కమిటిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాటం భాగ్యలక్ష్మీ గౌడ్ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుకు వస్తే అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి మహిళలు వెనుకంజలోనే ఉన్నారని, మారుతున్న సమాజానికి అనుగుణంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. మహిళా కమిటీ అధ్యక్షురాలు రాములమ్మ, ఉపాధ్యక్షులు పావని, సహస్ర, ప్రధాన కార్యదర్శి పల్లాటి లత, కార్యదర్శి భాగ్యమ్మ గౌడ్, కోశాధికారి పల్నాటి మధుప్రియలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసిసేన తాలుకా అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు ఏలూరు వసంత, ప్రధాన కార్యదర్శి సౌజన్య, ప్రచార కార్యదర్శి చెరుకు మమతతోపాటు వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల దందాను అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ యాచారం మండల కార్యదర్శి కంబాలపల్లి విప్లవ్‌కుమార్

ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల దందాను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ యాచారం మండల కార్యదర్శి కంబాలపల్లి విప్లవ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో పుడమి పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్ళను నియంత్రిచడంలో పైఅధికారులు పూర్తిగా విఫలమైనారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో నోటు పుస్తకాలు,ధ్తకాలు, యూనిఫాంలు బహిర్గతంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధిక ఫీజులకు విక్రయిస్తు విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధిక ఫిజులు వసూలు చేస్తూ పుస్తకాల దందా నిర్వహిస్తున్నారని తెలిపారు.మండల విద్యాధికారికి సమచారం ఇచ్చిన పట్టి పట్టనట్టు వ్యహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంఈఓ సరైన విధంగా లేడని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు అజయ్.రోహిత్,హర్షిత్,వరుణ్,మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



# రెండేళ్లలో రెండు లక్షల మంది ఏఐ నిపుణులు

తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: రెండేళ్లలో రెండు లక్షల మంది తెలంగాణ యువతను అత్యుత్తమ ఏఐ రంగ నిపుణులుగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగా అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలోనే ఏఐ యూనివర్సిటీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. బుధవారం టీ హబ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలో తొలి ఏఐ అనుసంధానిత 'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్(టిజిడెక్స్)'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'ప్రస్తుతం ఏఐ అంటే కేవలం ఎమర్జింగ్ టెక్నాలజీ మాత్రమే కాదు. మానవ జీవితాలను ప్రభావితం చేసే శక్తి. కొత్తగా ఎన్నో అవకాశాలు సృష్టించింది. ఈ మార్పును అందిపుచ్చుకుని తెలంగాణను గ్లోబల్ క్యాపిటల్ ఆఫ్ ఏఐగా తీర్చి దిద్దేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఆ దిశగా ఇప్పటికే తెలంగాణ ఏఐ స్ట్రాటజీ & రోడ్ మ్యాప్‌ను రూపొందించుకుని ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది' అని ఈ సందర్భంగా ఆయన వివరించారు.



### దేశంలో తొలి ఏఐ డేటా ఎక్స్ఛేంజ్...

'ఏఐను ప్రజలందరూ సమర్థవంతంగా వినియోగించుకునేలా... అనేక సమస్యలకు పరిష్కారం చూపించేలా టీజీడెక్స్ పేరిట డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ను జైకా సహకారంతో అందుబాటులోకి తీసుకొచ్చాం. దీని రూపకల్పనలో బెంగళూరు ఐఐఎస్‌సి వ్యూహాత్మక సహకారం అందించింది. ఇది దేశంలో ఏర్పాటైన మొట్టమొదటి ఏఐ డేటా ఎక్స్ఛేంజ్. ఇది కేవలం డేటా ప్లాట్‌ఫామ్ మాత్రమే కాదు. ప్రజాస్వామ్యాత్మకమైన టెక్ పౌరసత్వానికి బలమైన పునాది. ప్రభుత్వ శాఖలు, స్టార్టప్స్, విద్యాసంస్థలు, పరిశోధకులు, యువత అంతా ఒకే వేదికపైకొచ్చి ఎన్నో సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు దారి చూపుతుంది. ఇప్పటికే 480కి పైగా డేటాసెట్స్, 3వేలకు పైగా ఏఐ స్టార్టప్స్ ఇందులో భాగస్వామయ్యా యి' అని చెప్పారు.

### ఎవరికి ప్రయోజనం...

'టీజీడెక్స్ ద్వారా రైతులకు మేలు చేసే అగ్రిటెక్ స్టార్టప్స్‌కు డేటా లభిస్తుంది. రోగులకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు ఆరోగ్య శాఖకు అవసరమైన ఏఐ మోడల్స్ ను అభివృద్ధి చేయొచ్చు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కి ఉపయోగపడుతుంది. గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణను తీర్చిదిద్దేలా నూతన ఆవిష్కరణలకు దిక్సూచిగా మారుతుంది. పౌర సేవలను సమర్థవంతంగా ప్రజల ముంగిటకు చేర్చేందుకు ప్రభుత్వానికి ఉపయోగపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఒకే దగ్గర సమాచారం అంతా అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు మార్గం సుగమం అవుతుంది' అని వివరించారు. టిజి డెక్స్ లో రాబోయే అయిదేళ్లలో 2వేల డేటా సెట్స్ ను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, ఐటి సలహాదారు సాయి కృష్ణ, టి హబ్ సీఈవో కవికృత్, టి వర్క్ సిఇఒ జోగిందర్, జైకా ప్రతినిధులు టాకూచీ తాకూరో, యుషి నగానో తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం చింతపల్లి గూడ గ్రామ సమీపంలో అంతరా రిసార్ట్స్‌లో జెడ్పిహెచ్ఎస్ రాయపోల్ పాఠశాలకు చెందిన 1988–89 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గతంలో పాఠశాలలో విద్యాను బొధించిన మాజీ గురువులను స్వాగతించి సాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ గురువులు సత్యనారయాణ రెడ్డి,ప్రకాశ్,లూర్థయ్య,అంజిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి,పూర్వ విద్యార్థులు సదానందం, సత్తి రెడ్డి,కృష్ణారెడ్డి,రమేష్,విష్ణు చారీ,కె నర్సింహ్మా, బాల్‌రెడ్డి,మల్లా రెడ్డి,మాధురిక,సౌభాగ్య, అరుణ, అనిత, ఇందిరా, మంగ, పాల్గోన్నారు.



## రాజ్యాంగ పరిరక్షణకు దేశవ్యాప్తంగా జై సంవిధాన్

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: జై బాపు,జై భీం,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనం పేరుతో జులై 4న హైదరాబాద్ ఎల్.బిస్టేడియంలో సభ నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి తెలిపారు. దీనికి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని ఆయన ప్రకటించారు. బుధవారం శేర్లింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీష్ గౌడ్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశం ఆ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఇట్టి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నేతలతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టి జై సంవిధాన్ కార్యక్రమం తెలంగాణలో విజయవంతంగా సాగుతోందన్నారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టే విస్తృతస్థాయి పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు.జూలై 4న హైదరాబాద్ ఎల్.బి స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల,బ్లాక్,జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

సిఎం రేవంత్‌రెడ్డికి రాచాల కృతజ్ఞతలు



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గం 16 ఏళ్ల కిందట ఏర్పడినప్పటికీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం దేవరకద్రను గాలికొదిలేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధిలో దేవరకద్ర పరుగులు పెడుతున్నదని తెలిపారు. నియోజకవర్గంలో పేదల తిరుపతిగా పేరుపొందిన కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి రూ.110 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు, జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమన్నారు. త్వరలో ఎక్సైజ్ సర్కిల్ ఆఫీస్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ కూడా రాబోతున్నాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు ట్రిబుల్ ఐటి మంజూరు చేసి సిఎం ఈ ప్రాంతంపై ఉన్న మక్కువను చూపారన్నారు. కొత్తకోటలో డిగ్రీ కళాశాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెఎసి వనపర్తి జిల్లా అధ్యక్షులు గూడూషా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోటూరి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు రేనట్ల మల్లేశ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు ధర్మేంద్ర సాగర్, దివాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించండి సారూ..

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం ఇచ్చిన నేతలు

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించేందుకు కృషి చేయాలంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు స్థానిక కాంగ్రెస్ నేతలు వినతిపత్రం ఇచ్చారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వార్డు సమస్యలపై వినతిపత్రం ఇచ్చి వివరించారు. షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 22వ వార్డులోని భగత్‌సింగ్ కాలనీలో ఓపెన్ డ్రైనేజీ కాలువ చిన్నగా ఉండటంతో మురుగు నీరు సమీపంలో ఉన్న ఇళ్ళల్లో వస్తుందని వివరించారు. నిధులు కేటాయించి పెద్ద కాలువను కేటాయించేందుకు కృషి చేయాలని కోరారు. పై భాగమైన రామకృష్ణ థియేటర్ నుండి మొదలుకొని కటిక కెరి, పద్మావతి కాలనీల నుండి మురుగు నీరు అధికంగా వస్తుందని, కాలువ నిర్మాణం చిన్నగా ఉండటంతో సమస్య పెరిగిపోతుందని వివరించారు. డ్రైనేజీ పోడవుతోపాటు పై కప్పులు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ డ్రైనేజీ సమస్యను తీర్చేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని, సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నడికూడ సరిత యాదగిరి యాదవ్, నేతలు రోమియో రమేష్, పిప్పల వెంకటేష్ యాదవ్ నర్సింలు పాల్గొన్నారు.



### రూ.3.50లక్షల ఎల్ఓసిని అంధించిన ఎమ్మెల్యే

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన రూ.3.50లక్షల ఎల్ఓసిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నందిగామ మండలం వీర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి మంజూరైన రూ. 3.50 లక్షల ఎల్ఓసిని వారి కుమారుడికి ఎమ్మెల్యే అందజేశారు. పేదల వైద్యుల ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మెరుగైన వైద్యసేవలు అంధించేందుకు ఎల్ఓపి భరోసాగా మారిందని తెలిపారు.

## నేరాలను అదుపు చేయడానికి సిసి కెమేరాలు ఎంతగానో దోహదం



ప్రజాపక్షం/యాచారం : నేరాలను అదుపు చేయడానికి సిసి కెమేరాలు ఎంతగానో దోహదం చేస్తాయని ఇబ్రహింపట్నం ఎసిపి రాజు అన్నారు.బుధవారం యాచారం మండల పరిధిలోని నజ్జిక్‌సింగారం గ్రామంలో యాచారం సిఐ నందీశ్వర్‌రెడ్డితో కలిసి సిసి కెమేరాలను అయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడానికి, దొంగతనాలను అరికట్టడానికి పని చేస్తాయని అన్నారు. దొంగతనాలకు పాల్పడే వారు భయపడుతారని తెలిపారు.అసంఘీక కార్యక్రమాలను తోందరగా గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. నేరాలు కూడా తగ్గుతాయని తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి లాంటి వాటికి బానిసై తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.హదిరెడ్డి హరిష్‌రెడ్డి సిసి కెమేరాల ఏర్పాటుకు సహకరించడం ఎంతో హర్షించ దగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుకుమార్, మాజీ సర్పంచ్ వన్నావాడ అరుణమ్మ పాండు రంగారెడ్డి,చైతన్యయూత్ అధ్యక్షులు రవింధర్‌రెడ్డి,నాయకులు కడారి శ్రీశైలం,ఆనందశర్మ,రాఘవేందర్‌రెడ్డి,శివ, ప్రకాశ్,మాదవ్ తదితరులు పాల్గోన్నారు.

## ప్లాస్టిక్ వాడకంతో మానవ ఆరోగ్యానికి హాని : అమరేందర్ రెడ్డి



ప్రజాపక్షం/తుర్కయాంజల్ : ప్లాస్టిక్ వాడకంతో మానవ ఆరోగ్యానికి ఎంతో హాని జరుగుతుందని తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కయాంజల్ పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలవుతోందని. నిషేధాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొని, జరిమానాలు విధించే ప్రక్రియ కొనసాగుతోంది తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఉన్న పలు బేకరీలు, జనరల్ స్టోర్లు, ఇతర వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని, తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్న కొన్ని దుకాణదారులను గుర్తించి, వారిపై జరిమానాలు విధించామన్నారు. ప్లాస్టిక్ రహిత తుర్కయాంజల్ గా సాధించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## పుపాలగూడాలో పశ్చిమ బెంగాల్ కార్మికుడి దారుణ హత్య

లేబర్ క్యాంప్‌లో గొంతు కోసి చంపిన స్నేహితుడు




ప్రజాపక్షం/ గండిపేట: అర్థరాత్రి పీకల దాకా మద్యం తాగిన స్నేహితులే గొంతు కోసి అతికిరాతకంగా హత్య గావించారు. తీవ్ర సంచలనం కలిగించిన ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా, సైబరాబాద్ కమిషనర్, నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాల గూడాలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఎస్‌హెచ్‌ఓ హరికృష్ణ రెడ్డి కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, ఆసన్సోల్, మూల శ్రీ రోషన్ హెలా(43) పుప్పాలగూడ గ్రామంలోని అపర్ణా జెనాన్ లేబర్ కాలనీలో నివాసం ఉంటూ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఇటీవలే కాంట్రాక్టర్ మురళీధర్ ద్వారా రంజిత్ పండిత్ అనే వ్యక్తితో కలిసి శ్రీ రోషన్ హెలా పెయింటర్ ఉద్యోగంలో చేరారు. ఈనెల 2వ తేదీన ఉదయం నార్సింగి పోలీస్ స్టేషన్‌కు పుప్పాలగూడ గ్రామంలోని అపర్ణా జనాన్ లేబర్ కాలనీలో హత్య జరిగినట్లు ఆర్వో ప్లాంట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న శ్రీ సోను కుమార్ ద్వారా రక్తపు మడుగులో పడి ఉన్నట్లు ఫోన్లో సమాచారం అందింది. అపర్ణా జెనాన్ హెచ్‌ఆర్‌గా పని చేసే పవన్ కుమార్ ఉదయం 100కు డయల్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు, స్థానిక పోలీసులు ఘటన స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. అప్పటికే గొంతు భాగంలో బలమైన గాయం ఉండి కత్తితో గాయపరిచినట్లు అనుమానాస్పదంగా పడి హత్య కేసు గా పోలీసులు ప్రాథమిక విచారణలో ధ్రువీకరించారు. ఈ హత్య అనంతరం ప్రస్తుతం మృతునితో పాటు కలిసి ఉంటున్న రంజిత్ పండిత్ పరార్‌లో ఉండడంతో పోలీసులు ఈ హత్యపై అనుమానాలకు మరింత బలం చేకూరింది. పరారీలో ఉన్న వ్యక్తిని గుర్తించి పట్టుకునేందుకు వెంటనే పోలీసు అధికారులు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం మరియు ఫింగర్ ప్రింట్స్ టీం చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ హత్యకు కారణమైన నిందితుడిని తక్షణమే పట్టుకొని మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని అందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రజలకు హామీ ఇస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోస్టాఫీస్‌లో రూ.19లక్షల నిధులు దుర్వినియోగం

రికార్డులను తనిఖీ చేసిన వనపర్తి పోస్టల్ అధికారులు

ప్రజాపక్షం/షాద్‌నగర్: పోస్టాఫీస్‌లో రూ.19లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు సూపరిండెంట్ ఆఫ్ వనపర్తి పోస్టల్ డివిజన్ అధికారి భూమన్న తెలిపారు. బుధవారం షాద్‌నగర్ పోస్టాఫీస్‌లో డివిజన్ స్థాయి అధికారుల బృందం సభ్యులు రికార్డులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భూమన్న మాట్లాడుతూ షాద్‌నగర్ పోస్టాఫీసులో నిధుల జమ, చెల్లింపుల్లో కొంత జాప్యం చోటు చేసుకోవడంతో పాటు రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయడం లేదని వివరించారు. అనుమానం వచ్చి ఈ రోజు రికార్డులను పరిశీలించగా అసలు విషయాలు బయటకు వచ్చాయని తెలిపారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన నిధులను ఇటు ఆఫీసులో కాగా లేదా పోలీస్ స్టేషన్‌లోనైనా పెట్టాల్సి ఉంటుందని, కానీ ఇవేమి పెట్టకుండా సుమారు రూ.19లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు తమ తనిఖీలో బయటపడినట్లు తెలిపారు. స్థానిక పోస్టల్ ఉద్యోగిని విచారించగా ఆ నిధులు ఇంటి వద్ద ఉన్నాయని, రెండు రోజుల్లో తీసుకువచ్చి డిపాజిట్ చేస్తానని చెప్పారని భూమన్న వివరించారు. నిర్ణీత సమయంలో నిధులు జమ చేయకుంటే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ శాఖకు చెందిన నిధులు మాత్రమే దుర్వినియోగం అయ్యాయని, ఖాతాదారులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని వివరించారు. రోజువారి ప్రక్రియను కొనసాగించేందుకు ఖాతారులు కృషి చేయాలని పేర్కొన్నారు.



### షాద్‌నగర్ పోస్టాఫీసులో రోజు రూ.10లక్షల టర్నోవర్

స్థానిక పోస్టాఫీసులో ప్రతిరోజు పది లక్షల వరకు టర్నోవర్ అవుతుందని, ఖాతాదారులు సైతం నిత్యం లావాదేవీలు కొనసాగిస్తుంటారని భూమన్న వివరించారు. స్థానికంగా సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే పూర్తి స్థాయిలో నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. షాద్‌నగర్, తిమ్మాపూర్, కొత్తూరు, జడ్చర్ల వంటి ప్రధాన పోస్టాఫీసుల్లో రోజువారి టర్నోవర్ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజల నుండి మంచి స్పందన ఉందని పేర్కొన్నారు. పోస్టాఫీసుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అంధిస్తున్న పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీల్లో తపాల శాఖ అధికారులు సైదా నాయక్, గోపినాథ్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు సుజన్ నాయక్, రవికుమార్‌లు ఉన్నారు.

## కలుషిత నీరు సరఫరా అరికట్టాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని బిజెఆర్ నగర్, వసంత్‌పురి కాలని , ప్రశాంత్‌నగర్ ప్రాంతంల్లో గత కొద్ది రోజుల నుండి మంచి నీటి నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని, ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన జలమండలి సైనిక్‌పూరి కార్యాలయ జిఎం సునీల్ కుమార్‌ను స్థానికు లుబాబు.సంపత్రావు, కిషోర్‌లతో కల్సి కోరారు. అదే విధంగా మంచి నీరు ప్రెషర్‌తో వచ్చేలా చేస్తూ సమయాన్ని పెంచాలని కోరారు.

## సిఎంను కలిసిన కొడంగల్ కార్యకర్తలు



**ప్రజాపక్షం/కొడంగల్:**కొడంగల్‌లో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కొడంగల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కొడంగల్ మున్సిపల్ ఆ పార్టీ జనరల్ సెక్రటరీ అరబ్ రమేష్ మాట్లాడుతు రేవంత్‌రెడ్డి గెలుపుకోసం అహర్నిశలు కష్టపడి పనిచేశామన్నారు. కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొంతమంది తమ పార్టీ నాయకు లే జీర్ణించుకోలేక అవకతవకలకు పాల్పడుతున్నారని అలాంటి వారికి కొడంగల్ మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ డిఇలు మద్దతుగా నిలుస్తున్నారని సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అవినీతిపరులకు కొమ్ముకాస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. వీరితోపాటు గాంధినగర్ కాలనీ వాసులు, పార్టీ కార్యకర్తలు న్నారు.



## రేపు మల్లికార్జున ఖర్గే రాక

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రానున్నారని, వార్డు, గ్రామ కమిటి అధ్యక్షులతో ఆయన ఆత్మీయ సమ్మేళనంలో కలుస్తారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. ఖర్గే రాక సందర్భంగా ఉప్పల్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సభలో కోఆర్డినేటర్లు మిథున్‌రెడ్డి, గజ్జల కాంతం, శశికళ యాదవ్, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, రజిత, స్వర్ణరాజ్ శివమణి, కాంగ్రెస్ నేతలు లక్ష్మ ణ్, రఫిక్, విజయ్, శ్రీకాంత్, అంజన్న,సాయిగౌడ్, ప్రసాద్ సింగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ఈతను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి

### కోలా రవీందర్ ముదిరాజ్

**ప్రజాపక్షం/దుండిగల్ :** ఈతను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని కుత్బుల్లాపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు గతంలో పలుమార్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్, అధికారులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉన్నతాధికారులకు ఈతను పాఠ్యాంశాలలో చేర్చాలని విజ్ఞప్తులు చేశామని అధికారుల స్పందనలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థులు, పెద్దలు ప్రతి ఒక్కరు ఈతను నేర్చుకోవాలని ఇది ఆరోగ్యంతో పాటు క్లిష్టమైన పరిస్థితులలో తమను తాము కాపాడుకోవడానికి ఎంతో దోహదపడుతాయని ఈత రాకపోవడంతో ఇటీవలే ఎన్నో సంఘటనలు చవి చూసామని ఎంతోమంది యువత తమ ప్రాణాలను కోల్పోతున్నారని విద్యార్థులు చదువుకునే పాఠశాలలో ఈత యొక్క ప్రాముఖ్యత పాఠ్యపుస్తకాలలో చేరితే వారికి ఎంతో అవగాహన వస్తుందని ప్రభుత్వం పెద్దలు వారి ప్రాణాలు కాపాడిన వారు అవుతారని ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఏటా 1500 నుండి 2000 చిన్నారులు విద్యార్థులు తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఈత యొక్క ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఈత గురించి విద్యార్థులకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇకనైనా ప్రభుత్వం గుర్తించి ఈత యొక్క ప్రాముఖ్యతను పుస్తకాలలో చేర్చాలని ఆయన అన్నారు.





## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

### కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాపేట్ :** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలో కాంగ్రెస్ పార్టీ నేతలు కొలను శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలో నెలకొన్న సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నానని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు సైతం ఎప్పటికప్పుడు బస్తీలు, కాలనీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అధికారులు సైతం చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, లక్ష్మ ణ్, రామచంద్ర నాయక్, వెంకట్ రెడ్డి, నాయుడు, మల్లేశ్, గట్టయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వికారాబాద్ జిల్లా పరిధిలోని అనంతగిరిగుట్టలో యువకుడు అత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసు తెలిపిన వివరల ప్రకరం వనపర్తి జిల్లా గోపాల్ పూర్ మండలం ఏరుట్ల గ్రామానికి చెందిన రమేష్ హైదరాబాద్‌లో ఒక కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ ఉండేవాడు, సోమవారం స్నేహితులతో వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి వెళ్లున్నానని చెప్పి వచ్చినట్లు సమాచారం. స్నేహితుల ఎన్నిసార్లు ఫోన్ చేసిన తీయకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని కుటుంబ సభ్యులు అనంతగిరికి వచ్చేసిన పార్కింగ్‌లో వాహనం గుర్తించి వికారాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చి పర్యాటక ప్రాంతం అనంతగిరి ఫారెస్ట్ పార్కింగ్ వద్ద ఫారెస్ట్ వారితో తెలుసుకోవడంతో మృతిని బైకు పార్క్ చేసి, వాటర్ ఫాల్ ప్రాంతంకు వెళ్లి ఎంతకు రాకపోవడంతో ఫారెస్టు సిబ్బంది వాహనం నెంబర్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చే ప్రయత్నం చేసినమని పేర్కొన్నారు. కుటుంబీకులు మంగళవారం వికారాబాద్ పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేయడంతో అతని వద్ద ఉన్న సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలిసు వారితో వెతికినా వాతావరణం అనుకులించకపోవడంతో బుధవారం ఉదయం కుటుంబీకులు పోలీసులు వెతుకుతున్న క్రమంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో సంఘటన స్థలంను పోలీసులు పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేశారు.

## సిగాచి ప్రమాదంతోనైనా

# అధికారులు అలసత్వం వీడాలి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడులో 19మంది కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఇలాంటి దుర్ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలంటే రాష్ట్ర ప్రభుత్వంలోని సిఎం, మంత్రులు పర్యటనలకే పరిమితం కాకుండా అధికారుల్లో ఉన్న అలసత్వాన్ని పారద్రోలి చిత్తశుద్ధితో పనిచేయించేలా ప్రణాళికలు రూపొందిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగవని కావున ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జీడిమెట్ల పారిశ్రామికవాడలో అనేక పేలుడులు జరిగాయని అందులో కార్మికులు మృతి చెందారని కానీ నాడు మంత్రులు కేవలం ప్రకటనలకే పరిమితమై కనీసం ఆ సంఘటన స్థలాన్ని సందర్శించలేదని, ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదని, ఆ పరిశ్రమల యాజమాన్యాలపై తూతూ మంత్రంగానే కేసులు పెట్టారని కానీ నేటి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి మంత్రులు సంఘటన స్థలాన్ని సందర్శించడం బాధితులకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం మంచి పరిణామంగా భావిస్తూ భవిష్యత్తులో అలాంటివి జరగకుండా పరిశ్రమలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఒకవేళ నిబంధనలను అతిక్రమించిన ఆ పరిశ్రమలను, పరిశ్రమ యాజమాన్యాలను కఠినంగా శిక్షించే చట్టాలను తీసుకురావాలని, నేటికీ జీడిమెట్ల గాంధీనగర్ బాలానగర్ పారిశ్రామిక వాడలలో అనేక పరిశ్రమలు ఎలాంటి అనుమతులు లేకుండా కెమికల్ డబ్బాలను నిల్వ చేస్తున్నాయని అన్నారు. అదే విధంగా నైపుణ్యం కలవాలకు అధిక వేతనాలు ఇవ్వాల్సి వస్తుందని నెపంతో ఎలాంటి నైపుణ్యం లేని వాళ్లను పనులకు ఉపయోగించుకోవడం, కార్మికుల యొక్క వివరాలను కంపెనీ నిబంధన వారి ప్రకారం ప్రభుత్వానికి ఇవ్వకపోవడం లాంటివి జరుగుతున్నాయని ఇప్పటికైనా ఇలాంటి పరిశ్రమల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భారత కమ్యూనిస్టు పార్టీగా మహాసభల్లో వీటి పైన చర్చించి పరిశ్రమలలో ఉన్న లోపాలను తెలుసుకోవడానికి ఒక కార్యక్రమాన్ని రూపొందిస్తామని అన్నారు.

# ధరలకు అనుగుణంగా కనీస వేతనాలుకై వినతి

### మిరియాల సాయిలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** కార్మిక చట్టాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని బుధవారం జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ అధికారులకు మున్సిపల్ కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు మిరియాల సాయిలు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచటం, గతంలో రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, మూతపడ్డ ప్రభుత్వరంగ సంస్థలను తిరిగి తెరిపించటం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాలకు స్వస్తి పలుకుతూ ప్రస్తుతం ఈ విధానంలో పనిచేస్తున్న వారందరిని శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు కుర్మన్న, శివయ్య, జాన్, యాదమ్మ, జనార్ధన్, హేమలత, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో...**మల్కాజిగిరి నియోజకవర్గంలోని వినాయకనగర్‌లో జరిగిన మల్కాజిగిరి సెక్టార్ అంగన్‌వాడి యూనియన్ సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఇ.శోభారాణి కేంద్రంలో పదేళ్ల పైబడి దేశాన్ని ఏలుతున్న బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గాలు పోరాటాల ద్వారా సాధించుకొన్న కార్మిక హక్కులను కాలరాచే విధంగా 4లేబర్ కోడ్‌లను తీసుకొని రావటాన్ని దుయ్యబట్టారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, అంగన్వాడి యూనియన్ నేతలు భాగ్యరేఖ, శ్రీదేవి, రాణి తదితరులు పాల్గొన్నారు.



## క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రమాదంలో గాయపడ్డ ఓ క్షతగాత్రుడికి వినాయకనగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నేత పిట్టల నాగరాజు రూ.10వేలు ఆర్థిక సాయంగా బుధవారం అందించారు. దీంతోపాటు రెండు మాసాలకు సరిపడే నిత్యావసర వస్తువులను సైతం అందచేసారు. విద్య, ఆరోగ్యం విషయాల్లో ఎవరికైనా అవసరమైతే పేదప్రజలు తనను సంప్రదించాలని కోరారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

### ఎంపిడిఒకు పంచాయతీ కార్మికుల వినతి



**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్:**బొంరాస్‌పేట్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు సంబంధించి మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ బుధవారం ఎంపిడిఒ వెంకట్‌గౌడ్, ఎంపిఒ రవినాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలకు సంబంధించి పెండింగ్ వేతనాలను విడుదల చేసి గ్రీన్ ఛాలెంజ్ ద్వారా నేరుగా సిబ్బంది ఖాతాలో వేతనాలు జమ అయ్యేటట్లు చూడాలని కోరారు.

జిఒ నెంబర్ 51ను రద్దు చేయాలని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరికి ఐడి కార్డులు అందజేయాలని, కారోబార్‌గా పనిచేస్తున్న వారిని అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా గుర్తించాలని పలువురు కార్మికులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది నర్సింలు, అనురాధ, సుధాకర్, తిరుపతయ్య, శంకర్, రుక్యానాయక్, రాజు, బాలయ్య, యాదయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త పనిచేయాలి



### ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

**ప్రజాపక్షం/నిజాంపేట్ :**గ్రామ, డివిజన్ స్థాయి కాంగ్రెస్ పార్టీ సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఎమ్మె ల్సీ బస్వరాజు సారయ్య పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, హెచ్ఎఎల్ కాలనీలోని సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య విచ్చేసి మాట్లాడుతూ ఈ నెల నాల్గవ తేదీన నగరంలోని లాల్ బహదూర్ స్టేడియం లో నిర్వహించే గ్రామ, డివిజన్ స్థాయి కాంగ్రెస్ పార్టీ సమ్మేళనానికి ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే విచ్చేస్తున్నారని, ఈ సభకు గ్రామ స్థాయి నుండి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కోఆర్డినేటర్స్ శశికళ యాద వ రెడ్డి, గజ్జెల కాంతం, మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.




## సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలకు విరాళాలిచ్చి సహకరించాలి

### జిల్లా కౌన్సిల్ సభ్యులు సహదేవ్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో ఆగస్టులో జరగనున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల కోసం అభిమానులు, శ్రేయోభిలాషులు విరాళాలిచ్చి సహకరించాలని జిల్లా కౌన్సిల్ సభ్యులు సహదేవ్ కోరారు. యాప్రాల్‌లో ఇంటింటికి తిరుగుతూ చేస్తున్న విరాళాల సేకరణలో ఆయన పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి అధికారంకోసం పాకులాడకుండా ప్రజల సమస్యల పరిష్కారంకోసం వెన్నంటి ఉండి ప్రభుత్వాలతో పోరాటం ద్వారా సహకరిస్తున్న సిపిఐకి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్వాల్ మండల కార్యదర్శి అమరావతిబాబు, ఎఐటియుసి మున్సిపల్ నాయకులు రవీందర్, మండల సహాయ కార్యదర్శి వై.వెంకటేష్, పార్టీ నాయకులు చంద్రయ్య, నరేంద్రచారి, రమేష్ సింగ్, మహిళా నాయకులు సంతోష్, పద్మ, లలిత, చిరంజీవి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## అథ్లెటిక్స్ పోటీలో బంగారు పతకం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:**ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో జాతీయ జూనియర్ అండర్–20 ఫెడరేషన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన ఎదులాబాద్‌కు చెందిన ఎర్రోళ్ళ ప్రణతి లాలిత్యను మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి శాలువతో సత్కరించి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించడం ద్వారా అనేక పథకాలు సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అవుషాపూర్ మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేందర్ రెడ్డి, మల్లేష్, మురళి, వేంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిసి నిరుద్యోగులకు వృత్తినైపుణ్య ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తెలంగాణా రాష్ట్ర అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో ఎంబిసి నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని,ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారిణి టి.ఝాన్సి రాణి పేర్కొన్నారు.

4 రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో అభ్యర్థులకు ట్రావెలింగ్ అలవెన్స్, భోజన, వసతి సౌకర్యాలు ఉంటాయన్నారు. సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటి డెవలప్‌మెంట్, రెస్యూమ్ బిల్డింగ్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లాంటి విషయాల్లో శిక్షణ ఉంటుందన్నారు.21 నుండి 30 ఏళ్ల లోపు వయస్సున్న అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, వారి కుల, ఆదాయ (గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఆదాయం) ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులతో ఈ నెల 12లోగా tgobmms. cgg. gov.in వెబ్‌సైట్ ద్వారా ధరఖాస్తులు తీసుకొని పూర్తి చేసిన ధరఖాస్తులను ఈ నెల 24లోగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని తమ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.



## మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ పోలీస్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** వరంగల్ హైవేలో విపరీతమైన ట్రాఫిక్ ఉండడం తో ఒక వృద్ధుడు రోడ్డు దాటలేక దీనావస్థలో ఉండడం చూసి అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్స్ ఆ వృద్ధుణ్ణి రెండు చేతులు పట్టుకొని అవతల వైపుకు రోడ్డు దాటించి మానవత్వాన్ని చాటుకున్న ఈ దృశ్యం వరంగల్ హైవే ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర కనిపించింది. వృద్ధులకు, సాధారణ ప్రజలకు రోడ్డుపై సమస్యలు ఎదురైనప్పుడు ట్రాఫిక్ సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు పోలీసులు తమ సేవలు అందిస్తున్నారు.

# నత్తనడకన కళాశాలల తనిఖీలు

### ఈ ఏడాది కూడా అరకొర వసతులతోనే ఇంజినీరింగ్ చదువులు..? నిర్లక్ష్యంగా 'ఉన్నత విద్యా' అధికారులు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంజినీరింగ్ కళాశాలల తనిఖీలు నత్తనకడన సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా, కేవలం ఫీజురియిబర్స్‌మెంట్ కోసమే కొనసాగే కళాశాలల పట్ల కఠినంగా వ్యవహారించాలని ప్రభుత్వం బావిస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా ఉన్నత విద్యా మండలి పనితీరు మాత్రం కనిపించడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ(ఒయు), జెఎన్‌టియుహెచ్ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలను తనిఖీ చేసి, సమగ్ర నివేదిక సమర్పించాలని ఉన్నత విద్యామండలి ఒయు, జెఎన్‌టియుహెచ్‌లకు సూచించినట్లు తెలిసింది. కానీ ఇప్పటి వరకు కళాశాలల తనిఖీల ప్రక్రియను మాత్రం పూర్తి చేయలేదు. ఒక వైపు ఇంజినిరింగ్ కళాశాలల కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 8వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ముగియకముందే ఆయా కళాశాలలలోని ప్రమాణాలపై పూర్తి స్థాయి నివేదిక అందితే, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం బావించింది. కానీ తనిఖీల పర్వం మాత్రం నామాత్రంగా సాగుతోంది. ప్రమాణాలు పాటించని కళాశాలలను గుర్తించి, వాటిపై చర్యలు తీసుకోవడంలో ఉన్నత విద్యా మండలి కూడా వెనుకడుగు వేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ మధ్య ఇంజనిరింగ్ కళాశాలను చూసేందుకు వెళ్లిన ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్ అక్కడి పరిస్థితులను చూసి అవాక్కాయ్యరు. కొన్ని కళాశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. మరి కొన్ని కళాశాలలో కనీసం హాజరుపట్టిక కూడా లేదు. ఒకటి,రెండు కళాశాలకు ఆ వైస్‌ఛైర్మన్ వెళ్లిన సమయంలో తాళాలు వేసి ఉండడం గమనార్హం. వీటిపైన ఆయన ఒక నివేదికను కూడా ప్రభుత్వానికి సమర్పించినట్లు సమాచారం. అయితే ఆయన తనిఖీలకు వెళ్లిన సదరు కళాశాల యాజమాన్యాలు వైస్‌ఛైర్మన్ తీరుపైన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. నిబంధనల ప్రకారం వైస్‌ఛైర్మన్‌కు తనిఖీ చేసే అధికారం లేదని వాదించారు. మొత్తానికి తనిఖీలు చేపట్టకుండా ఆయా యాజమాన్యాలు ఉన్నత విద్యా మండలి పైన తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇంజినిరింగ్ కళాశాల ప్రమాణాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కనీసం పరిజ్ఞానం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులకు చెక్‌పెట్టాలని ఉన్నత విద్యా మండలిని సిఎం ఆదేశించారు. దీంతో మొత్తానికి ఒయు, జెఎన్‌టియుహెచ్ పరిధిలోని కళాశాలలను తనిఖీచేసి, వాటి ప్రమాణాలపై నివేదికను సమర్పించాలని ఉన్నత విద్యా మండలి ఆదేశించింది. కానీ ఆ ఆదేశాలు సక్రమంగా అమలు జరుగుతున్నాయా? లేదా?అని మాత్రం విద్యా మండలి ఆరా తీయడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**ఈ ఏడాది కూడా అరకొర వసతులతోనే ఇంజినీరింగ్ చదువులు?**

ప్రమాణాలు పాటించని, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఇంజినిరింగ్‌కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ఉన్నత విద్యాశాఖ తాత్సారం చేస్తోంది. ఇటువంటి కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరగడంలో ప్రస్తుత విద్యా ఏడాదిలో కూడా అరకొర వసతులతోనే విద్యార్థులు ఇంజినిరింగ్ కోర్సు ను పూర్తిచేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచైనా అరకొర వసుతులు ఉన్న ఇంజినిరింగ్ కళాశాలలకు చెక్ పెట్టాలని అనుకున్న ప్రభుత్వ లక్ష్యం నేరవేరే పరిస్థితి కనిపించడం లేదు.

ఇంజినిరింగ్ కళాశాలల విషయంలో కఠినంగా ఉండాలని,ఇంజినిరింగ్ చేసిన విద్యార్థులకు పరిజ్ఞానం ఉండడం లేదని పలు సందర్భాల్లో విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితులు మారాలని, ఇలాంటి కళాశాలల పట్ల కఠినంగా వ్యవహారించాలని పదే పదే సిఎం చెబుతున్నప్పటికీ మాత్రం పరిస్థితుల్లో ఎటువంటి మార్పులు కనిపించడం లేదనే విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కొన్ని ఇంజినిర్ కళాశాలలు ప్రమాణాలు పాటిచడంలేదని, కనీస మౌలిక వసతులు కూడా లేవని, ఇంకొన్ని కళాశాలలు కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ సదరు కళాశాలలపైన అధికార యంత్రాంగం దృష్టి కేంద్రీకరించకపోడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# క్రీడ

## తడబడుతున్న టీమిండియా..

టీ బ్రేక్ సమయానికి స్కోర్ 182/3



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా తడబడుతున్నది. ఎడ్జ్‌బాస్ట్ టెస్టులో తొలిరోజు టీ బ్రేక్ సమయానికి టీమిండియా మూడు వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ప్రస్తుతం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 42 పరుగులు, వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ 14 పరుగులతో క్రీజులో ఉన్నాడు. టాస్ ఓడిపోయి బ్యాటింగ్‌కు వచ్చిన టీమిండియాకు ప్రారంభంలోనే వోక్స్ షాక్ ఇచ్చాడు. టీమిండియా 15 పరుగుల వద్ద కేఎల్ రాహుల్ అవుట్ అయ్యాడు. కేఎల్ రాహుల్ కేవలం రెండు పరుగులకే పెవిలియన్ చేరాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో వోక్స్ వేసిన బంతిని డిఫెండ్ చేసే ప్రయత్నంలో రాహుల్ క్లీన్ బౌల్ అయ్యాడు. ఆ తర్వాత కరుణ్ నాయర్ జైస్వాల్ కలిసి 90 బంతుల్లోనే 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే జైస్వాల్ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నారు. టీమిండియా స్కోర్ 95 పరుగులకు చేరిన సమయంలో బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్స్‌కు క్యాచ్ ఇచ్చి కరుణ్ నాయర్ అవుట్ అయ్యాడు. నాయర్ 50 బంతుల్లో ఐదు ఫోర్ల సహాయంతో 31 పరుగులు చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జైస్వాల్ ఇద్దరు కలిసి స్కోర్‌ను 150 దాటించారు. కొద్దిసేపటికే బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో జైస్వాల్ అవుట్ అయ్యాడు. తృటిలో జైస్వాల్ సెంచరీని చేజార్చుకున్నాడు. 107 బంతుల్లో 13 ఫోర్ల సహాయంతో 87 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. జైస్వాల్‌గిల్ జోడీ మూడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం గిల్, పంత్ క్రీజులో ఉన్నారు.

## వరుస పరాజయాలు..

### భారత ఫుట్‌బాల్ కోచ్‌పై వేటు!



భారత ఫుట్‌బాల్ టీమ్ వరుస పరాజయాల నేపథ్యంలో హెడ్ కోచ్ మనోలో మార్క్వెజ్ తన పదవికి రాజీనామా చేశాడు. ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఏఐఎఫ్‌ఎఫ్) అంగీకరంతోనే మార్క్వెజ్ తన బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 క్వాలిఫయర్ మ్యాచ్‌లో భారత్ 01 తేడాతో హాంకాంగ్ చేతిలో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయం ఎదురైన కొద్ది రోజులకే మార్క్వెజ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడం గమనార్హం. గతేడాది జూన్‌లో ఫుట్‌బాల్ కోచ్‌గా మార్క్వెజ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఒప్పందం ప్రకారం అతనికి ఇంకా ఏడాది సమయం ఉన్నా.. వరుస పరాజయాల నేపథ్యంలో తప్పుకున్నాడు. అతని అభ్యర్థనను భారత ఫుట్‌బాల్ సమాఖ్య అంగీకరించింది.

**ఆర్థిక ఇబ్బందుల తలెత్తకుండా..**

ఈ విషయాన్ని ఏఐఎఫ్‌ఎఫ్ డిప్యూటీ సెక్రటరీ సత్యనారాయణ ధృవీకరించారు. 'కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకుంటానని మార్క్వెజ్ చేసిన అభ్యర్థనను ఏఐఎఫ్‌ఎఫ్ అంగీకరించింది. ఎలాంటి ఆర్థికరమైన చిక్కులు తలెత్తకుండా పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే భారత ఫుట్‌బాల్ కోచ్ పదవి కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తాం.'అని సత్యనారాయణ పీటీఐకి తెలిపారు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఓటమి తర్వాత మార్క్వెజ్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. 'ఈ ఓటమి తీవ్రంగా బాధించింది. ఈ ఓటమితో డ్రెస్సింగ్ రూమ్ స్మశానంలా మారింది. అయితే ఈ టోర్నీకి అర్హత సాధించే అవకాశాలు ఇంకా భారత జట్టుకు ఉన్నాయి. మా ఆటగాళ్ల ప్రదర్శన తీవ్ర నిరాశకు గురి చేసింది. నాకు చాలా కోపం వస్తుంది. నాకు మాటలు రావడం లేదు.'అని మార్క్వెజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. మార్క్వెజ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్.. 8 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్కటి గెలిచింది.

**సునీల్ రీఎంట్రీ ఇచ్చినా..**

ప్రస్తుతం భారత ఫుట్‌బాల్ టీమ్ గడ్డు కాలం ఎదుర్కొంటుంది. గతేడాదిగా జట్టు ప్రదర్శన అధ్వాన్నంగా మారింది. గతేడాది ఖాతర్ వేదికగా జరిగిన ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2024లో గ్రూప్ స్టేజ్ నుంచే భారత్ నిష్క్రమించింది. ఈ టోర్నీలో ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. 2023లో ఫిఫా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 99వ స్థానంలో ఉన్న భారత్.. పేలవ ప్రదర్శనతో ప్రస్తుతం 127వ స్థానానికి పడిపోయింది. మాజీ హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్ ఆధ్వర్యంలో 2023 నవంబర్‌లో కువైట్‌పై విజయం సాధించిన తర్వాత భారత ఫుట్‌బాల్ టీమ్ మళ్లీ విజయం సాధించలేదు. భారత దిగ్గజ ఫుట్‌బాల్ ప్లేయర్ సునీల్ ఛెత్రి రిటైర్మెంట్ వెనక్కి తీసుకొని తిరిగి జట్టులోకి వచ్చినప్పటికీ, అది జట్టు అదృష్టాన్ని మార్చలేకపోయింది.

## ప్రతి నెలా భార్య, కూతురుకు 4 లక్షలు ఇవ్వండి..

### క్రికెటర్ షమీకి హైకోర్టు ఆదేశం



**కోల్‌కతా:** టీమిండియా క్రికెటర్ మొహమ్మద్ షమీకి.. కోల్‌కతా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భార్య హసిన్ జహాన్‌తో పాటు కూతురికి ప్రతి నెలా నాలుగు లక్షలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మెయింటెనెన్స్‌లో భాగంగా ఆ అమౌంట్ ఇవ్వాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. భార్యకు నెలా 1.5 లక్షలు, కూతురుకు 2.5 లక్షలు ఇవ్వాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. హసిన్ జహాన్ కోర్టులో పిల్ దాఖలు చేసింది. ప్రతి నెలా నాలుగు లక్షల మెయింటేనెన్స్ ఇవ్వడం వల్ల వాళ్లకు ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. జూలై ఒకటో తేదీన ఈ తీర్పు వెల్లడైంది. తాము ఇచ్చిన ఆదేశాలతో పాటు కూతురు చదువు కోసం లేదా ఇతర ఖర్చుల కోసం షమీ డబ్బులు ఇవ్వవచ్చు అని కూడా కోర్టు తెలిపింది. 2023లో ఇదే కేసులో జిల్లా సెషన్స్ కోర్టును జహాన్ ఆశ్రయించింది. భార్యకు 50వేలు, కూతురికి 80 వేలు ఇవ్వాలని సెషన్స్ కోర్టు ఆదేశించింది. అయితే ఆ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును జహాన్ ఆశ్రయించింది. ప్రతి నెలా తనకు ఏడు లక్షలు, కూతురికి మూడు లక్షలు ఇవ్వాలని జహాన్ కోర్టులో పిటీషన్ వేసింది.

# ఫోకస్ కళారంగం



## బోనం.. గ్రామీణ కళలకు ప్రతిరూపం..

ఈ పండుగను 'కళలకు బోనం'గా పేర్కోవచ్చు. ఎందుకంటే గ్రామీణ కళారూపాలు బోనాల సమయంలోనే ఎక్కువగా ప్రదర్శనకు నోచుకుంటాయి. అనేక ప్రాంతీయ కళారూపాలు వెలుగులోకి వస్తాయి. అలాంటి కళారూపాల్లో పోతురాజులది అగ్రస్థానం. శరీరానికి నూనె రాసుకుని, మెడలో నిమ్మకాయలు కట్టుకుని, చేతిలో కొరడాలతో చేసే నాట్య ప్రదర్శనలు. పోతురాజులకు హావభావ ప్రదర్శనలతోపాటు, నాట్య నైపుణ్యాలు కూడా ఉండాలి. ఇక, డప్పు, బజాలు, డోలు ఉండనే ఉంటాయి. వీటి నాదమే ఊరంతా పండుగ శోభను చాటుతుంది. ఒక్కో వాయిద్యం ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటుంది. బోనాలు ఎత్తుకున్న వారిని... పోతురాజులనే కాదు... చూసే వారిని కూడా నాట్యమాడేలా చేస్తాయి. గంగిరెద్దు కళాకారులు గ్రామీణ ప్రాంత బోనాల్లో ప్రత్యేక ఆకర్షణ. వారు గంగిరెద్దులను అలంకరించి ఊరూరా తిరుగుతారు. నాట్యం చేస్తారు. బుర్రకథలు, యక్షగాల ప్రదర్శనలు ఉంటాయి. బోనాల సందర్భంగా కొన్ని చోట్ల శక్తి దేవతల చరిత్రను బుర్రకథగా ప్రదర్శిస్తారు. ఈ కళలన్నీ స్థానిక ప్రజల జీవనంలో భాగమైనవే. అంతేకాదు, గ్రామీణ కళాకారులకు ఉపాధి కలిగించే అవకాశాలు కూడా. బోనాల సందర్భంగా మహిళలు లంగావోణీ, చీర, పట్టు వస్త్రాలు, పసుపుకుంకుమతో మునిగిన పట్టు చీరలు, తలపైన బోనం, చేతిలో లాటిమ్మ, కళ్లలో నమ్మకం, నడకలో భక్తి.. ఇవన్నీ కలిసి ఒక కళాత్మక రూపాన్ని సమర్పిస్తాయి. ఈ సంప్రదాయ దుస్తులు, అభరణాలు భారతీయ సౌందర్య సాంప్రదాయానికి నిదర్శనం. బోనాల్లో మహిళలే ప్రధాన పాత్రధారులు. వారు అమ్మవారికి బోనాలు సమర్పించడం, నైవేద్యం తయారీ, శోభాయాత్రల్లో పాల్గొనడం వంటి సమస్త కార్యాల్లో శక్తి అనే సిద్ధాంతానికి జీవితం పోసే పండుగగా ఇది విరాజిల్లుతుంది. మహిళల నిబద్ధత, భక్తి, కుటుంబ ఆధ్యాత్మికత బోనాల ద్వారా సామూహికంగా వ్యక్తమవుతాయి. జానపద కళలతోపాటు, జానపద సాహిత్యం కూడా బోనాల్లో జాలువారుతుంది. బోనాల సందర్భంగా పాడే పాటలు, నినాదాలు, ప్రజల సంభాషణలు, తదితరాలన్నీ తెలంగాణ భాషకు ప్రమాణికాలే. ప్రత్యేకంగా పల్లెటూర్ల భాషలో చెప్పే కథలు, శక్తి మాత వృత్తాంతాలు భాషా సంపదను గణనీయంగా భద్రపరుస్తున్నాయి. బోనాల సందర్భం స్థానిక భాషా సంస్కృతిని తిరిగి గుర్తు చేస్తుంది. బోనాలను సామాజిక ఐక్యతకు వేదికగా కూడా పేర్కోవచ్చు. పండుగకు కుల, మత, వర్గ భేదాలు ఉండవు. అందరూ ఒకే అమ్మవారికి బోనాలు సమర్పించడం, కలసి ఊరేగింపులో పాల్గొనడం సామాజిక సమన్వయాన్ని చాటుతుంది. ఇది సమాజం మొత్తం ఒక కుటుంబంగా నడుస్తున్నదన్న బలమైన సంకేతం. నిన్న మొన్నటివరకు బోనాలు పూర్తిగా సంప్రదాయ పద్ధతుల్లో జరిగేవి. కానీ ఆధునిక కాలంలో దీన్ని సాంకేతిక పరిజ్ఞానంతో కలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫ్లెక్సీలు, ఆలయ లైవ్ ప్రసారాలు, సామాజిక మాధ్యమాల్లో బోనాల ఉత్సవాల ప్రచారం.. ఇవన్నీ ఈ సంప్రదాయానికి ఆధునికతను జత చేస్తున్నాయి. అంతేకాదు, యువత కూడా మరచిపోతున్న సంప్రదాయాలకు మరలా శ్రద్ధ చూపుతోంది. పర్యాటక అభివృద్ధికి ప్రేరణగానూ బోనాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బోనాలను తిలకించడానికి, ప్రత్యేకించి ఈ సందర్భంగా ప్రదర్శించే కళారూపాలను చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది తెలంగాణకు, ప్రత్యేకించి హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు తరలివస్తారు. హైదరాబాద్ నగరంలోని గోల్కొండ బోనాలు, ఉజ్జయిని మహంకాళి బోనాలు వంటి పండుగలు పర్యాటక ప్రాధాన్యత పొందాయి. దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఇది ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తోంది. బోనాల పండుగలో భౌతిక అలంకారాలు, ఆధ్యాత్మిక నమ్మకాలు, కళా రూపాలు.. ఇవన్నీ కలిసిపోయి భక్తి అనే అజస్ర నదిగా ప్రవహిస్తాయి. ఇది మన శరీర, మనోభావాల పునర్వ్యాఖ్యానమే కాదు, సంస్కృతి యొక్క శాశ్వతతకు సంకేతం. సూక్ష్మంగా చెప్పాలంటే, బోనాలు తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి నిలయం. బోనాల ద్వారా ప్రజలు తమ ఆత్మను, ఆరాధనను, కళను, భాషను, సమాజాన్ని జపించుకుంటారు. అందుకే ఈ పండుగను సాంస్కృతిక సంరక్షణకు వేదికగా పరిగణించవచ్చు.

గోల్కొండలో శ్రీకారం చుట్టుకోవడంతో బోనాల సందడి ఇప్పటికే ప్రారంభమైంది. సికిందరాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో జరగనున్న వేడుకతో మరింత జోరందుకుంటుంది. 'లష్కర్ బోనాలు' అంటే తెలియనివారు ఉండరు. తెలంగాణలో బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక అనుబంధానికి పరిమితమైనది మాత్రమే కాదు. ఇది సమాజంలోని సంప్రదాయాలను, స్థానిక కళా రూపాలను, గ్రామీణ జీవనశైలిని, మహిళా శక్తిని ప్రతిఫలింపజేసే గొప్ప సాంస్కృతిక వేదిక.



తిరుపతిలో జూన్ 27, శుక్రవారం జరిగిన శ్రీనివాస నృత్య సంగీత నీరాజనంలో పాల్గొన్న కళాకారిణులు.



# మహబూబాబాద్ మున్సిపాలిటీలో అత్యధిక స్థానాల్లో సిపిఐ


- వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి విజ్ఞప్తి
- ఘనంగా సిపిఐ మహబూబాబాద్ పట్టణ 14వ మహాసభ
- అరుణ పతాకాన్ని ఎగురవేసిన బి.నీరజారెడ్డి ధర్మన్న



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అంతిమ లక్ష్యం కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడమేనని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి విమర్శించారు. మహబూబాబాద్ పట్టణ సిపిఐ14వ మహాసభ పేరాల కట్టయ్య పంక్షన్‌హాల్‌లో అమరజీవి దాస్యం రామ్మూర్తి ప్రాంగణంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మహాసభనుద్దేశించి మాట్లాడుతూ దేశంలో పేద ప్రజల దేశ సంపదను దోచి కార్పొరేట్లైన అంబానీ, అదానీలకు దోచిపెట్టడానికే మూడవసారి ప్రధాని అయ్యావా మోదీ అని ఆయన ప్రశ్నించారు. గత 11ఏళ్ళలో దేశానికి మోదీ చేసింది ఏమీ లేదన్నారు. కేవలం 140కోట్ల ప్రజలను వదిలిపెట్టి ఊడిగం చేస్తోందన్నారు. దేశంలో మతోన్మాద రాజకీయాలుచేస్తూ విభజించి పాలిస్తూ దేశంలో అల్లర్లు సృష్టిస్తున్నారని అన్నారు. ఆర్‌ఎస్ఎస్ బిజెపి కలిసి దేవబూన్ని బ్రష్టు పట్టిస్తున్నారని, కమ్యూనిస్టులు నిజమైన దేశభక్తులని బిజెపి అరాచకాలను రానున్న కాలంలో ప్రజలు ఎండగట్టి వారిని ఇంటికి పంపించే రోజులు దగ్గరలోనే వస్తాయని విజయసారథి జోస్యం చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మహబూబాబాద్ మున్సిపాలటీ పరిధిలో అత్యధిక సీట్లు గెలిపించాలని మహాసభ ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు. అత్యధిక సీట్లు గెలిపించడం ద్వారా పట్టణంలో మెరుగైన పాలన సేవ ప్రజలందరికీ అందిస్తామని విజయసారథి తెలిపారు. గత పదేళ్ళలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. శివారు కాలనీలో ఎక్కడ గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, సిసి కాల్వలు గత టిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీలు అధ్వానంగా తయారయ్యాయని, నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. రాబోయే మున్సిపాలిటీలో అధికస్థానాల్లో గెలిచి ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తామని తెలిపారు. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ గత 2014లో మూడు స్థానాలు, 2020లో రెండు స్థానాల్లో గెలిచి పట్టణంలో ఉన్న సమస్యలన్నిటిపై మున్సిపాలిటీలో చర్చించినట్లు, ఎప్పటికప్పుడుసమస్యలను మున్సిపల్ దృష్టికి తీసుకువవస్తూ పోరాటం చేశామన్నారు. పట్టణంలో గెలిచిన వార్డుల్లో వందశాతం అభివృద్ధి చేశామన్నారు. రానున్న కాలంలో అత్యధిక సీట్లలో గెలిపించాలని, సిపిఐ ప్రతినిధులుగా సేవ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వందేళ్ళ చరిత్రగల సిపిఐ దేవంలో ప్రజల కోసం ఉద్యమిస్తోందన్నారు. రాబోయే జూలై 5,6 తేదీల్లో జరుగుతున్న సిపిఐ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్, తండ సందీప్, ఆబోతు అశోక్, వంకాయపాటి చిరంజీవి, అజ్మీర వేణు, ఎండి మహమూద్, చీదిరాల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల, రామకృష్ణాపూర్ మధ్య ఆర్‌టిసి బస్సులు నడపాలి


సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లక్ష్మణ్



**ప్రజాపక్షం /రామకృష్ణాపూర్ :** మంచిర్యాల, రామకృష్ణాపూర్ మధ్య ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఈ మార్గంలో బస్సులను నడపాలని కోరుతూ బుధవారం మంచిర్యాలలోని ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రామకృష్ణాపూర్ పట్టణంలో సుమారు 40 వేల మంది జనాభా నివసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తరచూ వివిధ అవసరాల నిమిత్తం మంచిర్యాలకు ప్రయాణించాల్సి వస్తోందని, అయితే బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు భద్రతా సమస్యలను ఎదుర్కొంటున్నారని, వైద్యం కోసం వెళ్లేవారికి ప్రైవేట్ వాహనాల వల్ల ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. గతంలో రైల్వే ఫ్లై ఓవర్ వంతెన లేకపోవడం రవాణాకు అంతరాయంగా ఉండేదని, అయితే ప్రస్తుతం క్యాతనపల్లి వద్ద రైల్వే ఫ్లైఓవర్ వంతెన పూర్తయి ప్రారంభం కావడంతో ఆర్‌టిసి బస్సులు నడపడానికి ఏలాంటి ఆటంకం లేదని లక్ష్మణ్ స్పష్టం చేశారు. కాబట్టి ఆర్‌టిసి అధికారులు తక్షణమే బస్సు సర్వీసులు ప్రారంభించి ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిపో మేనేజర్ శ్రీనివాస్ స్పందిస్తూ, రామకృష్ణాపూర్ ప్రజల అవసరాన్ని గుర్తించామని, డిపో స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, నక్క వెంకటస్వామి, మిట్టపల్లి పౌల్, కాదండి సాంబయ్య, వనం సత్యనారాయణ, మామిడి గోపి, మొండి తదితరులు పాల్గొన్నారు.

## 6న సిపిఐ నిర్మల్ జిల్లా మహాసభ

కరపత్రాల విడుదల చేసిన సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) తమ నాలుగో జిల్లా మహాసభల ప్రచారాన్ని వేగవంతం చేసింది. ఈ రోజు సిపిఐ కార్యాలయంలో, మెడికల్ కాంట్రాక్టు వర్కర్లుతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ, జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లాలో సిపిఐ ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో,ప్రజాస్వామ్య,లౌకిక,సోషలిస్టు పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ప్రజల అవసరాలను ఖచ్చితంగా తీర్చగలదని ఆయన అన్నారు. జూలై 6వ తేదీన గాంధీ పార్క్ నుండి అంబేద్కర్ విగ్రహం మీదుగా పెన్షనర్ భవన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కళావేణి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని విలాస్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్.ఎన్. రెడ్డి మాట్లాడుతూ, సిపిఐ సుదీర్ఘ చరిత్ర కలిగిన రాజకీయ పార్టీ అని అన్నారు. సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాథోడ్ పుండాలిక్, మల్లేష్, సమ్మయ్య తదితరలు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు ఏడునెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ములుగు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ స్కావెంజర్లకు ఇచ్చేదే అరకొర వేతనాలు అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే వారు జీవించడం ఎలా అన్నారు. కనుక వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే స్కావెంజర్ల వేతనాలు అమ్మ ఆధర్మ కమిటీల ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని అన్నారు. స్కావెంజర్ల నియామకాన్ని కంటి తుడపు చర్యగా కాకుండా వారి అవసరం తప్పనిసరి ఉన్నందున నియామక పత్రాలు అందించి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి వేతనాలు వారి వారి ఖాతాలలో జమ చేయాలని అన్నారు. ఇంకా అనేక సమస్యలు పరిష్కారానికి గాను సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజు, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సర్వీస్ వర్కర్స్, స్వీపర్లు, స్కావెంజర్స్ యూనియన్ నాయకులు, సామల రమ, మునెమ్మ, మాలూరి కమలక్క, ఎం రాజమ్మ, రమాదేవి, కె పద్మ, కె కుమారి, ఈ రమాదేవి, నిర్మల, కమల, తదితరులు పాల్గొన్నారు.



## పెట్టుబడిదారీ వర్గానికి కొమ్ముకాస్తున్న మోదీప్రభుత్వం


దేశవ్యాపిత సమ్మెను విజయవంతం చేయాలి:గన్నారపు రమేష్



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ కోరారు. కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో సమావేశం నిర్వహించగా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కేంద్రం లో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల పైన, రైతుల పైన, దాడి మొదలు పెట్టాడని కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను పెట్టుబడిదారీ వర్గానికి కొమ్ముకాస్తూ నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయానికి గురిచేస్తున్నాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడం జరుగుతుందన్నారు. నిత్యవసర వస్తువుల ధ రలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దానికి అనుగుణంగా కార్మికుల జీతభత్యాలు పెరగడం లేదని పెద్ద నోట్ల రద్దు జిఎస్‌టి తీసుకురావడం వల్ల అనేక రకాల చిన్న మధ్యతరహా పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, వారి జీవనం అస్తవ్యస్తంగా మారిపోయిందని, దానికి కారణం కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వమే అన్నారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె కు కేంద్ర కార్మిక సంఘాలు అన్ని ఒకే తాటిపైకి వచ్చాయని, ఈ సమ్మెలో కార్మికులు, కర్షకులు, ప్రజలు, రైతులు పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు వేలాది అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఐఎన్‌టియుసి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ నాయకుల అక్రమ అరెస్ట్

**ప్రజాపక్షం/మునుగోడు :** 140 కోట్ల ప్రజల ప్రయోజనాలను ట్రంప్‌కు తాకట్టు పెట్టిన మోడీ విధానాలు నశించాలని, అమెరికా చేతిలో తొత్తుగా మారిన నరేంద్రమోదీ అని, భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలు ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఛలో అమెరికా రాయబార కార్యాల(అమెరికన్ కాన్సులేట్) ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన నాయకులను మునుగోడు పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి మునుగోడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివాళా కోరు ఉగ్రవాద ప్రేరేపిత దేశం పాకిస్తాన్‌కు అమెరికా రెడ్ కార్పెట్ వేస్తూ తన సామ్రాజ్యవాద విష పోకడలను అనుసరిస్తుందని ధ్వజమెత్తారు. ఔర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్ అంటూ అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో మోదీ ట్రంప్ గెలుపు కోసం భారతీయులతో మీటింగ్ ఏర్పాటు చేసి ట్రంప్‌ను గెలిపించాలని మోదీ కోరడం సిగ్గు చేటు అన్నారు. అనంతరం ఎన్నికల్లో గెలిచిన ట్రంప్ భారతీయులపై తన కర్కశాన్ని ప్రదర్శించాడన్నారు. ఇటీవల కాలంలో జరిగిన భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ నిసిగ్గుగా మీడియాకు చెప్పినా, మోదీ ఖండించలేదన్నారు. ఇప్పటికైనా సామ్రాజ్యవాద అమెరికా నీచ పోకడలను మోదీ వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు.అరెస్ట్ అయిన వారిలో ఎఐవైఎఫ్ మునుగోడు మండల కార్యదర్శి బండారు శంకర్, ఉపాధ్యక్షులు గోస్కొండ మల్లేష్, నాయకులు కట్కూరి లింగస్వామి, కట్ట దశరథ, గోపగోని ఉదయ్,అందుగుల నరేష్, తదితరులు ఉన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ చందంపేట మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఎక్కడా కూడా ఇండ్లు వచ్చిన దాఖలాలు లేవని కాని నేటి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికారులతో సర్వే నిర్వహించి ఇండ్లు లేని పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి కేవలం బిఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చుకున్నారని ఇండ్లు లేని నిరుపేదలకు బిఆర్ఎస్ హయాంలో ఎటువంటి లబ్దిచేకూరలేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇండ్లు ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అన్యాయం జరిగితే వెంటనే మండలాధికారులకు తెలపాలని, ఎవరైనా మధ్యవర్తులు, అధికారులు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని డబ్బులు ఆశించిన వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతి పేదకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

## భూ తగాదాలతో తండ్రిని హతమార్చిన తనయుడు



**ప్రజాపక్షం/మోతె:** భూ తగాదాలతో ఓ తండ్రిని హత్య చేసిన ఘటన మండల పరిధిలోని విభాళాపురం శివారులో బుధవారం చేటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగయ్యగూడెం గ్రామానికి చెందిన నిమ్మరబోయిన వెంకన్న (58) మృతుని పెద్ద కుమారుడు గంగయ్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వెంకన్న పేరుతో 4 ఎకరాల భూమి ఉండగా, ఆ భూమిలో ఒక ఎకరం కూతురుకు పసుపు కుంకుమ కింద ఒక ఎకరం ఇవ్వగా, మరో మూడు ఎకరాల భూమిని ఇద్దరు కుమారులు పట్టా చేయాలని పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా భూమి పట్టా చేయడం లేదని తండ్రితో గొడవ పడినట్లు వివరించారు. భూ తగాదాలతో ఘర్షణపడి గొడ్డలితో తలపై కొట్టగా తీవ్రంగా గాయాలు కావడంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనస్థలంకు చేరుకుని కొన ఊపిరితో ఉన్న వెంకన్నను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆసుపత్రిలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలపగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** వర్షకాల నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి సూచించారు. బుధవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 28 వార్డులో నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ సిహెచ్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ ఇంటిలోని తడి, పోడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. వీధుల్లో సంచరించే కుక్కలకు బెల్టులువేసి, అవసరమైన టీకాలు వేయించాలని తెలిపారు. అలాగే వార్డులో మున్సిపాలిటిలో సరఫరా చేస్తున్న తాగునీటిని పరీక్షించి శుద్ధమైన నీరు అందించనున్నట్లు చెప్పారు. నిరుపేద మహిళలకు స్వయం సహాయక సంఘాలపై అవగాహన కల్పించడం జరిగిందని చిరు వ్యాపారులను గుర్తించి స్ట్రీట్ వెండర్ సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు రాపర్తి శ్రీను, మున్సిపల్ డిఈ సత్యారావ, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమల్లయ్య, టిఎంసి శ్వేత పాల్గొన్నారు.

## బస్సులురాక విద్యార్థుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామం నుండి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాచిల్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మోడల్ స్కూల్‌కు రోజు సుమారు 30 మంది విద్యార్థులు వెళుతుంటారు. విద్యార్థులు పాచిల్ల మోడల్ స్కూల్‌కు వెళ్ళాలంటే ఆర్టిసి బస్సు సౌకర్యంతో వెళ్ళాలి, అయితే ఆర్టిసి బస్సు రోజు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు రోజు ఉదయం 9 గంటలకు పాఠశాలకు చేరుకోవాల్సి ఉండగా ఉదయం 10 గంటలకు పాఠశాలకు చేరుకోవడంతో వారికి రోజు ఒక పిరియడ్ కోల్పోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండకొత్తపల్లి వెళ్లే బస్సును మరిపడిగ గ్రామం మీదుగా పంపితే బస్సు మోడల్ స్కూల్ మీదుగా వెళుతుంది కావున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని విద్యార్థులు తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్తోమత లేక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తుంటే సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురిఅయ్యి, చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందని, బస్సు సమస్యపై ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్ళిన ఫలితం లేదని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరుతున్నారు.

## నిబంధనలకు లోబడే పరిశ్రమ నడుపుతున్నాం

ఎండి గోలి మనిందర్ రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం ధర్మోజీ గుడెం గ్రామ పరిధిలోని జై లారా డ్రగ్స్ పరిశ్రమ వల్ల భూ గర్భ జలాలు కలుషితమై పంటలు పండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం పరిశ్రమ ఆవరణలో గ్రామ రైతులు ఆందోళన నిర్వహించారు. స్పందించిన పరిశ్రమ యజమాని గోలి మనిందర్ రెడ్డి మాట్లాడుతూ జై లారా డ్రగ్స్ పరిశ్రమను 2017లో స్థాపించడం జరిగిందని 3 సంవత్సరాల వరకు పరిశ్రమలో ఉన్న బోర్ నీటిని వాడుకున్నామని, మా పరిశ్రమ పరిసర ప్రాంతాల్లోనే చాలా బల్క్ రసాయన పరిశ్రమలు ఉన్నాయని కాలక్రమేనా భూ గర్భ జలాలు కలుషితం కావడం తో మేము కూడా బయట నుండి నీరు కొనుక్కుని పరిశ్రమలో వాడుతగున్నామని తెలిపారు. మా పరిశ్రమ నుండి ఎటువంటి రసాయణాలు ఉత్పత్తి కాదని, కేవలం పెల్లెట్స్ మాత్రమే ఉత్పత్తి అవుతాయని మా పరిశ్రమ నుండే కాలుష్యం వేదజల్ళుతుందని భ్రమలో రైతులు ఉన్నారని, వారికి మా పరిశ్రమ ఉత్పత్తుల గుర్చి క్షుణ్ణంగా వివరించామని అన్నారు. అన్ని శాఖల ప్రభుత్వ నిబంధనలకు లోబడి పరిశ్రమ నిర్వహించడం జరుగుతుందని ధర్మోజీగూడెం గ్రామానికి చెందిన వారు కూడా కార్మికులుగా ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంత్రి వెంకట్ రెడ్డిలు చొరవ చూపి కాలుశ్య కారక పరిశ్రమలపై చర్యలు చేపట్టాలని పత్రిక ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ మేనేజర్ అనుధీప్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఫణిందర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, శ్రీనివాస్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# చిక్కరు... దొరకరు...

### ఎప్పుడైనా... క్రింది స్థాయి... ఉద్యోగులే బలి పశువులు
### తప్పించుకునేందుకు అధికారులు అప్రమత్తం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో పర్యవేక్షణ లోపం, భద్రత వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ రెండింటీలో కేవలం విధులు నిర్వహించే కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందే టార్గెట్గా బలి పశువులను చేశారు. హైలెవల్ కమిటీని కూడా ఇక్కడి అధికారులు విచారణలో తప్పుదోవ పట్టించి ముగ్గురు వంటస్వాములు, ప్రిపరేషన్ ఇన్చార్జీని సస్పెండ్ చేసి ఇద్దరు పర్యవేక్షకులకు చార్జీమెమోలు జారీ చేశారు. ఉన్నతాధికారుల చర్యలు కూడా అధికారులకు అనుకూలంగా మారిన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతీది మా తప్పిదమే లేదని తప్పించుకోవటం అధికారులకు శరమామూలుగా మా రింది. దేవస్థాన పరిధిలో ఎప్పుడు.. ఏం జరిగినా విభాగానికి చెందిన అధికారులు మాత్రం కడిగిన ముత్యమో లో బయట పడుతున్నారు. కానీ, ఈ సారీ భిన్నంగా ఇద్ద రు పర్యవేక్షకుల నిర్లక్ష్యం కింద బాధ్యులను చేస్తూ చార్జీమెమోలు జారీ చేశారు. ఇక్కడ అవుట్సోర్సింగ్ సిబ్బంది ని ప్రలోభాలతో పావులుగా వాడుకొని బలి చేస్తున్నారు.

**ఆరోపణలను కమిటీ పట్టించుకోలే :** ప్రసాదాల తయారీ కేంద్రంలో గత నెల 28 రాత్రి 2.25 గంటలకు జరిగిన చింతపండు చోరీతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయమైంది. దొంగతనం వెనక అధికారులు ప్రమేయం ఉదా? లేదా? విచారించలేదు. దొంగతం పాల్పడిన వారికి మద్దతు అధికారులు మద్దతు ఇచ్చారని కమిటీ దృష్టి సారించలేదు. తాము చేసిన దొంగతనానికి వంటస్వాముల ప్రమేయం ఉందని ముద్దాయిలు ఆరోపించారు. ఏ అధికారి పేరు చెప్పొద్దు? మీకేం కావలెనో నేను చూసుకుంటానని? దేవస్థానంలో ఓ అధికారి హామి ఇచ్చినట్లు తల్లిదండ్రులు చెప్పారు. ముద్దాయిలు, తల్లిదండ్రుల ఆరోపణలు కమిటీ వినిపించుకోలేదు. రెండో రోజు విచారణ సమయంలో సీసీ పుటేజీల ఆధారంగా అవట్ సోర్సింగ్ లో పని చేసిన దిలీప్ ను విచారించగా అధికారులు పేర్లు బయటపెట్టినట్లు తెలిసింది.

**అధికారులను వదిలేశారు :** కాగా, దేవస్థానంలో అవినీతి, దొంగతనాలు జరిగితే పై స్థాయి అధికారులకు ఎలాంటి బాధ్యత ఉండదా? వారిని ఎందుకు బాధ్యుల చేయరూ? ప్రసాదాల తయా రీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించరా? సరుకుల హెచ్చు, తగ్గులను డీఈవో, ఏఈవో స్థాయి అధికారులు ఎందుకు గుర్తించలేదు? స్టాక్ సరిగానే ఉన్నట్లు రిజిస్టర్లపై గుడ్డిగా సంతకం ఎలా చేశారు? ఏఈవో రిజిస్టర్‌లో చేసిన సంతకం కమిటీ గుర్తించలేదాని? భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ అధికారులు కూడా పరోక్షంగా వాట పొందుతున్నారా? పని ఒత్తిడి వల్ల పరిశీలించకుంటే రిజిస్టర్ ఏముందో తెలియని స్థితిలో సంతకం ఎలా చేశారు? ఈ కోణంలో విచారణ ఎందుకు జరగలేదని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారి సంతకం చేశారంటే అవినీతి జరగనట్టా? కాదా? దేవాదాయ శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**ఎందుకు గుర్తించలేదో :** ఏఈవోలను వదిలి పర్యవేక్షకులకు ఎందుకు చార్జీమెమోలు ఇచ్చారో అంతు చిక్కకుంది. దురుద్దేశ్యంతో పర్యవేక్షకులు గుర్తించకపోతే ఏఈవో ఎందుకు గుర్తించలేదోనని సందేహాలు ఉన్నాయి. పారదర్శకంగా కమిటీ విచారణ జరిగితే విభాగంలో విధులు నిర్వహించిన అందరిని బాధ్యులను చేయాలి. కానీ, ఇక్కడ కింది స్థాయి ఉద్యోగి సీనియర్ అసిస్టెంట్ నవీన్, ముగ్గురు వంటస్వాములను (సహాయ పాచకులు) బలి పశువులను చేశారు. ఎంత అవినీతి, అక్రమం జరిగిన డీఈవో, ఏఈవోకు ఎలాంటి బాధ్యతలు లేనప్పుడు విభాగం వారికి అప్పగించడం ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది.

**భద్రత వైఫల్యం :** కొండపైన భద్రత వైఫల్యం కూడా ఉంది. స్థానిక పెట్రోలింగ్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు దొంగతనం బయటపడింది. కొండపైన భద్రత సిబ్బంది తనిఖీలు చేపట్టక ఎవరెవరు వచ్చి వెళ్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దొంగతనం జరిగిన రోజున కారు ఎప్పుడు వచ్చింది? అక్కడే ఎందు కు నిలిపారు? అని సిబ్బంది ఎందుకు అనుమానించలేదనే ప్రశ్న తలెత్తుతోంది. టోల్ గేట్ వద్ద టికెట్టు లేని కారును కొండపైన ఎందుకు అనుమతించారని విచారణ జరగలేదు. స్థానిక పోలీసుల సమాచారం మేరకు భద్రత సిబ్బంది స్పం దించే కానీ లేకుంటే దొంగతనం బయటపడేదే కాదు. అరకొర సిబ్బందితో పూర్తి స్థాయిలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయలేక పోతున్నారు.ఎన్ని ఆరోపణలు వచ్చిన మాకు సంబంధం లేదు. మేం ఎలాంటి పొరపాటు చేయలేదు. మాకు అవినీతి మరకే అంటలేదని తప్పించుకునేందుకు ఇక్కడి అధికారులు ఎప్పుడు అప్రమత్తంగా ఉంటారు. ఆరోపణలు రాగానే క్రింది స్థాయి అధికారులు, సిబ్బందిని ఇరికించే కుతంత్రాలకు తెర తీస్తారు. నయానా, బయానా చేసి వారి వైపు తిప్పుకుంటారు.

## హ్యామ్ విధానంలో డబుల్ రోడ్ల నిర్మాణం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు రూ. 12000 కోట్ల రూపాయలతో హ్యామ్ విధానంలో డబుల్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ రహదారి పనులకు ఆగస్టు మొదటి వారంలో టెండర్లను పిలువనున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం మంత్రి ఉమ్మడి జిల్లా సమీక్ష అనంతరం 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్అండ్‌బి ఎస్ ఈ కార్యాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు.అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ హ్యామ్ విధానంలో మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాల డబుల్ రోడ్డు నిర్మాణానికి గాను గత క్యాబినెట్లో ఆమోదం పొందడం జరిగిందని, ఇందులో భాగంగా కాంట్రాక్టర్ 40 , బ్యాంకు ద్వారా 60 శాతం రుణం తీసుకుని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఈ విషయంపై గురువారం ఎర్రమంజిల్ లోని ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నామని, ముందుగా 10 ప్యాకేజీలకు సంబంధించి 3000 కోట్ల రూపాయలతో పనులకు టెండర్లు పిలువనున్నామని , మొదటి దశలో 5190 కోట్లతో, రెండవ దశలో 7000 కోట్లతో పనులు చేపట్టనున్నామని తెలిపారు. హ్యామ్ విధానం 7 రాష్ట్రాల్లో అమల్లో ఉందని, మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ ద్వారా కూడా 15 వేల కోట్ల రూపాయలతో, మొత్తం 29 వేల కోట్ల రూపాయలతో హ్యామ్ రోడ్లు నిర్మించనున్నామని చెప్పారు. ఆర్ అండ్ బి శాఖలో ఖాళీగా ఉన్న 150 ఏఈల నియామకానికి టీజిఎస్‌పిఎస్సీకి నివేదించినట్లు చెప్పారు. నల్గొండ జిల్లాకు ఆర్ అండ్ బి ద్వారా 12000 కోట్ల రూపాయల పైనే నిధులు ఇవ్వడం జరిగిందని, రహదారులపై ఏ ఒక్క ప్రమాదం జరగకుండా అరికట్టాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ , దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, అండ్ బి ఎస్ ఈ వెంకటేశ్వరరావు ఈ ఈ లు,డి ఈ లు,అసిస్టెంట్ ఇంజనీర్లు ,తదితరులు ఉన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజం అని, పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో దాదాపు 40 సంవత్సరాల కాలం పాటు విధులు నిర్వర్తిస్తూ జూన్ 30 న పదవి విరమణ పొందిన పోలీసు అధికారులు ఎస్ఐ విల్సన్, ఏఆర్ ఎస్ఐ చందులాల్,హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ యాదయ్య, ఎల్.జి.యస్ సత్యనారాయణను బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ ఘనంగా సత్కరించి వారు పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తూ పదవి విరమణ పొందడం అభినందనీయం అని అన్నారు. పదవి విరమణ పొందిన అనంతరం కూడా పోలీసు కుటుంబ సభ్యులేనని, ఏలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. అనంతరం వారికీ అందవలసిన ఆర్థిక సదుపాయాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,ఏ.ఓ శ్రీనివాసులు, ఆర్.ఐ సంతోష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ డాక్టర్ అవార్డు



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లా నుండి ఒక ఉత్తమ డాక్టర్ కు అవార్డు ప్రధానం చేయడం జరిగింది. డాక్టర్ వృత్తి నిర్వహిస్తూనే సమాజంలో పేద వారి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించినటువంటి డాక్టర్లను ఆయా జిల్లాల లైన్స్ క్లబ్ వారి ద్వారా డాక్టర్ యొక్క వివరాలు సేకరించి సమాజ శ్రేయస్సు కోసం, పేదవారం కోసం, సేవా కార్యక్రమాలను నిర్వహించినటువంటి డాక్టర్‌ను జిల్లా లైన్స్ క్లబ్ లయన్స్ క్లబ్ ఆఫ్ జోగులాంబ గద్వాల వారి ద్వారా ఎంపిక చేసి వారికి డాక్టర్స్ డే రోజును పురస్కరించుకుని హైదరాబాద్ బంజారాహిల్స్ ప్రసాద్ ఆడిటోరియం నందు ఈ అవార్డును సినీ యాక్టర్ సుమన్ లైన్స్ క్లబ్ 320ఎ గవర్నర్ డాక్టర్ మహేందర్ కుమార్ చేతుల మీదుగా ఇవ్వటం జరిగింది. డాక్టర్ మహేష్ డెంటల్ హస్పిటల్ ను ప్రారంభించడం జరిగింది. 2003 సంవత్సరం నుండి ఎన్నో రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ జోగులాంబ గద్వాల్ ప్రెసిడెంట్ గట్టు ఈశ్వరయ్య కోశాధికారి ఎ.రామ్మోహన్, సభ్యులు, డాక్టర్ మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ కృష్ణయ్య పిడి, సెక్రెటరీ కరాటే శ్రీహరి, సభ్యులు హెచ్‌కె బషీర్ లైన్స్ క్లబ్ జోగులాంబ గద్వాల సభ్యులు అందరితో పాటు డాక్టర్ మహేష్ మిత్రులు, ఉన్నత పోలీసు అధికారి షాకీర్ హుస్సేన్, అడిషనల్ ఎస్పీ రాచకొండ సర్కిల్ పాల్గొన్నారు.

## శిధిలావస్థకు చేరిన ఇండ్లు నేలమట్టం

### యాజమానులకు ముందుగా నోటీసులు
### ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దంటున్న అధికారులు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** శిధిలావస్థకు చేరుకున్న ఇండ్లను మున్సిపల్ అధికారుల ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు నేలమట్టం చేస్తున్నారు. పట్టణంలో శిధిలావస్థకు చేరిన ఇండ్లను ముందుగా గుర్తించి వారిని నోటీసులు జారీ చేస్తున్నారు. వర్షకాలం కావడంతో ఇండ్లు కూలి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని చెబుతూ అందులో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయిస్తున్నారు. శిధిలావస్థకు చేరిన ఇండ్లలో నివాసం ఉంటూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట పట్టణం 92 చదరపు కిలో మీటర్ల మేరకు విస్తరించి ఉంది. దాదాపు 30వేలకు పైగా నివాసాలు ఉండగా, 1 లక్షా 60వేలకు పైగా జనాభా ఉంది. 48 వార్డులుండగా పట్టణంలో దాదాపు వందకుపైగా శిధిలావస్థకు చేరిన నివాసాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే మున్సిపల్ ఉద్యోగులు 40 వరకు గుర్తించారు. ఈ ఇంటి యాజమానులకు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. వర్షకాలం కావడంతో శిధిలావస్థకు చేరిన ఇండ్లు ఇప్పటికే ఇంటిపైకప్పులు పెచ్చులూడి కిందపడటం, గొడలు కూడా నెర్రలు బారీ ఉండటంతో జెసిబి ల సాయంతో ఆలాంటి ఇండ్లను నేలమట్టం చేస్తున్నారు. కొంత మంది ఇంటి యాజమానులు తామే వాటిని కూల్చుతామని చెబుతూ కొంత సమయాన్ని కోరుతున్నారు. కాని అధికారులు మాత్రం అందులో నివాసం ఉంటే మీ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, పైసా ఖర్చులేకుండా మేమే కూల్చివేస్తామని సదరు ఇంటి యాజమానులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇదిలా ఉంటే కొందరు తమ ఇళ్లను కూల్చవద్దని, ఇది కూడా లేకుంటే తాము రోడ్డున పడతామని, ఇందిరమ్మ ఇండ్లను తమకు ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నారు. ఇదికాక గత ప్రభుత్వ హాయంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోనైనా తమకు కేటాయించాలని కోరుతున్నారు. సూర్యాపేట పట్టణంలో శిధిలావస్థకు చేరుకున్న ఇండ్లు ఎక్కువగా కొత్తగూడెం బజార్, కస్తూరి బజార్, బొడ్రాయి బజార్, రాజీవ్‌నగర్ ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఇప్పటికే శిధిలావస్థకు చేరుకున్న ఇండ్లను జెసిబి సహాయంతో నేలమట్టం చేస్తున్నారు. దీని కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వర్షాలు భారీగా పడక ముందే పూర్తి చేయాలని అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.

## కోర్టు తీర్పు మేరకే భవనం కూల్చివేత



**ప్రజాపక్షం/చండూరు:** గ్రామకంఠం భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాన్ని చేపట్టినందుకు కోర్టు ఉత్తర్వుల మేరకు భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేయడం జరిగిందని చండూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం , మున్సిపల్ కోఆర్డినేటర్ గంట సత్యం అన్నారు. బుధవారం చండూరులోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణం చేపట్టి కోర్టు ఉత్తర్వులను దిక్కరించి కాంగ్రెస్ పార్టీ నాయకులపై ,ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డిపై బురద చల్లే చిల్లర రాజకీయాలు చేయడం బిఆర్ఎస్ నాయకులకు తగదని హెచ్చరించారు. ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అందరివాడని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనునిత్యం పాటుబడే నాయకుడని అన్నారు. టిఆర్ఎస్‌లో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వేదిస్తుంటే బీసీ నేతగా గత మున్సిపల్ ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి అక్కునచేర్చుకొని ఎన్నికల్లో గెలిపించుకొని పైస ఖర్చు లేకుండామున్సిపల్ చైర్మన్ చేసిన సంగతి మర్చిపోయావా తోకల వెంకన్న అన్ని ప్రశ్నించారు. చిల్లర రాజీయాలు పక్కన పెట్టి బిఆర్ఎస్ నాయకులు ఒళ్లు దగ్గరపెట్టుకొని వాస్తవాలు మాట్లాడాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె వెంకన్న , దోటి వెంకటేశ్ యాదవ్, డాక్టర్ కోడి శ్రీనివాసులు , కావలి ఆంజనేయులు , భూతరాజు ఆంజనేయులు , కలిమికొండ జనార్దన్ , నల్లగంటి మల్లేశం , అబ్బనబోయిన లింగయ్య , మంచుకొండ సంజయ్ , సాపిడి రాములు , కడారి లక్ష్మణ్ ,బుర్కల ఎలక్షన్ , పంతంగి గిరి, రాంమూర్తి , మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలపైన ఉద్యమం

ఎఐవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సురేష్



**ప్రజాపక్షం/మర్రిగూడ:** దేశ ప్రయోజనాలను ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోదీ విధానాలపై ఉద్యమించాలని భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యను ఆపాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ అన్నారు. అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడి వెళుతున్న నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పుకొట్టాలన్నారు భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో నరేంద్ర మోదీ విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని అమెరికా బహిర్గతం చేసిన మోదీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటు అన్నారు దేశ ప్రజల రక్షణకు అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలనీ వెళ్తున్న మమ్మల్ని అరెస్టు చేయడం నీతిమాలిన చర్యని ఈ సందర్భంగా వారు అన్నారు.



# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** అర్హులైన ప్రతి నిరుపేద అక్కాచెల్లెళ్లకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తుందని పేద, ధనిక అనే తేడా లేకుండా అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలెం గ్రామంలో వీధివీధిన పర్యటించారు. గ్రామంలో మంజూరైన మొదటివిడతలో 42 ఇండ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, జిల్లాకాంగ్రెస్ నాయకులు గోవిందు, రామకృష్ణ, మార్కెట్ కమిటి డైరెక్టర్ నజీర్, మాజీ ఉపసర్పంచ్ రాములు, జయకృష్ణ, కృష్ణవేణి, ఈశ్వర్, తిరుపతయ్య, గ్రామకాంగ్రెస్ కమిటి అధ్యక్షులు రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాములు, జడ్పీటీసి పరుషరాములు, యాదగిరి, శంకర్,ఆంజనేయులు, బీరయ్య పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రియాంకతోకలిసి జిల్లా టీకాల అధికారి డాక్టర్ రవికుమార్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీచేశారు. గ్రామంలోని గర్భిణీస్త్రీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు సకాలంలో అందుతున్నాయా లేవా అని తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా షుగర్, బిపి పెషేంట్లకు అందుతున్న సేవలు, డయేరియా క్యాంపెయిన్ 2025 గురించి ఆరా తీశారు. జూన్ 16నుండి జూలై 31వరకు నిర్వహించే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిరో నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ముందస్తుగా రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లను , 14జింకుమాత్రలను అందజేయాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ బాదం రాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఎఎన్ఎం గజవర్ధనమ్మ, మల్లిక, ఆశా వర్కర్లు జయమ్మ, పార్వతి, విజయలీల పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన డిఇఒ



**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో మాడల్ స్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనలను డీఈఓ గోవిందరాజు. బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనో ప్రకారం భోజనం అందించాలని డీఈఓ కోరారు. ఆరు బయట వంటలు ఎందుకు చేస్తున్నారని మాట కార్మికులను ప్రశ్నించారు. వంట పెన లేదని, అందుకే ఇక్కడ చేస్తున్నామన్నారు. గుడ్డకు బదులుగా పండ్లు అందిస్తున్నారా అంటు వంట కార్మికులను అడిగారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పలు సమస్యల గురించి పాఠశాల ప్రిన్సిపాల్ అడిగి తెలుసుకున్నారు.

## గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక క్యాంపులు



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** గిరిజనుల వికాసానికి, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పీఎం ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో గుర్తించిన 25 గిరిజన ఆవాసాలలో ఈ నెల 25 నుండి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్ తెలిపినారు. ఈ సధస్సులలో భాగంగా గురువారం మహమ్మదాబాద్ మండలంలోని సంగయ పల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని, జిల్లా గిరిజన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ద్వారా ప్రకటించబడిన ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభిమాన్ , దర్తి ఆభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభిఆన్ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే కార్యక్రమంలో కింద ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కులం సర్టిఫికెట్లు, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్ ధన్ బ్యాంక్ అకౌంట్ మొదలగునవి లేని వారి పేర్లు గుర్తించి, వారందరికీ ఆయా సేవలు అందజేయుటకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సమావేశంలో, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. జనార్థన్, ఎన్‌డిఎం కాల్వ భాస్కర్, ఎస్‌బిహెచ్, మహమ్మదాబాద్, మేనేజర్, రవీందర్, పంచాయతీ కార్యదర్శి కీర్తి , అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/మక్తల్:** తెలంగాణ రాష్ట్రంలో గల క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కొరకు జూన్ 26న నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలో మక్తల్ మండలం నుండి 7 మంది విద్యార్థులు వెన్నెల, శ్రీనిధి, ఈశ్వర్, హర్షవర్ధన్, వర్షిత్ కుమార్ (మక్తల్), సావిత్రి (కర్ని) నిశాంత్ (చిట్యాల) బాలబాలికలు పాల్గొని అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి, రాష్ట్రస్థాయి ఎంపికలలో పాల్గొనుటకు 7 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, కోచ్ అమ్రేష్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పాటశాల కొరకు జరుగు ఎంపికలలో పాల్గొనుటకు ఎంపికైన 7 మంది బాల బాలికలు ఈనెల 4,5 తేదీలలో హైదరాబాద్ హాకీంపేట క్రీడా పాఠశాలలో జరుగు ఎంపికలలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా సైకిలింగ్ సంఘం ఆధ్వర్యంలో బాల బాలికలకు 9 క్రీడాంశాలలో 15 రోజులు మెరుగైన శిక్షణ ఇవ్వడం మూలంగా రాష్ట్ర స్థాయికి ఎంపికయారని, వీరికి శిక్షణను ఇచ్చిన అమ్రేష్, రమేష్‌లను బి.గోపాలం అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీని తీసుకురావడం జరిగిందని ఈ పాలసీ వలన గ్రామీణ ప్రాంతాలలోని క్రీడా అణిముత్యాలను వెలికితీసి, జాతీయ అంతర్జాతీయ స్థాయికి పంపడానికి అవకాశం కలదని, మన రాష్ట్రంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాల్ జిల్లాలో మాత్రమే మూడు క్రీడా పాఠశాలలు ఉన్నాయని, క్రీడా పాఠశాలలో ప్రవేశం కొరకు చాలామంది విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారని, మన క్రీడా శాఖ మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి చొరవ చూపి నారాయణపేట జిల్లాలో క్రీడా పాటశాలను ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని కోరారు.

# జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి

### ఆయిల్‌పామ్ సాగుపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** 2025–26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఆయిల్ పామ్ సాగుకై నిర్దేశించిన 1500 ఎకరాల లక్ష్యాన్ని ఉద్యాన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల సమన్వయంతో రైతులను గుర్తించి లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉద్యాన శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయిల్ పామ్ సాగుపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించబడిన 1500 ఎకరాల లక్ష్యంకు, ఇప్పటి వరకు 438.50 ఎకరాలకు, పరిపాలన మంజూరి చేసి 55 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటలను నాటడం జరిగిందని తెలిపారు. ఉద్యాన శాఖలో ఫీల్డ్ సిబ్బంది లేకపోవడంతో మండల వ్యవసాయ అధికారులు, క్లస్టర్ లెవెల్ ఎఈఓ ఈ సహాయంతో ఆయిల్ పామ్ రైతుల గుర్తింపు చేపట్టేందుకు సమావేశంలో చర్చించి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎకరాకు సుమారుగా 50 వేల రూపాయల వరకు, మొక్కలపైనా, డ్రిప్ పైన, 4 సంవత్సరాల వరకు అంతర పంట మెయింటెనెన్స్‌కు సబ్సిడీ రూపేణా ప్రభుత్వం నుండి సహాయం లభిస్తుందని తెలిపారు. ప్రీ యూనిక్యూ ఆయిల్ పామ్ కంపెనీ, జోనల్ మేనేజర్, ఏరియా మేనేజర్, ఫీల్డ్ సిబ్బంది, లక్ష్యం సాధించే విధంగా కష్టపడి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2021 సంవత్సరంలో నాటిన ఆయిల్ పామ్ తోటల నుండి, ఆయిల్ పామ్ తాజా గెలల దిగుబడులు మొదలయ్యాయని ఉద్యాన శాఖ అధికారులు వివరించారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి వారానికి మూడు రోజుల చొప్పున రైతు వేదికలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మొక్కలు, డ్రిప్ కొరకు రైతు వాటా డిమాండ్ డ్రాఫ్ట్ రూపేణా కట్టించి, జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ సంయుక్త సంచాలకులు రామలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి కె.వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్, డి.ఆర్.డి.ఓ నరసింహులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, డివిజన్ ఉద్యాన అధికారులు, ప్రీ యూనిక్యూ ఆయిల్ పామ్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

**వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో అర్జీలు సత్వరం పరిష్కారం**

వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో అందిన అర్జీలు సంబంధిత అధికారులు సత్వరం పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అదేశించారు. ప్రతినెలా మొదటి బుధవారం స్థానిక అర్బన్ తహాశీల్దార్ కార్యాలయంలో వయో వృద్ధులకు, దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని వృద్ధులు, దివ్యాంగుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బుధవారం నిర్వహించిన ప్రజావాణిలో వృద్ధులు, దివ్యాంగుల నుండి 19 అర్జీలు అందినట్లు తెలిపారు. గత నెల ప్రజావాణి సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం గతంలో వచ్చిన ఫిర్యాదుల పై సమగ్రంగా నివేదికను వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార, సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రెండు వైపులా బస్ షెల్టర్ నిర్మించాలని, స్థానిక పద్మావతీ కాలనీ ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇరుకుగా ఉందని, అక్కడి నుండి మార్చాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతి రావు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డిఆర్డీవో నర్సింహులు, అర్బన్ తహాశీల్దార్ ఘాన్సీరాం, ఆర్టీసీ డిఎం సుజాత, సీనియర్ సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షుడు రాజసింహుడు, ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, బాలయ్య, మనోహర్ రావుఏ, కోటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్ల నాణ్యతా లోపంపై సిపిఐ నిరసన



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి పట్టణంలో టీయూఎఫ్ఐడిసి నిధులు రూ.55 కోట్లతో నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణ పనులు కొన్ని వార్డుల్లో నాసిరకంగా ఉన్నాయని సిపిఐ ఆధ్వర్యంలో 20వ వార్డులో కంకర రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పట్టణంలో 19, 20 వార్డుల్లో నిర్మిస్తున్న రోడ్లను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకొని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాసిరకం రోడ్లకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని, రోడ్డు నాణ్యవంతంగా నిర్మించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పలు వార్డుల్లో రోడ్లను నిర్మించడం సంతోషమే అయినా కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా రోడ్డును నిర్మించటం దారుణం అన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజలు సైతం రోడ్ల నిర్మాణంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫోన్లో పర్యవేక్షణ అధికారులను నాణ్యత లోపంపై ప్రశ్నిస్తే అన్ని సవ్యంగ జరుగుతున్నాయని సమాధానం చెప్పుతున్నారన్నారు. కాంట్రాక్టర్లకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. నాసిరకంగా జరిగిన పనులకు బిల్లులు ఇవ్వవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వినాదం, సిపిఐ పట్టణ మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకురుమన్న, అరవిందు, భాను, ప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు బొడ్డుపల్లి సతీష్ , స్వామి, వెంకటయ్య, అలివేల పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు

### అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తేనే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం, భరోసా కలుగుతాయని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో విస్తృతంగా పర్యటించి అర్బన్ హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు రోజుకు ఎంతమంది ఓపి (అవుట్ పేషెంట్స్), ఐపీ (ఇన్ పేషెంట్స్) వస్తుంటారని అక్కడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్.నరసింహారావు సగరిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను, మందుల పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పట్టణంలోని ధూల్‌పేటలో గల అంగన్‌వాడీ కేంద్రానికి ఆకస్మికంగా వెళ్లిన అదనపు కలెక్టర్ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, బోధన తీరును పరిశీలించారు. దూల్‌పేటలోని ఓ అద్దె భవనంలో కొనసాగుతున్న హాజిఖాన్ పేట ఉర్దూ ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య (25 మంది)ను బట్టి హాజిఖాన్ పేటలోని ఆ ఉర్దూ పాఠశాలను ధూల్‌పేటలోని అద్దె భవనంతో గత కొన్నేళ్ళ నుంచి కొనసాగిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఆ భవనం కూలిపోయే స్థితికి చేరింది. బుధవారం ఆ ఉర్దూ పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ భవనం పూర్తిగా శిథాలావస్థకు చేరిందని, ఆ ఉర్దూ పాఠశాలను కూరగాయల మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గల ప్రాథమిక పాఠశాలలో మార్చాలని ఎంఈఓ బాలాజీని ఆదేశించారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు



కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి/ఊర్కొండ :** మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం తాడూరు మండలంలోని సిర్సవాడ జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. బుధవారం విద్యార్థులకు పాఠశాలలో నిర్వహణ, శుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యతవంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని వంటగదిలో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణపై ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. అనంతరం కలెక్టర్ పదో తరగతి లెక్కలు భోదించారు. వారితో లెక్కలు చేయించి సందేహాలు తీర్చారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు లెక్కలపట్ల ఉన్న ఆసక్తిని గుర్తుచేసుకుంటూ పాఠాన్ని నేరుగా బోధించారు.

**వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పంట సాగుమేలు**

మండలంలోని మాదారం గ్రామానికి చెందిన రైతు నీల శ్రీకాంత్ తన వ్యవసాయక్షేత్రంలో 10.19 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సోదరులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంటను సాగుచేసుకోవాలని అన్నారు. నెల నెల స్థిరమైన ఆదాయం ఆయిల్‌పామ్‌తో సాధ్యమన్నారు. నీటి వినియోగం ఎక్కువగా ఉన్న పంటలవైపు రైతులు వెళ్లకుండా ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సహకాలు అందజేస్తున్నారని అన్నారు. అదేవిధంగా మాదారం గ్రామంలో పామాయిల్‌నాటి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకొని తొలిసారిగా ఆయిల్‌పామ్ మొదటిపంట గెలలను మలే కృష్ణారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కలెక్టర్ కోయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకటేశం, కల్వకుర్తి ఉద్యానశాఖ అధికారి మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

## సమన్వయంతో విధులు : ఎస్పీ గిరిధర్



**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** మహిళలు, పిల్లల రక్షణకు షీ టీం, భరోసా, సిబ్బంది స్నేహిత సమన్వయంతో విధులు నిర్వహించి మహిళల రక్షణకు మేమున్నామని భరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిదర్ షీ టీం , భరోసా, యాంటి హ్యూమాన్ ట్రాఫికింగ్ సిబ్బందితో 2025 జనవరి 1 నుండి జరిగిన కేసుల పూర్వపరాలు పరిశీలించి అన్ని విధానాల గురించి సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ షీ టీం సిబ్బంది మీ సహయం కోరి వచ్చే మహిళలు పిల్లల పట్ల గోప్యత పాటించాలని సూచించారు. షీ టీం భరోసా సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు పోక్సో కేస్ స్టడీలను తెలియపర్చి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వర రావు, వనపర్తి సిఐ కృష్ణ, ఆత్మకూర్ సీఐ శివకుమార్, సెల్ బ్రాంచ్ సిఐ నరేష్ , ఏహెచ్‌టియూ ఎస్ఐ అంజద్, షీ టీం, ఏహెచ్‌టియూ, భరోసా సెంటర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలలహక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి

### బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బాలలహక్కుల పరిరక్షణ అనేది పిల్లలందరికి సమానమైన అవకాశాలు, విద్య, వైద్య సదుపాయాలు, భద్రత కల్పించడంతోపాటు పిల్లల అభివృద్ధికి, శ్రేయస్సుకి విద్య, వైద్యం, పోలీస్, స్త్రీ శిశుసంక్షేమ, కార్మికశాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గపరిధిలోని బిజినేపల్లి, తాడూరు మండలాల్లోని ప్రభుత్వబాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయం, అంగన్‌వాడికేంద్రం, అనాథ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించి విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, అందుతున్న భోజనం, విద్య తదితర అంశాలపై ఆమె క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పర్యటించి తెలుసుకున్నారు. చిన్నారులు తమకు ఎదురయ్యే ఇబ్బందులు, బాధలగురించి ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటారని తెలిపారు. బాలలహక్కులు, చట్టాల అమలుతీరును పర్యవేక్షించేందుకు వీలుగా రాష్ట్రస్థాయిలో బాలలహక్కుల పరిరక్షణ కమీషన్ పని చేస్తున్నాయని తెలిపారు. బాలల సంరక్షణ కోసం కృషిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని సూచించారు. ఈసమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్పి రామేశ్వర్, జిల్లామహిళ శిశుసంక్షేమశాఖ అధికారిణి రమాదేవి, జిల్లా బాలల సంరక్షణచైర్మన్ లక్ష్మణరావు, డిఇఓ రమేష్‌కుమార్, జిల్లాబాలల సంరక్షణ అధికారి శ్రీశైలంగౌడ్,సిడిపిఓలు,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# లేఖలు రాసినంతమాత్రాన బనకచర్ల ఆగదు



మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచన

**ప్రజాపక్షం/జడ్చర్ల:** తెలంగాణ ప్రాంతానికి శాపంగా మారనున్న ఏపీ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలంటే లేఖలు రాసినంతమాత్రాన సరిపోదని, తెలంగాణలో ఉన్న చంద్రబాబు కోవర్టులను టైట్ చేస్తేనే ఆ ప్రాజెక్టు ఆగే అవకాశం ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి రాష్ట్ర సాగు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి సూచించారు. బాలానగర్ మండలం మోతీఘనపూర్ గ్రామంలో బుధవారం ముడా నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగానే అనిరుద్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారని తెలంగాణలో పెద్ద కాంట్రాక్టులన్నీ వాళ్లే చేస్తున్నారని చెప్పారు. అప్పుడు వాళ్లే వెళ్లి చంద్రబాబు కాళ్లు పట్టుకుని బనకచర్ల బంద్ చేయిస్తారని అనిరుద్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తాను ఈ విషయంగా చేస్తున్న సూచనను గమనించాలని మంత్రి ఉత్తమ్‌ను కోరారు. మేము చేసిన అభివృద్ధికి మోతీఘనపూర్ గ్రామమే సాక్ష్యం. గత పది ఏళ్లలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మీ గ్రామానికి ఏం చేసారో ప్రజలు ఆలోచించుకోవాలని అనిరుద్‌రెడ్డి ఈ సందర్భంగా మోతీఘనపూర్ గ్రామస్తులను కోరారు. మోతీఘనపూర్‌ను అభివృద్ధి చేయకపోగా ఈ గ్రామానికి రావాల్సిన 4.50 కోట్లు మూడా నిధులు మహబూబ్‌నగర్‌కి మళ్లించారని విమర్శించారు. తనకు మోతీఘనపూర్ గ్రామంతో అనుబంధం ఉందని అందుకే అభివృద్ధి పనుల్లో ఈ గ్రామానికి ప్రాధాన్యత ఇస్తున్నానని తెలిపారు. అందులో భాగంగానే రూ.50 లక్షల నిధులు సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ కోసం మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు గ్రామంలో 3 కోట్ల రూపాయలు రైతు రుణమాఫీ ఇచ్చామని తెలిపారు. మోతీఘనపూర్ గ్రామాన్ని చూస్తే పదేళ్లలో లక్ష్మారెడ్డి చూపిన నిర్లక్ష్యం తాను సంవత్సరం కాలంలో నేను చేసిన అభివృద్ధి ఏమిటో అర్థమౌతుందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా అనిరుద్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## ప్రతి సమస్యను పరిష్కరిస్తాం :ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి ఫోన్ ద్వారా తమ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకి వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు, మురుగు కాలువలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, హిందూ స్మశానవాటిక స్థలం కేటాయింపు, వనపర్తి జిల్లా కేంద్రం చుట్టూ అభివృద్ధి చేసే విధంగా చర్యలు , పీర్ల గుట్ట చదును, లాంటి అనేక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోవడం అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కార కోసం వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగని చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ఆపద్బాంధవు లాంటిదని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కల్వరాలలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగని చికిత్స పొందిన కొత్తకోట కళ్యాణికి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరైన రూ.20,500 చెక్కును నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కొత్తకోట కళ్యాణి కుటుంబ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తకోటభాస్కర్, రంగపురం తిరుపతయ్య, పోచమోని మల్లేష్ , మండ్ల శివుడు, తడకల రాముడు పాల్గొన్నారు.

# రీల్

## 'వార్ 2' కోసం విడివిడిగా ప్రమోషన్స్



'వార్ 2'లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ తొలి సారిగా తెరపైకి కలిసి రాబోతోన్నారు. ఈ క్రమంలో వై ఆర్ ఎఫ్ సంస్థ ఇద్దరికి సపరేట్‌గా ప్రమోషన్స్ చేయించాలని భావిస్తోంది. 'హృతిక్, ఎన్టీఆర్ కలిసి 'వార్ 2'ని ప్రమోట్ చేయరు. ఏ ఈవెంట్‌లో గానీ ఈ ఇద్దరూ కలిసి కనిపించరు. అసలు 'వార్ 2' చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ ఆ ఇద్దరు. అలాంటిది ఆ ఇద్దరినీ ఒకే సారి చూడాలంటే అది తెరపైనే చూడాలి. అంతే గానీ ప్రమోషన్స్‌లో ఏ ఒక్క చోట కూడా ఈ ఇద్దరూ కలిసి కనిపించరు. నేరుగా తెరపైనే ఆ ఇద్దరినీ ఒకే సారి చూస్తేనే ఆ థ్రిల్ ఉంటుందని నిర్మాత ఆదిత్య చోప్రా తెలిపారు. 2025లో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రంగా 'వార్ 2' నిలుస్తుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన 'వార్ 2' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ చిత్రంతో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

## పాటకు పరుచూరి పచ్చజెండా



నల్ల పూసల బాబ్జీ దర్శకత్వంలో నిర్మించిన 'పోలీస్ వారి హెచ్చరిక' సినిమాలోని సామాజిక చైతన్య గీతాన్ని ఎర్ర అక్షరాల రచయిత, తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు పరుచూరి గోపాల కృష్ణ ఆవిష్కరించారు. ఈ చిత్రాన్ని తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్ధన్ నిర్మించారు. ఈ సందర్భంగా పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ చాలా రోజుల తరువాత వెండితెర పైన మళ్ళీ ఇటువంటి అభ్యుదయ గీతాన్ని చూస్తున్నాను, ఈ పాటలో ఉన్న గమ్మత్తు, వైవిధ్యం ఏమిటంటే ఇది ఏ పార్టీనో, ఏ సిద్ధాంతాన్నో ప్రచారం చేసే పాట కాదు, ఈ సినిమా కథ ప్రస్తావిస్తున్న ఒకానొక ఘోరాన్ని నిగ్గదీసి ప్రశ్నించే పాట అన్నారు. చిత్ర దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో భుజం మీద ఎర్ర శాలువాను కప్పుకొని తిరుగుతున్న అభ్యుదయ అక్షర పరుచూరి గోపాలకృష్ణ చేతుల మీదుగా ఈ ప్రశ్నించే పాట ఆవిష్కరించడం తమ యూనిట్ మొత్తానికి సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. చిత్ర నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ.. సినిమాను జూలై మూడవ వారంలో విడుదల చేస్తున్నాము, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాము, సమాజంలోని అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పక్కా కమర్షియల్ సినిమాగా మేము ఈ చిత్రాన్ని రూపొందించామని వివరించారు.


## తప్పుడు ప్రచారం చేయకండి – కోమలి



కోమలి ప్రసాద్ నటిగా తెలుగు తెరపై తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి నటిగా పేరు సంపాదించుకున్నారు. ఇక త్వరలోనే 'శశివదనే' చిత్రంతో తెరపైకి రాబోతోన్నారు. కోమలి ప్రసాద్ మీద సోషల్ మీడియా, మీడియాలో ఓ అసత్య ప్రచారం మొదలైంది. యాక్టింగ్ కెరీర్‌ను వదిలి పెట్టారని, డాక్టర్ వృత్తిలోకి వెళ్లారని కోమలి ప్రసాద్ మీద రూమర్లు క్రియేట్ చేశారు. దీంతో ఈ వార్తల్ని ఖండిస్తూ కోమలి ప్రసాద్ సోషల్ మీడియాలో పోస్ట్ వేశారు. నేను డాక్టర్ అయ్యానని, నటనకు పూర్తిగా దూరం అయ్యానంటూ అసత్య ప్రచారాలు, తప్పుదోవ పట్టించే వార్తల్ని ప్రచురిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు కూడా ఈ రూమర్లను నిజం అన్నట్టుగా ప్రచారం చేస్తున్నాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని స్పష్టంగా చెప్తున్నా. ఎన్నో కష్టాలు ఎదుర్కొని, ఎంతో కష్టపడి ఇప్పటి వరకు సినిమాల్లో కెరీర్‌ను కొనసాగిస్తూ ఈ స్థాయి వరకు వచ్చాను. నాలో, నా శ్రేయోభిలాషులలో అనవసరమైన ఆందోళనలను రేకెత్తించేలా ఈ రూమర్లను ప్రచారం చేస్తున్నారు. ఇలా తప్పు దారి పట్టించే సమాచారం వ్యాప్తి చెందకూడదని నేను కోరుకుంటున్నాను. అందుకే ఈ స్పష్టతనిస్తూ పోస్ట్ చేశాను. చివరి శ్వాస వరకు నటిగా నా బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను. ఈ ప్రయాణంలో నా వెన్నంటే ఉన్న నా శ్రేయోభిలాషులందరికీ, నా కంటే నన్ను ఎక్కువగా నమ్మిన వారందరికీ ధన్యవాదాలు. నేను ప్రస్తుతం స్క్రిప్టులను జాగ్రత్తగా ఎంచుకుంటున్నాను. త్వరలో కొత్త ప్రకటనలతో మీ అందరినీ చాలా గర్వపడేలా చేస్తాను' అని కోమలి ప్రసాద్ అన్నారు.

## త్వరలోనే చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ చేస్తాం

### మీడియాతో దిల్ రాజు చిట్ చాట్



'తమ్ముడు' సినిమా ఈ నెల 4నగా థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను నిర్మాత దిల్ రాజు చిట్ చాట్ చేశారు. శ్రీరామ్ వేణు మా సంస్థలో ఆర్య నుంచి వర్క్ చేస్తున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా, అసోసియేట్ డైరెక్టర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా మాతోనే ట్రావెల్ చేస్తున్నాడు. శ్రీరామ్ వేణు మా దగ్గరనే ఉన్నాడంటే అందుకు మా మధ్య ఉన్న రిలేషన్ కారణం. ఇండస్ట్రీలో డబ్బుతోనే పనులు జరుగుతుంటాయి. నాది భిన్నమైన పద్ధతి. నేను వేవ్ లెంగ్త్ కలిసిన వాళ్లతోనే జర్నీ చేస్తుంటాను. అనిల్ రావిపూడి, శ్రీకాంత్ అడ్డాల, హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి, దశరథ్.. ఇలా డైరెక్టర్స్ మా సంస్థలో వర్క్ చేసి హిట్ చిత్రాలు ఇచ్చారు. శ్రీరామ్ వేణు మా సంస్థలోనే ట్రావెల్ అవుతున్నాడంటే అతనికి భారీగా డబ్బు ఇవ్వడం వల్ల కాదు. మాతో ఆయనకు ఒక కంఫర్ట్ ఉంటుంది. అనిల్ రావిపూడితో నాకొక బాండింగ్ ఉంది. ఆ బాండింగ్‌లో ఒక కంఫర్ట్ ఉంటుంది. 'తమ్ముడు' మూవీ మొదటి 20 నిమిషాల తర్వాత మిగిలిన కథంతా ఒక్కరోజులో జరుగుతుంది. ఐదారు యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. వాటిలో రెండు యాక్షన్ ఎపిసోడ్స్ వైలెంట్‌గా ఉన్నాయని ఎ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ వాళ్లు చెప్పారు. ఆ రెండు ఎపిసోడ్స్ తీసేస్తే యు బై ఎ ఇస్తామని చెప్పారు. ఈ సినిమాను థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసమే చేశాం కాబట్టి ఆ ఫైట్ సీక్వెన్సులు తీసేయకుండా ఎ సర్టిఫికెట్‌కు అంగీకరించాం. తమ్ముడు మూవీ యాక్షన్ ఓరియెంటెడ్ కంటెంట్ ఉన్న మూవీ. థియేటర్స్‌కు వచ్చిన వాళ్లనైనా సంతృప్తి పరచాలి కదా అని ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఈ చిత్రాన్ని 150 రోజులు చిత్రీకరించారు. 80 పర్సెంట్ మూవీ అడవిలో ఉంటుంది. విజువల్స్, సౌండింగ్ హై క్వాలిటీతో ఉంటూ థియేటర్‌లో ఎంజాయ్ చేసేలా రూపొందించారు దర్శకుడు శ్రీరామ్ వేణు. పైరసీ అరికట్టేందుకు ఇండస్ట్రీ నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో సపోర్ట్ చేస్తోంది. థియేటర్స్‌లో కూర్చుని సినిమా రికార్డ్ చేస్తున్న నలుగురిని ఈ మధ్య పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా రికార్డ్ చేసిన సినిమాలను చిన్న సినిమాకు 400 డాలర్స్, పెద్ద సినిమాకు వెయ్యి డాలర్స్ చొప్పున అమ్ముతున్నారు. వాళ్లకు అదే పెద్ద అమౌంట్ కానీ, నిర్మాతలు కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. పైరసీని అరికట్టే చర్యలు క్రమంగా కట్టుదిట్టం అవుతాయని ఆశిస్తున్నాం. 'తమ్ముడు' సినిమాకు ప్రీమియర్స్ వేసే విషయం ఆలోచిస్తున్నాం. ఎందుకంటే ప్రీమియర్స్ కోసం ప్రభుత్వం నుంచి పర్మిషన్ తీసుకోవాలి. నేను ఎఫ్ డీసీ ఛైర్మన్ గా ఒక హోదాలో ఉన్నాను కాబట్టి అన్నీ చూసుకుని చేయాలి. తమ్ముడు మూవీని నెట్ ఫ్లిక్స్ వాళ్లు చూసి నచ్చి తీసుకున్నారు. పైరసీ అయినా, ఈ నెగిటివ్ ప్రచారాన్ని అయినా క్రమంగా ఒక్కో స్టెప్‌తో ఎదుర్కొంటూ వెళ్లాల్సిందే. ఎవరైనా రివ్యూస్ రాసేప్పుడు నిర్మాత గురించి ఒక్క నిమిషం ఆలోచించాలి. ప్రతిభ గల కొత్త వాళ్లకు అన్ని విభాగాల్లో అవకాశాలు ఇవ్వాలనే దిల్ రాజు డ్రీమ్స్ స్టార్ట్ చేశాం. మొదటి రోజునే మాకు 12 వేల అప్లికేషన్స్ వచ్చాయి. అందులో స్క్రూటినీ చేసి 1400 అప్లికేషన్స్ తీసుకున్నాం. ప్రొడ్యూసర్‌గా 81 అప్లికేషన్స్ వస్తే వాటిలో వాళ్ల కంపెనీ హిస్టరీ ఏంటి అని డీటెయిల్స్ చూసి 7 అప్లికేషన్స్ తీసుకున్నాం. ఇందులో రెండు మోడల్స్ చేస్తున్నాం. ఒకటి కథ బాగుంటే మేమే ఫండింగ్ చేసి వాళ్లతో మూవీ చేయిస్తాం. రెండోది వాళ్లే సినిమా చేసుకుని మా ప్రెజెన్స్, మా గైడెన్స్‌లో రిలీజ్ చేస్తాం. ఈ క్రమంలో కొత్త నిర్మాతలు కూడా ఇండస్ట్రీకి వస్తారని ఆశిస్తున్నాం. ఎఫ్ డీసీ నుంచి గద్దర్ అవార్డ్స్ చేశాం. నెక్స్ట్ ప్రస్తుతం మన రాష్ట్రంలో ఆగిపోయిన చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించాలని అనుకుంటున్నాం. ఆన్ లైన్ టికెటింగ్, రన్ ట్రాక్ తీసుకొచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం మా సంస్థలో రౌడీ జనార్థన, ఎల్లమ్మ, దేత్తడి ప్రొడక్షన్‌లో ఉన్నాయి. మరో ప్రాజెక్ట్ కూడా ఉంది. ఈ ఏడాది చేస్తున్న నాలుగు సినిమాలు వచ్చే ఏడాది రిలీజ్‌కు తీసుకొస్తాం.

## రేపు 'సోలో బాయ్' రిలీజ్



సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వినాద్రి, బేబీ నేహా శ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో రేపు ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. బిగ్ బాస్ సీజన్ 7 ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటిస్తూ అనిత చౌదరి, పోసాని కృష్ణ మురళి, అరుణ్ కుమార్, భద్రం, షఫీ, ఆర్కే మామ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. త్రిలోక్ సిద్దు ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా ప్రవీణ్ పూడి ఎడిటింగ్ చేశారు. జుడా సంధ్య ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కు వివి వినాయక్ ముఖ్య అతిథిగా హాజరు కాగా రఘు కుంచే, కేఎల్ దామోదర్ ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు హాజరై సోలో బాయ్ చిత్ర రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్ సక్సెస్ చేశారు. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ సతీష్ బట్టల రామస్వామి బయోపిక్ ద్వారా నిర్మాతగా మారారు. చాలా సాధారణ స్థాయి నుండి నిర్మాతగా మారడానికి ఎంతో కష్టపడి సతీష్ ఇక్కడ వరకు వచ్చారు. ఈ చిత్రంలో నటించిన గౌతమ్ కృష్ణకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.



## తెలుగు తెరపై ఘట్టమనేని మరో వారసుడు

తెలుగు తెరపై మరో వారసుడు పరిచయం కాబోతున్నాడు. సూపర్ స్టార్ క్రిష్ణ మనవడు హీరోగా పరిచయం అయ్యేందుకు సిద్ధం అవుతున్నాడు. ఘట్టమనేని రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయ క్రిష్ణ త్వరలోనే హీరోగా పరిచయం కానున్నారు. నటనకు కావలసిన అన్ని విద్యలు నేర్చుకున్నారు. ఓం భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఘట్టమనేని జయ క్రిష్ణ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

## 'మార్గన్'ను సక్సెస్.. ఆడియెన్స్‌కు థాంక్స్ – విజయ్ ఆంటోని



విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన 'మార్గన్' చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంతో తన మేనల్లుడు అయిన అజయ్ ధీషన్‌ను విజయ్ ఆంటోని తెరకు పరిచయం చేశారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మించగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్ పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పించారు. ఈ సినిమాను జూన్ 27న సురేష్ బాబు తెలుగులో రిలీజ్ అయిన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ దక్కింది. ఈ క్రమంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'మార్గన్' సినిమాను సురేష్ బాబు, రామాంజనేయులు చాలా గ్రాండ్‌గా తెలుగులో రిలీజ్ చేశారు. ఇకపై నా సినిమాల్ని తెలుగులో రిలీజ్ చేస్తానని సురేష్ బాబు అన్నారు. నాకు ఇంత మంచి మూవీని ఇచ్చిన లియో జాన్ పాల్‌కు థాంక్స్. అజయ్‌ను ఇంత బాగా లాంచ్ చేసినందుకు నాకు చాలా సంతోషంగా అనిపించింది. తెలుగు, తమిళంలో అజయ్‌కు మంచి పేరు వచ్చింది. అజయ్ ఇకపై ఇలానే మంచి కంటెంట్ చిత్రాల్ని చేస్తూ ఆడియెన్స్ నుంచి ప్రేమను సంపాదిస్తూనే ఉండాలి. బిచ్చగాడు 2, రోమియో చిత్రాలకు అజయ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు. అజయ్‌తో కలిసి నేను ఇక స్ట్రెయిట్ తెలుగు సినిమాల్ని నిర్మిస్తాను. తమిళంలో ప్రస్తుతం ఏడు చిత్రాల్ని చేస్తున్నాను. అందులో తెలుగు డబ్బింగ్ కోసం మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాను. త్వరలోనే 'భద్రకాళి' రానుంది. అదొక పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్. 'మార్గన్'ను ఇంత పెద్ద సక్సెస్ చేసిన తెలుగు ఆడియెన్స్‌కు థాంక్స్' అని అన్నారు.

## విద్యా విధానం

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్మీడియట్ దశ కీలకమని,ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి విధానం ఉన్నదని, తద్వారా ఆయా రాష్ట్రాలలో డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉన్నదని అధికారులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైన కూడా దృష్టి పెట్టాలన్నారు. 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల' నమూనాలను సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పరిశీలించారు.

### ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా

ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పాఠశాలల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయిన నేపథ్యంలో రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు. 'వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ' నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జెఎన్‌టియు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వైద్యులు.. సర్కార్ దవఖానాలో నెల రోజులు..

డిసెంబర్ 9 నాటికి 3 ప్రభుత్వ ఆసుపత్రులు
సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు సామాజిక బాధ్యతగా ఏడాదిలో కనీసం ఒక నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు సేవలు అందించే ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజలకు సేవలు అందించడం వల్ల వైద్య వృత్తిలో గొప్ప అనుభూతి, ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎఐజి నూతన ఆసుపత్రిని బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్ రంగంలో ఉన్న వైద్యులు, ముఖ్యంగా అమెరికాలో స్థిరపడిన మన రాష్ట్రానికి చెందిన డాక్టర్లు ఎప్పుడైనా ఇక్కడికి వచ్చినప్పుడు వారి సేవలను ప్రభుత్వం వినియోగించుకునేందుకు తగిన ప్లాట్‌ఫామ్ లేదని, ఇందుకు సంబంధించి ఒక వేదికను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే ప్రాణాలు పోతాయన్న అభిప్రాయం నుంచి దూరం చేయాలన్న ఆలోచనతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే వందేళ్ల ఉస్మానియా ఆసుపత్రికి 30 ఎకరాల స్థలం కేటాయించి రూ.3 వేల కోట్లతో కొత్త ఆసుపత్రి నిర్మిస్తున్నామని, నిమ్స్‌లో మరో 2 వేల పడకల విభాగం ప్రారంభించబోతున్నామని తెలిపారు. అదేవిధంగా వరంగల్, అల్వాల్, ఎల్‌బి నగర్, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్‌కు దీటుగా రాష్ట్రంలో 7 వేల పడకలతో ఆసుపత్రులను వచ్చే డిసెంబర్ 9 నాటికి అందుబాటులోకి తేవాలని నిర్దేశించామని సిఎం తెలిపారు. మహిళలు అధికంగా కాన్సర్ భారిన పడుతున్న నేపథ్యంలో నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల్లో కోటి మంది సభ్యులహెల్త్ ప్రొఫైల్ తయారు చేసి వారివారి హెల్త్ ప్రొఫైల్స్‌తో ఒక యూనిక్ ఐడీ నంబర్‌తో కార్డులను జారీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నమని వెల్లడించారు. రాబోయే వంద సంవత్సరాలు లక్ష్యంగా తెలంగాణ రైజిం గ్ 2047 విజన్ డాక్యుమెంట్‌లో ఒక చాప్టర్ ఆరోగ్య రంగమని, ఇందుకు డాక్టర్ నాగేశ్వర రెడ్డి భాగస్వామ్యం అందించాలన్నా రు. హైదరాబాద్ నగర ప్రజలకు రెండో అతిపెద్ద ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ నాగేశ్వరరెడ్డిను సిఎం అభినందనలు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 65 దేశాల నుంచి చికిత్స కోసం ఏఐజీ ఆసుపత్రికి వస్తున్నారంటే అది రాష్ట్రానికి గర్వకారణమని సిఎం పేర్కొన్నారు.



## అమర్‌నాథ్ మొదటి బ్యాచ్ యాత్ర ప్రారంభం

**జమ్మూ :** అమర్‌నాథ్‌కు వెళ్ళే మొదటి బ్యాచ్ యాత్రీకుల ప్రయాణానికి జమ్మూ కశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కశ్మీరులోని రెండు బేస్ క్యాంపుల నుండి ప్రారంభోత్సం చేశారు. ఈ మొదటిబ్యాచ్‌లో 5,880మంది యాత్రికులు బయలుదేరి వెళ్ళారు. వారికి బహుముఖ వలయాల భద్రత సమకూర్చారు. భారీ భద్రత మధ్య భగవతి నగర్ బేస్‌క్యాంప్ వద్ద ఆయన పూజలు జరిపారు. తర్వాత జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. భారీ వర్షాల నడుమ భం..భం.. భోలే.. హర హర మహాదేవ్ అని యాత్రికులు నినాదాలు చేస్తుండగా, ఎంతో ధైర్యసాహసాలతో జమ్మూ నుండి యాత్రికుల వాహనాలు బయలుదేరాయి. యాత్రికుల నినాదాలతో జమ్మూ నగరం ఎంతో పవిత్రతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గవర్నర్ తోపాటు స్థానిక శాసనసభ్యుడు, వివిధ మతాధికారులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భద్రతాధికారులు ఈ యాత్రను, యాత్రికులను ఇరవైనాలుగు గంటలూ కంటికిరెప్పలా కాపాడేందుకు సన్నద్ధమయ్యారు. రాజ్‌భవన్ వద్ద పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద సమగ్ర కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆర్‌ఎఫ్ ఐడి ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థను కూడా అనుసంధానం చేశారు. జులై మూడో తేదీ గురువారంనాడు రెండు మార్గాలలో కశ్మీరు లోయ నుండి యాత్ర మొదలవుతుంది. సంప్రదాయంగా అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న నున్వాన్–పహల్గామ్ మార్గంలో 48 కి.మీ ప్రయాణం చేసి అమర్‌నాథ్‌కు చేరుకుంటారు.







## హస్తం... సమాయత్తం...

(మొదటి పేజీ తరువాయి)

ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు ముఖ్య నేతల సమక్షంలో కీలక సమావేశాలను నిర్వహించారు. ఇప్పటికే టిపిసిసి పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పిఎసి) సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షాల వైఖరిపై ప్రధానంగా చర్చించారు. టిపిసిసి అడ్వైజరీ కమిటీ సమావేశంలో పార్టీకి సంబంధించిన కీలక అంశాలపై పార్టీ సీనియర్ నాయకులతో సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఇటీవల కొత్తగా నియమితులైన టిపిసిసి నూతన ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులతో కూడిన కార్యవర్గ సమావేశం కూడా నిర్వహించింది. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం సాధించడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం లాంటి అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో జిల్లాల వారీగా పార్టీ సమావేశాలను, ముఖ్య నేతల సమావేశాలను, ప్రజాసంఘాల సమావేశాలను నిర్వహిస్తూ పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు. తాజాగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుల సమ్మేళనాన్ని ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహించనుంది. గ్రామ స్థాయి నేతలతో నేరుగా ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే సమావేశం దేశంలోనే మొదటి సారి తెలంగాణతో శ్రీకారం చుట్టింది. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్‌ను నింపేందుకు కాంగ్రెస్ చర్యలు చేపట్టింది. దాదాపు పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ (గతంలో టిఆర్‌ఎస్) ఉండడంతో స్థానిక సంస్థల లో కూడా బిఆర్‌ఎస్ పార్టీదే ఆధిపత్యం కొనసాగింది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం 535 జెడ్‌పిటిసి స్థానాలలో బిఆర్‌ఎస్ 446 స్థానాలను కైవసం చేసుకోగా, కేవలం 76 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. మొత్తం 5,738 ఎంపిటిసి స్థానాలలో 3,556 స్థానాలను బిఆర్‌ఎస్ గెలుచుకోగా 1,377 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. ఇక గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కూడా బిఆర్‌ఎస్ హవా కొనసాగింది. మొత్తంగా స్థానిక సంస్థలలో బిఆర్‌ఎస్ పార్టీ పెత్తనమే కొనసాగింది. వాటి పదవి కాలం ముగిసిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం సాధించడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆధిపత్యాన్ని సాధించాలని కాంగ్రెస్ పట్టుదలతో పనిచేస్తున్నది.



'జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా రే ఎల్‌బి స్టేడియంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ(టిపిసిసి) ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 'క్షేత్రస్థాయి కార్యకర్తల సమ్మేళనం' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎఐసిసి ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ తదితరులతో కలిసి పరిశీలించి... దిశా నిర్దేశం చేసిన మంత్రి శ్రీధర్ బాబు.

## విజయవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో బుధవారం భట్టి విక్రమార్క, ఎఐసిసి రాష్ట కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుదిళ్ళ శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు రోహిన్ రెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామ శాఖ అధ్యక్షులతో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా సమావేశం కావడం దేశంలోనే ఇది మొదటిసారి అని డిప్యూటీ సిఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రం అనంతరం దేశవ్యాప్తంగా ఈ తరహా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సభ నేపథ్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ సిఎం వివరించారు. నాలుగో తేదీన సాయంత్రం మూడు గంటలకల్లా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, మంత్రులు సమన్వయంతో సభను విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం పిలుపునిచ్చారు. గ్రామ శాఖ అధ్యక్షులతో ఎఐసిసి అధ్యక్షుడు మాట్లాడే కార్యక్రమానికి మొదటి అవకాశం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చినందుకు ఎఐసిసికి ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం కృతజ్ఞతలు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com